# గులాబీల తోట నవల

- నాదెళ్ల అనూరాధ



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 87

**చదువుకునే పిల్లలు విరిసే గులాబీమొగ్గలు. ప్రతి పాఠశాల ఓ గులాబీల తోట.**

**అలాంటి ఓ గులాబీల తోటకి నీరుపోసి జీవమిచ్చిన ఈ మహిళ కథ!**

**వాస్తవ సంఘటనలకు నవలా రూపం!**

## 1

"'There have been great societies that did not use the wheel, but there have been NO societies that did not tell stories"- Ursula K. Le Guin, American Author.

జూన్ ఒకటో తేదీ ! స్కూల్ తెరిచేందుకు ఇంకా రెండు వారాలు సమయం ఉంది . సంవత్సరాల తరబడి పదో క్లాస్ పిల్లలకి , అందరికంటే ముందుగా, జూన్ ఒకటో తేదీన క్లాసులు మొదలు పెట్టడం ఆనవాయితీ . స్కూల్ కోసం అంకిత భావంతో పని చేసే ఆ టీచర్లు అందరూ ఠంచనుగా పొద్దున్న 7,30 కి స్కూల్ కి వచ్చేసేరు .

విశాలమైన స్కూల్ ఆవరణలో పరుచుకున్న చెట్ల నీడలో రజని , మిసెస్ శర్మ , గీత, వసుధ , ఆరాధన అందరూ నిశ్చేష్టులై నిలబడి ఉన్నారు. ఒక్క వనజ మాత్రం లేదు. ఆమె ఒకటి రెండు వారాల్లో ఈ టీమ్ తో కలుస్తుంది. ఆ రోజు క్లాసులు తీసుకో నక్కర లేదని అధికారిక ప్రకటన .

మాన్ సూన్ ఆరంభం అయ్యేందుకు ఇంకొక్క నాలుగు రోజులు సమయము ఉంది . ఎండలతో ఉక్కిరిబిక్కిరైన ముంబై మహానగరం కమ్ముకొచ్చే మేఘాల కోసం ఎదురు చూస్తోంది. టి .వి . న్యూస్ లో చూబిస్తున్న వర్షపు చినుకుల కే పరవశించిపోతూ ' రిం ఝిమ్ రిం ఝిమ్ బర్సే ' అనుకుంటూ కూనిరాగాలు తీస్తున్నారు . వస్తూ వస్తూ వర్షం తెచ్చే ఇక్కట్లు అక్కడి వాళ్ళకి కొత్త కాదు. వర్షపు నీళ్లతో మునిగిపోయే రోడ్లు, ట్రాక్స్ మీద నీళ్ల మధ్య నిలిచిపోయే లోకల్స్, ఎడతెరిపి లేని వర్షాలకి బీరువాల్లో బట్టల మధ్య చేరే చెమ్మ ............. అన్నింటికీ సిద్ధపడి పోయి ఉన్నారు .

రజనికి ఆశ్చర్యం గా ఉంది , ఇంకో రెండు వారాల్లో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుంది. వేసవి సెలవలు పూర్తిచేసుకున్నాక కొత్త విద్యా సంవత్సరపు ఆరంభంలో ఇలాటి ఒక సన్నివేశాన్ని ఎదుర్కోవలసి వస్తుందన్న సందేహం ఎవరికీ లేదు . అంత సడన్ గా ............

ఈ నెల రోజుల్లో ఏమైంది ? సెలవుల్ని ఆస్వాదించి, సంవత్సరానికి సరిపడా శక్తి ని పోగుచేసుకుని వస్తే.. ఇదేమిటి ? ముందుగా తేరుకుని నోరు విప్పింది రజనియే .

" క్లాసులు ఎందుకు కాన్సిల్ అయ్యాయో మీలో ఎవరి కైనా తెలుసా ? " ఎవరికీ తెలియదు .

ఆఫీస్ క్లర్క్ కమలిని కూడా తెలియదంటుంది . పోనీ రేపటి నుండి క్లాసులు జరుగుతాయా అంటే ఆమె జవాబు చెప్పలేక పోయింది , రేపటి దాకా తెలియదంది .

ఆ చెట్ల కింద నిలబడిన వందమందికి పైగా ఉన్న పిల్లలకి ఏమీ అర్థం కాక మౌనంగా నిలబడి ఉన్నారు. క్లాసులు లేవు అనగానే నమ్మలేనట్లు చూస్తూ ఉండిపోయేరు. స్కూల్ లో పదో క్లాస్ పిల్లలుకి దొరికే ప్రత్యేక హోదా పట్ల వాళ్ళ అందరికీ ఎప్పటినుండో ఒక ఆకర్షణ. చిన్నప్పటి నుండి తమ సీనియర్లు అందుకునే ఆ ప్రత్యేకత కోసం పది సంవత్సరాలు ఎదురు చూసేరు మరి. పబ్లిక్ పరీక్షల బాధ్యత ఒకటి వాళ్ళ మీద ఉన్నా సంవత్సరం పొడుగునా తమకి కేటాయించే ప్రాముఖ్యత వాళ్లకి ఇష్టం.

తాము స్కూల్ చదువులు ముగించుకుని పెద్దరికాన్ని, తమదైన వ్యక్తిత్వాన్ని సంతరించుకోవడమే కాకుండా , పెద్దవారితో సమానమైన పంక్తిన నిలబడే అర్హతేదో వచ్చేస్తుందని ఎదురు చూస్తుంటారు .

వాళ్ళ కలలు , ఆశలు ,ఆశయాలు వారి కళ్ళలో ప్రతిఫలిస్తుంటే వాళ్లని చూడటం, వినటం కూడా రజనికి ఎంతో ఇష్టం. వాళ్ళని ఆదర్శ వంతులైన పౌరులుగా తీర్చిదిద్దే అపురూపమైన అవకాశం స్కూల్ లోనే సాధ్యం అనుకుంటుంది. ఈ సంవత్సరం దాటిందంటే వాళ్ళ పసితనం, అమాయకత్వం ప్రపంచ మాయలో పడి మాయమై పోతాయి. ఇకపైన వీళ్ళని నిత్యం చూస్తూ, చదివిస్తూ , నేర్పిస్తూ , కోప్పడుతూ , ప్రేమించేందుకు ఎక్కడ దొరుకుతారు ?

ఏమీ తోచనట్లుగా అలా కాస్సేపు నిలబడిపోయి ఇళ్ళ ముఖం పట్టేరు ఎవరికీ వాళ్ళు .

ఉత్సాహం అంతా ఆవిరైపోయి రజని ఇల్లు చేరింది .

ఇప్పుడేమి చెయ్యాలి? స్కూల్ లేకపోతే ఏమి లేనట్లు ఉంది. ఎన్నేళ్ళ అనుబంధం!!

ఆఫీస్ కి బయలుదేరుతున్న మధు ఆమె రాక చూసి ఆశ్చర్య పోయేడు .

తలుపు తీసుకుని లోపలికి వచ్చిన మనీషా రజనిని ఆ సమయం లో ఇంట్లో చూసి ఆశ్చర్య పోయింది. ఇంటి పనుల్లో రజనికి కుడి భుజం లాటిది మనీషా .

" దీదీ ! స్కూల్ గయీ నయీ?" కించిత్ ఆశ్చర్యం మనీషా గొంతులో.

విషయం విన్నాక మాత్రం " ఠీక్ హై దీదీ , ఆరామ్ కరో " అంటూ తన పనుల్లో పడింది.

మనీషా మాటలకి కూతురు గుర్తు వచ్చింది రజనికి ....

ఏమి చెప్పినా ' ఇట్సోకే ' అంటూ తేల్చేసే విరాజిత ! చదువుకోవాలంటూ సముద్రాలు, ఖండాలు దాటి దూరంగా

వెళ్ళింది . ఇక ఇప్పుడు చదువు అయిపోతుంటే ఉద్యోగం అంటుంది. ఎందుకో కూతురి మీద దిగులు దిగులు గా అనిపించింది . చూడాలనిపించినా చూడలేని దూరాలు ! అలా అంటే ఒప్పుకోదుగా .

" హాయిగా ఎప్పుడంటే అప్పుడు స్కై ప్ లో చూస్తున్నావు, మాట్లాడుతున్నావు . చాలదా" అంటూ కిలకిలా నవ్వేస్తుంది.

కూనిరాగాలు తీస్తూ పనులు చేసుకుపోతున్న మనీషా ని చూస్తే గర్వంగా, ఆశ్చర్యం గా కూడా ఉంటుంది.

తెలవారి లోకల్ పట్టుకుని పనుల్లోకి వస్తుంది. ఇంట్లో ఉన్న అందరి ఆర్థిక అవసరాలు తీర్చే వ్యక్తి. ఎప్పుడూ అనారోగ్యమనో ,మరొకటనో సెలవు పెట్టదు. విసుగెత్తి ' నువ్వు రెండు రోజులు రావద్దు, విశ్రాంతి తీసుకో ' అంటే నవ్వుతుంది .

"నువ్వు ఒక్క దానివే దీదీ సెలవు తీసుకో మంటావ్ , ఇంకెవరూ అనరు" అంటుంది .

" అందరూ నెలకి నాలుగు ,ఐదు సెలవులు తీసుకుంటారు, నువ్వు ఎందుకు తీసుకోవు ?" అంటే ,

" నాకు పని చేస్తుంటే బావుంటుంది" అంటుంది .

ఒక్కోసారి బలవంతంగా పనిలోకి రానివ్వక తనవరకు తన పనుల నుండి సెలవు ఇస్తుంది .

******************************

సాయంత్రం నడకకి కాళ్లు అలవాటుగా లాక్కుపోతున్నాయి. రజని స్కూలు వరకు అసంకల్పితంగా నడిచింది . అలవాటైన దారి. స్కూల్ తన జీవితంలో ఇంతగా పెనవేసుకు పోయిందన్న విషయం ఆమెకు ఆశ్చర్యంగా ఉంది. రేపైనా క్లాసులు జరుగుతాయా ? జరగకపోవటం అన్న ఆలోచనే చిత్రంగా అన్పిస్తోంది .

దారి పొడవునా స్కూల్ పిల్లలు ఎదురవుతూ విష్ చేస్తూనే ఉన్నారు. పదో క్లాసు పిల్లలు ఒకరిద్దరు ఎదురై ఎందుకు క్లాసులు జరగలేదని ఆత్రంగా అడుగుతుంటే ఏం చెప్పాలో తెలియలేదు. ఈ పిల్లలు అందరూ ఏమైపోతారు? వాళ్ల చదువులు ఏమైపోతాయి ? ఇన్ని వందల మంది ఎక్కడికి వెళ్లిపోతారు ?

దూరంగా ఉన్న ఆట స్థలంలో పిల్లల కేరింతల మధ్య క్రికెట్ నడుస్తోంది. స్కూల్ దగ్గరకొచ్చి అలా నిలబడిపోయింది . తనకి తెలిసున్న స్కూలేనా ఇది ? !

పడమటి దిక్కు ఇంకా వెలుతురు బలంగా చిమ్ముతూనే ఉంది . సాయంత్రం ఆరుగంటల సమయంలో కూడా ఎండ చురుగ్గానే ఉంది .

ఇన్నేళ్లుగా ప్రతి ఉదయం, సాయంత్రం తను చూస్తూ, పలకరిస్తూ,'ఇది నాది' , 'నాదైన ప్రపంచం ' అని గర్వంగా చెప్పుకునే స్కూలు ! ఈ రోజెందుకో తనకు పరిచయమే లేనట్లు తోస్తోంది. అకస్మాత్తుగా స్కూలుకు, తనకి మధ్య ఒక క్రొత్తదనం ఏదో తోస్తోంది .

ఆవరణమంతా నిశ్శబ్దంగా ఉంది . ఆఫ్టర్ నూన్ సెషన్ పూర్తి అయి ఇళ్ళకి వెళ్ళే పసివాళ్లతో ,వాళ్ల నడకలు ,పరుగుల చైతన్యంతో నిత్యం మురిసిపోయే ఆ పరిసరాలు తనని ప్రశ్నిస్తున్నట్లు ఫీలయ్యింది ఆమె. స్కూల్ చుట్టూ ఒక రౌండ్ తిరిగి గేటు ముందుకు వచ్చేసరికి సోనార్ బాయి ఎదురైంది , “'స్కూల్ తెరవలేదేమమ్మా ?” అంటూ .

స్కూలు గేటు ముందు మధ్యాహ్నాలు, సాయంకాలాలు ఏవేవో చిరుతిళ్ళు అమ్ముతుండే ఆమెకేం చెప్పాలి ? ఆ స్కూలు నిర్మాణ సమయంలో అక్కడ పని చేసిన అనుభవం సోనార్ ఎన్నోసార్లు చెప్తుంటుంది. తన భర్త మేస్త్రీ గా ఉండే రోజులు , కరస్పాండెంట్ గయక్వాడ్ సీనియర్ తో తమకున్న అనుబంధం నిన్న మొన్న జరిగినట్లు మెరిసే కళ్లతో చెప్పుకొస్తుంది.

ఆమె మనవరాలు మున్నీ పరుగెత్తుకొచ్చింది "టీచర్ , ఈ రోజు ఫిజిక్స్ పాఠం చెబుతారా?” అంటూ. పదో క్లాసుకొచ్చిన ఆ పిల్ల చదువు పట్ల చూబించే ఆసక్తి చూస్తే రజని కి ముచ్చట.

"ఒక అరగంట ఆగి రా మున్నీ " అంటూ వెనక్కి తిరిగింది.

సోనార్ కి విషయం ఏమీ అర్థం కాలేదు. మౌనంగా స్కూల్ ఆవరణలో చెట్ల క్రింద రాలిన ఆకులన్నీ తుడవటం మొదలు పెట్టింది. అది ఎవ్వరూ ఆమెకి అప్పగించిన బాధ్యతా కాదు, ఉద్యోగమూ కాదు. అయినా ఆ స్కూల్ తమ చేతుల్లో తయారైంది. తమ పిల్లల్ని చదివించి తీర్చి దిద్దుతోంది. అంత వరకే ఆమెకు తెలుసు. ఆమె దృష్టి లో అదొక పవిత్ర స్థలం. తనకు చేతనైన సేవ తను చేసుకుంటూ పోతుంది.

చేతిలో మొబైల్ పలకరించింది. మధు కాల్ !.............

అతన్ని మాట్లాడనివ్వకుండా తనే అనేసింది ." వచ్చేందుకు ఆలస్యం అవుతుంది కదూ!?”

అతను నవ్వేడు .

"అవును రాజీ , చాలా చాలా పని ఉంది. మళ్లీ మాట్లాడుతాను" అంటూనే డిస్కనెక్ట్ చేసేసేడు .

చీకూ చింతా లేనట్టు బ్రతికేస్తాడు. పైగా “ నీకు సమస్త అధికారాలు ఉన్నాయి, నాతో పనేమిటి ? “' అని దబాయిస్తాడు.

తీరా ఒక నిర్ణయం తీసుకోబోతే చటుక్కున సీన్ లోకి వచ్చేసి తను అనుకున్నది అమలయ్యేలా ఒప్పించేస్తాడు . అందుకే కాదూ విరాజిత తన మాట పట్టించుకోదు . అన్ని పప్పా చెప్పాలి .

తను ఏదైనా గొడవ పెడితే “ నోరు పెట్టుకు బ్రతికేస్తున్నావ్" అనేస్తాడు . అమ్మో , ఇలాటి వాళ్ళ ని ఏమనాలి?

నోట్లో మాట లేనట్లు ఉండే సైలెంట్ కిల్లర్స్.

చేతిలో ఈ మొబైల్ ఒక ఆభరణం అయిపోయింది . పది పన్నెండేళ్ళ క్రితం స్టేట్స్ నుండి వచ్చిన వాసంతి చెప్పింది మొబైల్ తమ జీవితాల్లో ఎంతగా పెనవేసుకు పోయిందో . తను నమ్మలేక పోయింది అప్పుడు . కాని ఇప్పుడు ......

ఎవరి చేతుల్లో చూసినా తప్పనిసరిగా ఉండాల్సిందే . మెలకువలోను, నిద్రలోను, ఇంట్లోను, బయటా .. ఎంతగా కనెక్టివిటీ పెంచుతోందో అంతగా మనుషుల్ని డిస్కనెక్ట్ చేస్తోంది .

రజని ఆలోచనలు చిన్నప్పటి రోజుల్లోకి వెళ్ళేయి. తమ చిన్నప్పుడు ఇంట్లో ఫోన్ ఉండటం ఒక స్టేటస్ సింబల్ లా ఉండేది. చుట్టుపక్కల ఉన్న వాళ్ళు "చాలా ముఖ్యమైన పని, ఒకసారి ఫోన్ చేసుకోవచ్చా" అనో , "మా అబ్బాయ్ ఫోన్ చేస్తానన్నాడు, రాత్రి భోజనాలయ్యాక ఎనిమిదింటికి మీ ఇంటికి వస్తాం మాట్లాడేందుకు , మీకు ఇబ్బంది లేదుకదా " అంటూనో ఎవరో ఒకరు వస్తూనే ఉండేవారు.

రెండిళ్ళ అవతల ఆదిలక్ష్మి గారు రావడం తనకు బాగా జ్ఞాపకం. పక్కవీధిలో సుందరత్త తరచు వస్తుండేది. అందరికి ఆవిడ సుందరత్తే . ఆవిడకి ముగ్గురు కూతుళ్లూ దూరంగా ఉండటంతో ,

ఒకమారు " పెద్దపిల్ల తో మాట్లాడాలనో , చిన్నదానికి అత్తగారి సాధింపు ఎక్కువ, చంటిపిల్లలతో ఎలా వుందో" అనో ఫోన్ మాట్లాడాలని వస్తుండేది. ఫోన్ తను చేసినా, తనకి వచ్చినా ఒక పట్టాన ఆ కబుర్లు తెమిలేవి కావు .

" మీ వెనక వాటాలో ముసలాయన కులాసాగా ఉన్నాడా ? చంటిపిల్ల జున్ను అడిగిందన్నావ్ , కాసిని జున్ను పాలు ఎక్కడైనా దొరికేయా లేదా" అంటూ గుర్తు వచ్చిన విషయాలన్నీ మాట్లాడుతూనే ఉండేది . ఆఖరికి ఫోన్ పెట్టేసేక " అడగవలసినవి మరిచెపాయానే.." అంటూ బాధ పడుతుండేది, మళ్ళీ మాట్లాడమంటే, "ఒద్దులే, కూతురు అత్తగారు సాధిస్తుంది అంతంత సేపు ఫోన్లేమిటని" అని నిట్టూర్పు వదిలేది.

ఎక్కణ్ణుంచి ఎక్కడికి వెళ్ళాయి ఆలోచనలు!?

*******************

ఇంట్లోకి వచ్చేసరికి ల్యాండ్ లైన్ లో మిస్డ్ కాల్ ! స్కూల్ ప్రిన్సిపాల్ వీణ మహాజన్ నుండి ....... ఆవిడ ఊరి నుండి వచ్చింది కాబోలు. మాట్లాడాలి అనుకుంటూ రాత్రి భోజనానికి ప్రయత్నం మొదలు పెట్టింది .

సోనార్ బాయి మనవరాలు మున్నీ ,ఆమెతో పాటు వచ్చిన మరో ఇద్దరు పాఠం అయి వెళ్లేసరికి ఎనిమిది అయింది.

చేతిలోకి ఫోన్ తీసుకుంది.

" వీణా జీ ఎప్పుడొచ్చేరు ?"

" ఫ్లైట్ బాగా లేట్ అయింది. ఈ రోజు క్లాసులు జరగలేదుట కదా!?"

"అవును, విషయం ఏమిటో తెలియదు."'

"సరే , రేపు కలుద్దాం స్కూల్లో.. అయితే.. " ,............ సంభాషణ పొడిగించింది ,

“ వద్దను కుంటూనే హైదరాబాద్ ప్రయాణం పెట్టుకున్నాను. మిస్టర్ మహాజన్ హెల్త్ కొంచెం అప్సెట్ అయింది ఈ మధ్య . జాబ్ లో ఒత్తిడి అంటారు. జాబ్ మానరు. అది ఆయన లైఫ్ లైన్" ఆవిడా నవ్వేసింది .

ఎప్పుడో ఒకసారి మాటల సందర్భంలో చెప్పింది భర్తతో తనకు అంతగా కుదరదని. ఆయన అక్కడ ఉద్యోగం చేసుకుంటూ ఉంటే తను మాత్రం అలవాటైపోయిన ముంబాయి వదల లేక ఇక్కడ వుద్యోగం చేసుకుంటూ ఉండిపోయిందట. వాళ్ళ జీవితాలు చూస్తే ఆశ్చర్యం అనిపిస్తుంది రజనికి .

వీణాజీ ఐనా స్కూలు విషయంలో ఏమైనా నిర్ణయం తీసుకోగలదా..!? ఏమో.. చూడాలి. మనసు ఎటునుంచి ఎటు వెళ్ళినా చివరికి ఈ రోజు ప్రారంభం కాని, రేపు ఏమౌతుందో తెలీని స్కూలు దగ్గరకి వచ్చి ఆగుతోంది..!

పొద్దున్నే పక్క మీంచి దిగుతూ ప్రతిరోజూ అనుకుంటుంది రజని తన కోసం ఏదో అద్భుతం ఎదురుచూస్తూ ఉందని .......... అది ఎంత చిన్న దైనా సరే తనకోసం ప్రత్యేకం !

బాల్కనీ లో ఉన్న కుండీలో గులాబీ మొగ్గ తొడిగినా , ఎన్నాళ్ళుగానో పదిలంగా కాపాడుతున్న పక్షి గూడు మరొక సారి గ్రుడ్లని పొదిగినా .....ఏదైనా సరే ........ ఆ రోజు క్లాసులు తప్పక జరుగుతాయని ఆశతో గబగబా తయారవుతోంది .

గీత ఫోన్ కాల్ .......

' రాజీ , ఈరోజు కూడా క్లాస్ లేదు ,స్కూల్ దగ్గరనుండే మాట్లాడుతున్నాను’ .

ఒక్కసారి నిస్సత్తువ ఆవరించింది . 'ఇలా అయితే ఎలా ?'అప్రయత్నంగా నోటి వెంట వచ్చేసింది .

ఒక్కసారి స్కూల్ కి వెళ్లి చూసి ఆ తర్వాత ఏమిచెయ్యాలో చూడాలి అనుకుంది . అదే గీత తో చెప్పింది .

స్కూల్ లో ఎలాటి కబురు లేదు. ఉత్సాహంగా వచ్చిన పిల్లల్ని వెనక్కి పంపేసరికి ఒక్కసారిగా నిస్సత్తువ.

ఇల్లు చేరితే ఒక ఖాళీ తనం ! ఇంటి లో కూర్చునే మూడ్ లేదు .

లైబ్రరీ పుస్తకాలు కూడా వెనక్కి ఇవ్వాల్సిన పని ఉంది . తొమ్మిది కావస్తుంటే పుస్తకాలతో బయలు దేరింది

లైబ్రేరియన్ చాలా ఏళ్లుగా పరిచయమున్న వ్యక్తి. లైబ్రరీకి వచ్చిన వాళ్ళకి కావలసిన పుస్తకాలు ర్యాక్స్ లో వెతికేందుకు ఓపిగ్గా సహాయ పడుతుంటుంది.

' సమ్మర్ వెకేషన్ ఎలా గడిపేరు? ' అంటూ పలకరించింది .

'బుక్స్ ఏమైనా కావాలా ?' అని ఆమె అడిగిన ప్రశ్నకి అప్పుడు అకస్మాత్తుగా జ్ఞాపకం వచ్చింది విజయవాడ నుండి వస్తూ తెచ్చుకున్న జయకాంతన్ ' ఒక మనిషి -ఒక ఇల్లు-ఒక ప్రపంచం '. ఇంక వేరే ఏ పుస్తకాలూ వద్దని చెప్పి బయటకు వచ్చింది .

లైబ్రరీ కి వస్తే రఫి జ్ఞాపకం వస్తాడు.పుస్తకాలంటే ప్రాణం పెట్టేవాడు రఫీ. లైబ్రరీ లో పుస్తకాలు తెచ్చుకుని తనతో పోటీ పడి చదివేవాడు .

రఫీ పేరుకి తగినట్లే పాటలు పాడతాడు. పీ .జి. చేసి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తూ తమ స్కూల్లో వలంటీరింగ్ చేసేందుకు వచ్చేవాడు. స్టాఫ్ రూమ్ లో ఎప్పుడైనా ఖాళీ దొరికితే ,అడగంగానే పాటలు పాడేవాడు . పిల్లలు కూడా ఇష్టపడే మాస్టారు అతను .

ఆర్ధికంగా సమస్యలు ఉన్నా తనకి ఇచ్చే శాలరీలోంచి అవసరమైన వారికి ఫీజులు కడుతుండేవాడు కొన్నాళ్ళకి రఫీ బ్యాంక్ లో ఉద్యోగం వచ్చి నాగపూర్ వెళ్లి పోయేడు. అతని పాట ఎంత మధురంగా ఉంటుందో , అతని వ్యక్తిత్వం అంత చక్కనిది. ఇప్పుడు స్కూలు గురించి చెబితే ఎంతగొడవ చేస్తాడో ! మాట్లాడాలి.

***************************

రాత్రి భోజనం అయి జయకాంతన్ పుస్తకం తీసుకుంది చేతుల్లోకి .

ముందుమాటలో రచయిత చెబుతున్నాడు ' జీవితపు చీకటి పార్శ్వాలను ప్రదర్శించే వాడినని నా గురించి ఒక సాహిత్యాభిప్రాయం ఉంది. అయితే ఈ కథ జీవితం యొక్క ప్రకాశవంతమైన భాగాలను మాత్రమే చూపిస్తుంది. సూర్యుని కిరణాలకాంతి సమస్త వస్తువులపైనా ప్రసరిస్తుంది . కాని ఆ సూర్యుణ్ణే ఒక అద్దమో లేక దోసిలి నీరో ప్రతిబింబిస్తుంది. అలాటి చిన్న అద్దం మనలో ఎక్కడో దాగి ఉండడం అక్షర సత్యం. నేను దాని కాంతిని జీవితంలో ఎన్నో చీకట్లలో చూస్తున్నాను. ' ఎంత బాగా చెప్పేరు రచయిత !

మొదటి పేజీతోనే ఆమెను పుస్తకం తనలోకి లాక్కుంది .

తెలవారుతూనే వర్షం చేస్తున్న అలికిడి ఇష్టంగా వింటూ రజని బాల్కనీ లోకి వచ్చింది. వర్ష ఋతువు ప్రకృతిని నిలువెల్లా ప్రేమధారల్లో ముంచి కొత్త ముస్తాబులు చేసేందుకు వచ్చింది. ఎన్ని సార్లు చూసినా ప్రతి మబ్బూ , ప్రతి చినుకూ ఆమెకొక పరవశాన్ని కలిగిస్తూనే ఉంటాయి . మనసుని జ్ఞాపకాల ముసురులో మునకలేయిస్తాయి.

వర్ష ఋతువు మోసుకొచ్చిన అల్లరి మబ్బులు

ఆకాశం వాకిలినిండా చినుకూ చినుకూ కూర్చి

పందిళ్ళు అల్లుతూనే ఉన్నాయి !

కొట్టి కురిసే నల్లమబ్బుని చొచ్చుకుంటూ

వెలుతురూ దారులూ పాకుతున్నాయి!
నేలమ్మ మీదుగా ఒంగిన హరివిల్లూ
గుసగుసలు చెబుతా నంటోంది !

అన్నీ సరే కానీ ,
పసిడి అందం అద్దుకున్న ఓ మేఘుమా !
కాస్త నిదానించవూ ?
వాన నీటి ప్రవాహంలో నా కాగితపుడవ
నడిచివెళ్లే సమయమొచ్చింది !

ముంబై వచ్చిన కొత్తల్లో ఈ వర్షం ఆమెకొక వింత . రాత్రీ పగలూ ఎడతెరిపిలేకుండా కురిసే వర్షం ! అందరు ఎలా ఆఫీసులకి ,స్కూళ్లకీ వెళ్తారు అని ఆమె కి సందేహం . అయితేయేమి , తెల్లారి కిటికిలోంచి చూస్తే చిన్న, పెద్ద అందరూ రంగు రంగు రెయిన్ కోట్లలో చక్కగా వెళ్లిపోతూ ఉండేవాళ్ళు. అదే మన ఊళ్లో అయితే వర్షం గట్టిగా పడిందంటే జనం పనులు మానుకుని ఇంట్లో కూర్చోడమే . స్కూళ్లకి సెలవు ఇచ్చేసే వాళ్లు. పెద్దవాళ్లు పని ఉండి వెళ్లాలన్నా వర్షం తెరిపి ఇచ్చేక చూసుకుని బయలు దేరేవాళ్ళు.

వర్షం చూస్తూ అలా కిటికీకి అతుక్కుపోయే ఆమెని మధు ఆట పట్టించే వాడు. ' పల్లెటూరి పిల్లని ఇంత పెద్ద సిటీ కి తీసుకొస్తే అన్నీ వింతలే ' అంటూ. ఉరుముల శబ్దం వింటేనే వణికి పోయేది. వర్షం చూసి మురిసే ఆమె ఉరుములు, మెరుపులు చూసి భయంతో ముడుచుకుపోయేది. చిన్నప్పుడు అమ్మ వెనక నక్కి కూర్చునేది. విరాజిత పుట్టేక కూడా ఆ భయం పోలేదు. కూతురు స్కూల్ బస్సు దిగుతూనే అడిగేసేది , ' అమ్మా , నేను స్కూల్ కి వెళ్లి నప్పుడు ఉరుములు వచ్చేయి కదా , భయం వేసిందా' అంటూనే తన చేతిని ప్రేమగా పట్టుకునేది.

వర్షపు రోజుల్లో స్కూల్ రిక్షాకి ముందు వెనుకా శ్రద్ధగా టార్పాలిన్ పరదాలు కట్టి తీసుకెళ్లే వీరయ్య !

స్కూల్ లో ఉండగా వర్షం వస్తే స్కూల్ పక్కనున్న బందరు కాలువ పొంగి పోతుందని, ఊరంతా మునిగి పోతుందని, ప్రళయం అంటే అదే అని శ్రీవల్లి చెప్పేది.

మరి ఇంటికెలా వెళ్ళాలి ? అమ్మని ఎలా చూడాలి ? అంటూ దిగులు పడే తనని మళ్ళీ శ్రీవల్లి ఓదార్చేది, ' భయం లేదులే, భూమి మీద పాపం చేసిన వాళ్ళు కంటే పుణ్యం చేసినవాళ్లు ఎక్కువ ఉంటే, ప్రళయం అప్పుడే రాదులే , మా నానమ్మ చెప్పింది' అంటూ ఆరిందాలా ధైర్యం చెప్పేది . ఇప్పుడెక్కడుందో ! వాళ్ల అత్త కొడుకుని చేసుకుని కలకత్తా వెళ్లిపోయిందప్పట్లో.

కొంచెం పెద్ద అయ్యేక వర్షం పడినప్పుడు కవిత్వం చదువు కునేది. ముఖ్యంగా తిలక్ ' అమృతం కురిసిన రాత్రి '. చదవడం కాదు, పలవరించేది. అది చదువుతున్నప్పుడు నిజంగా అమృతం కురుస్తున్నట్లే అనిపించేది.

అమృతం కురవటం అంటే ఏమిటి ? అసలు అమృతం అంటే ? నిజంగా దేవతలు త్రాగి అమరత్వాన్ని పొందేరా ? అసలు అమృతం రుచి దేవతలకు మినహా ఎవరికైనా తెలుసా ? రుచిగా ఉన్న పదార్థాన్ని తింటే అమృతంలా ఉందంటారు. అంటే దాని రుచి తెలిసిన దేవతలు భూమి మీద ఉన్నారా ?

ముంబై వచ్చిన కొత్త లో మధు, తను ఒక వర్షాకాలపు సాయంత్రం సిటీ లో తిరుగుతూ చటుక్కున అందుకున్న వర్షంలో చిక్కుకున్నారు. అతను ' తడుస్తావ్ ,పద ' అంటూ చెయ్యి పుచ్చుకుని పరుగెత్తబోయేడు.

అతన్ని సున్నితంగా విడిపించుకుంటూ 'తడవడం నాకిష్టం ' అంటూ అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్న తనని వింతగా చూస్తూ, అంత లోనే తన మనసు అర్థమైనట్లు తనూ అతనూ పక్కన నడవడం మొదలు పెట్టేడు . ఇంటికొచ్చేక తుమ్ములు తరుముకొస్తున్నా , మంచి 'అనుభవం నేర్పేవ్' , అంటూ తనని ప్రశంసించ కుండా ఉండలేక పోయేడు.

అబ్బ ,ఏమిటిది ? ప్రతి విషయానికి ఎక్కడికో వెళ్లి పోతుంది మనసు . తీరిక ఎక్కువవుతోందా ? జీవించే ప్రతి క్షణాన్ని ప్రేమించేప్పుడు గతించిన తీపిని అన్ని సార్లు స్మరించుకోవడం ఎందుకో ! వద్దంటే మాత్రం ఆగుతాయా ఆలోచనలు ?

**************************************

' రాజీ ,ఈ రోజు కూడా స్కూల్ ,క్లాసులు లేవు. కాని టీచర్లకి ఏదో మీటింగ్ ఉందంటున్నారు . స్కూల్ కి ఫోన్ చేస్తే న్యూస్ సర్క్యులేట్ చెయ్యమన్నారు మనవాళ్ళకి . '

' మరి సిలబస్ ఎలా అవుతుంది ? ' రజని గొంతులో అసహనం విని నవ్వింది గీత .

' భలేదానివే రాజి , అంతా అగమ్య గోచరంగా ఉంది పరిస్థితి , నువ్వేమో సిలబస్ అంటావ్ '

గయక్వాడ్ సీనియర్ కొడుకులు ముగ్గురు, కూతురు , అల్లుడు ,ఇంకా స్కూల్ కమిటీ మెంబర్లు కొందరు ఉన్నారు మీటింగ్ హాల్లో.

అందరి ముఖాలు గంభీరంగా ఉన్నాయి.

ముందుగా పెద్దవాడైన గోవింద్ రావ్ మొదలు పెట్టి స్కూల్ నిర్వహణ ఖర్చు ఎలా సంవత్సరాల తరబడి పెరుగుతూ వస్తోందో వివరించేరు. ఆ తర్వాత కేశవ్, నారాయణ కూడా మాట్లాడుతూ ఫీజులు పెంచవలసిన అవసరం ఎంతగా ఉందో చెప్పుకొచ్చేరు.

వింటున్న వాళ్ళంతా ఇప్పుడు స్కూల్ తెరిచేక ఈ కొత్త ప్రోపోజల్ ఏమిటని ఆశ్చర్య పోతున్నారు.

' మన సంస్థ ముందు నుండి ఒక సేవా సంస్థ లాగ మాత్రమే పనిచేస్తూ వచ్చింది , ఇప్పుడు పెరుగుతున్న విద్యార్థుల్ని ద్రష్టి లో పెట్టుకుని స్టాఫ్ కోసం ప్రతి సంవత్సరం వెతుక్కునే పరిస్థితి. మనం ఇచ్చే శాలరీ కి ముందుకొచ్చే వాళ్లు తక్కువ . వాళ్లు కూడా మంచి అవకాశం వస్తే బయటకు వెళ్లి పోతున్నారు.

మనం పిల్లల దగ్గర ఫీజ్ పెంచవలసిన సమయం వచ్చింది. గత రెండు దశాబ్దాలుగా ఫీజులు పెంచలేదు. ఇరవై ఏళ్ల క్రితం చెల్లించిన ఫీజులు ఇప్పటికీ అమలులో ఉన్నాయి.. మీరంతా పిల్లలని, వాళ్ల తల్లి తండ్రులని మోటివేట్ చేసి ఇది అమలు అయ్యేలా చూడాలి. రెండు రోజులు పేరెంట్స్ తో మీటింగ్ ఏర్పాటు చేద్దాం.

ముందుగా నోరు విప్పింది రజని . 'సర్ , ఇంత సడన్ గా, స్కూల్ ఓపెన్ చేసే ముందు చెబితే వాళ్లకి కష్టం కదా. మనం ఈ విషయాన్ని సెలవుల ముందు చెప్పినా కొంత టైం ఇచ్చినట్లు అయ్యేది. పదో క్లాస్ పిల్లలకి క్లాసులు మొదలు పెట్టలేదు ఇప్పటివరకు, ఇది పిల్లలమీద ఒత్తిడి అవుతుంది. అదీ కాక ఈ పిల్లలు వచ్చిన నేపథ్యం మనకు తెలుసు. అందరు ఆర్థికంగా చాలా క్రింది స్థాయి వాళ్ళే .'

కేశవ్ రావ్ కాస్త అప్రసన్నంగా చూసి మొదలు పెట్టేడు ,

' మీరు స్టాఫ్ అయి ఉండీ ఇలా మీకే సమ్మతం కానట్లు మాట్లాడితే ఎలా ? మేనేజ్ మెంట్ తరఫున ఆలోచించండి. ఈ పెంచే ఫీజులు లాభాల కోసం కాదు. స్కూల్ నిర్వహణకి మాత్రమే. మనం ఇప్పుడున్న ఫీజులు రెట్టింపు చేసినా అది మిగిలిన ప్రైవేట్ స్కూళ్ల ఫీజులకి ఎక్కడా దగ్గరలో కూడా ఉండదు. ఈ మాత్రం బాధ్యత పిల్లలు తీసుకోక పోతే మనం స్కూల్ నడపడం సాధ్యం కాదు.

' సర్, మీరు చెప్పినవన్నీ వాస్తవాలే . కాని వాళ్ల సమస్యలు, పరిస్థితులు వాళ్లకున్నాయి. ఒక్క ఇంటి నుండి ఇద్దరు, ముగ్గురు పిల్లలు చదువు తున్నారు. ఒక్కసారిగా రెట్టింపైన ఫీజులెలా భరించగలరు? రజని స్కూల్ తో ఉన్న అనుబంధం, అది ఇచ్చిన బలంతో మనసులో ఉన్న మాటలన్నీ చెప్పేసింది .

మిగిలిన అందరూ మాట రానట్లు కూర్చుండి పోయేరు. ఇంకా మాట్లాడేందుకు ఏమీ లేదన్నట్లు మీటింగ్ ముగించేరు .

దారి పొడవునా ఆలోచిస్తూనే ఉన్నారు అందరూ. గీతా అంటుంది , ' అదేమిటి , ఉన్నట్టుండి పెంచిన ఫీజులు, అదీ రెట్టింపుగా మనం చెబితే మాత్రం కట్టగలరా ? ఇదేదో స్కూల్ నడపకుండా మరింకేదో చేసే ఉద్దేశ్యం లా కనపడుతోంది. వాళ్ల ప్రొపోజల్ వాళ్ళకే న్యాయబద్ధంగా అనిపించ లేదేమో అందుకే మనలని మాట్లాడమని చెబుతున్నారు. '

రజని కి కష్టం గా ఉంది ఇలాటి సన్నివేశం . ఏమి కాబోతోంది ఇంకపైన ?

************************************




ఎప్పుడో రెండు దశాబ్దాల వెనుక ముంబై వలస వచ్చింది భర్తతో పాటు . కంపెనీ క్వార్టర్ దొరకడానికి ముందు చెంబూర్ లో బలానీల ఇంట్లో వన్ రూమ్ ,కిచెనెట్ లో ఉన్న రోజులు ! చెంబూర్ లో జీవన్ బహార్ సొసైటీ కి వచ్చిన తొలి రోజులు రజని జీవితంలో గాఢ ముద్ర వేసేయి.

తెలతెల వారుతూ దాదర్ లో దిగి ఇంటి కెళ్తూ దారిపొడుగునా ఆకాశమే హద్దన్నట్లు నిటారుగా నిలబడిన ఆ బహుళ అంతస్థుల భవనాలు, నిర్విరామంగా పరుగులెత్తే వాహనాలు, జనం, జనం ! నిశ్శబ్దంగా కదులుతూ లక్షలాది మందిని ఒకచోట నుండి ఒకచోటకి చేరుస్తున్న లోకల్ ట్రెయిన్లు . అన్నీ వింతలే . సరిగ్గా ఇలాగే వేసవి ముగిసి, మాన్సూన్ ఆరంభం అవుతున్న సమయంలో వచ్చింది.

నలుగురు పిల్లలతో, వృద్ధురాలైన తల్లితో రెండు గదులు, రెండు బాల్కనీలతో ఉన్న ఆ కుటుంబం చూస్తే కొత్తగా అనిపించింది . ఇంట్లో ఒక్క అంగుళం కూడా వృధా కాకుండా అన్నీ అమర్చుకున్న తీరు చూసి మెచ్చుకోకుండా ఉండలేకపోయింది రజని .

బలాని రైల్వే లో చిన్న ఉద్యోగం లో ఉండేవాడు .

స్కూల్లో హిందీ చదువుకున్నా మాట్లాడేందుకు బిడియపడే రజనిని బలవంతంగా తనతో పాటు మార్కెట్ కి తీసుకుపోయేది బలాని ఆంటీ. తాజా కూరలు, పళ్ళు తమ ఊళ్ళో కంటే ఎక్కువ రకాలు కనిపించేవి మార్కెట్ అంతా. తను చూస్తున్న కొత్త ప్రపంచాన్ని పూసగుచ్చినట్లు ఉత్తరాలనిండా నింపి పోస్ట్ చేస్తుండేది తల్లితండ్రులకి, చెల్లెళ్ళకి, తమ్ముళ్ళకి నగర జీవితంలో తను చూస్తున్న వింతలూ కథలుగా చెబుతుండేది. ఉత్తరాలు రాయడం ఒక పెద్ద ప్రాజెక్ట్ . మళ్లీ దానికి జవాబు వచ్చేవరకూ స్థిమితం లేకుండా ఉండేది.

అసలు స్కూలుతో పరిచయం కూడా ఆ రోజుల్లో జరిగిందే కదా..! ఆ తొలిరోజుల్లో ఓ సారి ఏమైందంటే**..**

ఆ తొలిరోజుల్లోనే ఒకసారి మెట్లు దిగుతుంటే వెనకనించి ఎవరో పిలిచినట్లయి ఆగింది. బలానీ ఆంటీ నేస్తం మిసెస్ షా !

'రజనీ, రోజంతా ఏమి చేస్తావ్ ? బోర్ కొట్టదూ ?'

ఏమి చెప్పాలో తెలియక నవ్వేసింది .

' నేను ఒక స్కూల్ లో వలంటీరింగ్ చేస్తుంటాను. నువ్వు కూడా రాకూడదూ ?'

అకస్మాత్తుగా అడిగేసరికి ఏం చెప్పాలో తెలియక చూస్తూ ఉండిపోయింది రజని .

' రేపు వచ్చి చూడు , ప్రొద్దున్నే ఏడున్నరకి సిద్ధంగా ఉండు ' పెద్దరికంగా తనే చెప్పేసింది ఆవిడ .

' నాకు మిసెస్ షా తో వెళ్లాలని ఉంది మధూ ' అని చెబితే ,

' హాయిగా వెళ్ళు , ఇంట్లో ఉండి ఏం చేస్తావ్ ?' అన్న భర్త మాటలకి మరింత ఉత్సాహం వచ్చింది. అప్పుడే కాలేజ్ చదువు అయి వచ్చి, చుట్టూ ఉన్న ప్రపంచం విపులంగా చూస్తూ , అందులోకి మరింతగా చొచ్చుకుపోవాలన్న ఆమె ఆరాటం అతనికి అర్ధమైంది. రాత్రంతా కలత నిద్రతో గడిపి, తెల్లవారకుండా పనులు ముగించుకుని మధు కంటే ముందుగా ఇల్లు వదిలి పెట్టింది రజని.

ఏ ముహూర్తాన ఆ స్కూల్ ఆవరణలోకి వచ్చిందో అదే ఆమె భవిష్య జీవితంలో ప్రముఖ పాత్ర అయిపోయింది . ప్రేయర్ జరిగినంతసేపు, ఆ తర్వాత పిల్లలు క్రమశిక్షణతో క్లాసురూముల్లోకి వెళ్తున్నంతసేపు గమనిస్తూ ఉన్న రజనికి ఆ వాతావరణం నచ్చేసింది. అదే సమయంలో యూనిఫారాల్లో ఉన్నా కూడా ఆ పిల్లల ఆర్ధిక స్థితి అర్ధమైంది . అక్కడ వలంటీరింగ్ అవసరమేమిటో అవగాహన కొచ్చింది.

ఫస్ట్ పీరియడ్ క్లాసుందని తనతోపాటు ఎనిమిదోతరగతికి తీసుకెళ్ళిపోయింది మిసెస్ షా . దాదాపు ఇరవైమంది పిల్లలున్నారు. సీనియర్ టీచర్ కావడంతో ఆవిడ సునాయాసంగా పిల్లలందరినీ తన పాఠంతో కట్టి పడేసింది. పిల్లల ముఖాలు ఉత్సాహంగా ఉన్నాయి . ఆవిడ మధ్య మధ్య అడుగుతున్న ప్రశ్నలకి తడుముకోకుండా జవాబు చెప్పేందుకు ప్రతి విద్యార్థీ సిద్ధపడుతుంటే రజని ఆసక్తిగా చూస్తో కూర్చుంది . ఇంటి దగ్గర నిత్యం ఎదురయ్యే మిసెస్ షా ఆరోజు కొత్తగా కనిపించింది .

క్లాస్ అయ్యేక తిన్నగా కరస్పాండెంట్ గయక్వాడ్ సీనియర్ దగ్గరకి తీసుకువెళ్ళి పరిచయం చేసి , ' సైన్స్ పాఠాలు చెబుతుంది ఈ అమ్మాయి ' అంది .

' ఏం చదువుకున్నావ్ ? ' అని అడిగి,

'మార్నింగ్ సెషన్ లో జరిగే హయ్యర్ క్లాసులకి చెప్పు. ఇక్కడ టీచర్లు అందరూ వలంటీర్లు. పిల్లలకి పాఠాలు చెప్పడం ఇష్టమేనా ? ' అంటు అడిగేరాయన.

ఆయన ప్రశ్నకి ఒక్కసారి విజయవాడలో అమ్మ ఇంటికి పరుగులెత్తింది మనసు . చెల్లెళ్ళ ,తమ్ముళ్ళ హోంవర్కు లన్నీ తనే కదా చూసేది. వాళ్ల ప్రశంసలూ ఉన్నాయి తనకు బోలెడు!

' ఇక్కడ ఉన్న టీచర్లు అందరిలోకి నువ్వు చాలా చిన్న పిల్లవు. మిగిలిన వాళ్ళలో కొందరు పార్ట్ టైం ఉద్యోగాలు చేసే వాళ్లున్నారు. ఇలా రిటైరైన టీచర్లు,ఇంకా రక రకాల వ్యాపకాలు , వృత్తులు ఉన్నవాళ్లు ఉన్నారు. కానీ నాకోసం , ఈ పిల్లలకి చదువులో కాస్త సాయం చేసేందుకు క్రమం తప్పకుండా వస్తున్నారు.'

ఆయన మాటల్ని శ్రద్ధగా వింది రజని.

' నాకు నచ్చింది, నేను రోజూ వస్తాను'అంది సంబరంగా .

ఎప్పుడో రెండు దశాబ్దాల పైమాట ఇదంతా . !!

ఇంత జీవితం గడిచిందా అని ఆశ్చర్యం. తన దగ్గర చదువుకున్న పిల్లలు పెద్దలై ఎదురుపడి నప్పుడల్లా ఒక సంతోషం . స్కూల్లొ ఉన్నంతసేపూ ఆ పిల్లల వయసుకు తానూ వెళ్ళిపోతుంది. హయ్యర్ క్లాసులు తీసుకున్నప్పటి ఒత్తిడి తగ్గించుకుందుకు మధ్య ఒకటి రెండు ప్రైమరీ క్లాసులు తీసుకోవడంతో గంటలు నిముషాల్లా గడిచిపోతున్నట్లు అనిపిస్తుంది స్కూల్లొ .

బొంబాయి వచ్చిన కొత్తల్లో రాసిన బ్యాంక్ పరీక్షలు తాలూకు ఇంటర్వ్యూలు చేసి వచ్చిన రోజు మధు అడిగేవాడు,

' స్కూల్ తోటి , పిల్లల తోటి ఇంత మమకారం పెంచేసుకున్నావ్ . స్కూల్ వదిలి కొత్త ఉద్యోగం లో చేరగలవా ?' అని

.

' నాకైతే ఇదే బావుంది. అనుక్షణం పిల్లల మధ్య వాళ్లకి నేర్పుతూ, వాళ్ళనుంచి నేర్చుకుంటూ . కాని ఇక్కడ ఈ ఉద్యోగం తాలూకు రాబడి నామ మాత్రమే. మన కుటుంబానికి నా సంపాదన కూడా అవసరం అంటే ఆ ఉద్యోగం గురించి ఆలోచించాలి. మీరు చెప్పండి మధూ ',

'రాజీ, కుటుంబం కోసం నువ్వు సంపాదించ వలసిన అవసరం లేదు. ముందునుండి కూడా క్లుప్తంగా ఉండటానికే నేను ఇష్టపడతాను. నువ్వు వచ్చేక నీ కంటూ ప్రత్యేకమైన డిమాండ్లు లేవు. మనసుకు నచ్చే పని చేసే అవకాశం ఎంతమందికి దొరుకుతుంది ? నీకు అలాటి అవకాశం ఉందిప్పుడు. బ్యాంక్ జాబ్ కంటే నీకు ఇది ప్రియమైనది అయితే ఇక్కడే కంటిన్యూ అయిపో '

రజని మనసులో మాటే అతని నోట విన్నాక ఆమె సంతోషానికి అవధులు లేవు .

గైక్వాడ్ సీనియర్ మరాఠి మీడియం లో క్లాసులు నడపడం ఆరంభిం చేక , కొద్ది పాటి ఫీజులతో మంచి చదువులు అందిస్తున్నందుకు చాలా అభినందనలు అందుకున్నారాయన . రేపటి చదువుల కోసం ఇంగ్లీష్ అవసరాన్ని గుర్తించిన తల్లి తండ్రులు పిల్లల కోసం ఇంగ్లీష్ మీడియం కూడా ప్రారంభించమని పదేపదే అభ్యర్ధనలు పెట్టుకోవడంతో ప్రత్యేకంగా ఇంగ్లీష్ మీడియం కూడా ప్రారంభించేరు. సరిగ్గా అది మొదలైన కొద్దికాలానికే రజనికి ఆ స్కూల్ పరిచయం అయింది.

ఇప్పుడు మరాఠి మీడియం తో పాటు ఇంగ్లీష్ మీడియం కూడా నడుపుతున్న పెద్ద స్కూల్ అది. మరాఠి మీడియం వరకు కొంత గవర్న మెంట్ ఎయిడ్ వుంది. టీచర్ల జీతభత్యాల వరకు గవర్నమెంట్ బాధ్యత తీసుకున్నా ఆ స్కూల్ నడిపే బాధ్యత ,దానితో పాటు నడుపుతున్న ఇంగ్లిషు మీడియం స్టాఫ్ జీతాలు మాత్రం యాజమాన్యమే భరిస్తోంది. అక్కడి సిబ్బంది అంతా మంచి

ఆశయాలతో స్వచ్చందంగా తమకు చేతనయింది చెయ్యాలని తపనతో వచ్చినవారే. స్కూల్ ప్రారంభం అయినప్పటినుండి ఎలాటి వేతనం ఆశించ కుండానే పనిచెయ్యడం మొదలు పెట్టేరు .

కానీ గైక్వాడ్ సీనియర్ మాత్రం వాళ్ళని అలా వదిలెయ్యలేదు. తాము భరించ గలిగినంత మేరకు వేతనాన్ని ఇస్తూ వచ్చేరు. రాను రాను కాలం తో వచ్చిన మార్పు ననుసరించి ఇంగ్లిష్ మీడియమ్ లో పిల్లల సంఖ్య పెరుగుతూ రావటం, మరింత మంది సిబ్బంది కావలసి రావటం జరుగుతోంది. కానీ ఇదివరకటిలా అంత తక్కువ వేతనాలకి పనిచేసేందుకు వచ్చే వాళ్ళు కరువై పోతున్నారు. ఎవరినీ తప్పు పట్టేందుకు లేదు. నగర జీవితం ! జీవనప్రమాణాలు తరిగిపోతున్నాయి. కుటుంబ పోషణకి ఇంటికి ఒకరు సంపాదిస్తే జరిగే రోజుల నాటి వాతావరణం సమాజంలో మారి, ఇంట్లో ఉన్నవారంతా పని చెయ్యవలసిన రోజులు వచ్చేయి.

ఈ చుట్టుప్రక్కల కొన్ని వేల మందిని విద్యావంతులని చేసిన విద్యా సంస్థ ! .......... చిన్న చిన్న ఉద్యోగులు, దినసరివేతన కూలీలు పిల్లల్ని తీసుకొచ్చి స్కూల్లో చేర్పించి నిశ్చింతగా వెళ్ళే వారు . రజని, మిసెస్ షా , మిసెస్ శర్మ ,వైదేహి , గీత ... ఎందరో. మంచి టీమ్ గా చాలా ఏళ్లు కలిసి పనిచేసేరు . మధ్యలో కొందరు రిటైరై వెళ్లి పోయేరు. కొందరు కొత్త వాళ్ళు వస్తున్నారు . కానీ నిలకడగా దశాబ్దాల తరబడి అనుబంధం ఉన్నవాళ్ళు కొద్ది మంది మాత్రమే మిగిలేరు. కొత్త గా అపాయింట్ అయినవాళ్ళు ఏడాది కూడా చెయ్యకుండా మరో అవకాశం చూసుకు వెళ్లి పోతున్నారు .

స్కూల్ ప్రారంభించి నప్పుడు కేవలం సమాజానికేదో మంచి జరుగుతుంది, చదువుకునే అవకాశం మరింత మందికి దొరకాలి అనే ఆలోచన. ఒక ఉద్యమం లాగే జరిగింది ఇన్నేళ్ళు . ఆలోచన వచ్చిన వెంటనే సమయం వృధా చెయ్య కుండా క్లాసులు నడుపుతూ వచ్చేరు. ఆశ, ఆశయం గైక్వాడ్ దంపతులవే అయినా, మేమూ చేతనైనంత చేస్తాం అంటూ ఎందరెందరో స్వచ్చందంగా ముందుకు రావడం మొదలైంది , మొదటి రోజు నుండే .

ఏనాడూ 'స్కూల్ ఎలా నడపగలం?' అన్న అధైర్యం అది ఆరంభించిన వాళ్లకి కలుగలేదు .

ఎన్నో సంవత్సరాలు హాయిగా అందరికి పెద్ద అండగా, ప్రతి విషయం లోను మార్గ దర్శకత్వం చేస్తూ ఉన్న గైక్వాడ్ సీనియర్ అనారోగ్యం తో ఉండటం అందరికీ బాధ కలిగించినా, వయోధర్మ రీత్యా ఎవరూ ఏమీ చెయ్యలేని పరిస్థితి .

అప్పట్లోనే ఓ సారి - రజని, మిసెస్ శర్మ, గీత, మిగిలిన అందరూ స్కూల్ వరకూ రాలేని స్థితి లో ఉన్న ఆయనని చూడడానికి వెళ్ళినప్పుడు కూడా ఆయన స్కూల్ గురించిన ప్రశ్నలతో అందరిని ముంచెత్తేరు. స్కూల్ కాంపౌండ్ లో ఉన్న మామిడి, నేరేడు చెట్లు ఎలా ఉన్నాయని, ఒక మూలగా చిన్న పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు, ఉయ్యాళ్ళు సక్రమంగా ఉన్నాయా, లేదా అని,రెండో అంతస్థులో వర్షానికి కురుస్తున్న క్లాసురూమ్ రిపైర్ పూర్తి అయిందా అని , గేటు దగ్గర సిమెంట్ పెచ్చులు ఊడిపోయి పిల్లలు దెబ్బలు తగుల్చు కుంటున్నారని విన్నానని , వెంటనే ఆ రిపేర్ పని పూర్తి చేయించమని మేనేజ్మెంట్ కి పురమాయించేననీ , ఆ పని అవుతోందా అని ఇలా ఆయన వేసిన ప్రశ్నలు ఆ వయస్సులో , అనారోగ్యంతో ఉండి కూడా పిల్లల మీద ఆయనకున్న మమకారం , ప్రేమ అర్ధమై అందరి మనసులూ బరువెక్కేయి.

తన ప్రక్కనున్న అటెండెంట్ ని పిలిచి ఇంట్లోకి వెళ్ళి చాయ్, నమ్కీన్ పంపించమని చెప్పమన్నారాయన, వద్దు వద్దు అని అంటున్నా వినకుండా .

వెళ్ళిన వాళ్ళందరిని పేరు పేరునా కుటుంబ సభ్యుల బాగోగులు అడిగి సంతృప్తి గా తలాడించేరాయన. మిసెస్ శర్మ ని ' పిల్లలెలా ఉన్నారు ' అన్న ప్రశ్నకి ,'పిల్లలా?' అన్న ఆమె మాటకి వెంటనే సర్దుకున్నారాయన. ఆమె ముఖంలోకి దీక్షగా చూస్తూ అన్నారాయన ............ '

'స్కూల్లో ఇన్ని వందల మంది పిల్లలున్నారు , వాళ్ళు నీ పిల్లలు కాదా?' తన జ్ఞాపక శక్తి ఇంకా చురుగ్గానే ఉందన్నట్లు నవ్వేసేరాయన.

ఆమె నవ్వింది . ' అవును, వాళ్ళంతా నా పిల్లలే . ఇంకా నాకు ఇంట్లో వయసుమీరిన అత్తమామలున్నారు. వాళ్ళు నా పిల్లలే ' ఆ మాటలకి ఆయన మళ్లీ హాయిగా నవ్వేరు .

' ఈ రోజు మీరంతా రావడం నాకు చాలా చాలా సంతోషంగా ఉంది. ఎప్పుడో నా పూర్వీకుల నుండి వారసత్వంగా వచ్చిన ఆ స్థలం ఏవిధంగా సద్వినియోగం చెయ్యాలా అని ఆలోచించేము నేను, నా భార్యా. ఆమెకి , నాకూ కూడా పిల్లలంటే ప్రేమ. అందుకు స్కూల్ ప్రారంభించాలనుకున్నాం. నా ఉద్యోగ బాధ్యతలతో బిజీగా ఉన్న రోజులవి. మా పిల్లలు కాన్వెంట్ చదువులకి వెళ్తున్నారు. ఆమెకి కొంత తీరిక ఉండేది. స్కూల్ బిల్డింగ్ మేమిద్దరం కూర్చుని డిజైన్ చేసుకున్నాం . ... .. 'ఊపిరి పీల్చుకు నేందుకు అన్నట్లు ఆగేరు.

ఎవరో ఒకామె టీ వగైరాలు మెయిడ్ తో పట్టించుకు వచ్చింది .

' ఈమె నా కోడలు మీనా ' అంటూ పరిచయం చేసేరు .

' మీరు ఎక్కువగా మాట్లాడటం మంచిది కాదు ' అంటూ ఆయన్ని హెచ్చరించింది మీనా .

' నాకేమైంది ? నేను శుభ్రంగా ఉన్నాను . వీళ్ళంతా డ్యూటీ పూర్తి చేసుకుని ఇళ్ళకి వెళ్ళకుండా నన్ను చూసేందుకు ఇంత దూరం వచ్చేరు . ఇళ్ళ దగ్గర పిల్లలు ఎదురు చూస్తూ ఉండి ఉంటారు. '

ఆ వృధ్ధుడి ముఖంలో ఒక తృప్తి. వృద్ధాప్యం తీసుకొచ్చిన అసహాయతకి తల ఒగ్గేది లేదన్నట్లు వీల్ ఛెయిర్ లో ధీమాగా, ధైర్యంగా కూర్చున్నారు. ఆమె లోపలికి వెళ్ళి పోయింది.

' ఆ.... ఇందాక ఏమి చెబుతున్నాను ?, స్కూల్ ఎలా మొదలైంది అని కదూ ........

నేను, పిల్లలు వెళ్ళి పోయేక నా భార్య స్కూల్ దగ్గరకొచ్చేసేది. బిల్డింగ్ తయారవడం, ప్రారంభోత్సవం అన్నీ ఆమె చేతుల మీదుగా , ఆమె అజమాయిషీ లో జరిగేయి. నన్ను పిల్లల్ని ఇంట్లో ఎంత శ్రధ్ధగా చూసుకునేదో స్కూల్ని అంతే శ్రధ్ధగా చూసుకుంది. చుట్టుప్రక్కల ఎన్నో స్కూళ్ళు ఉండేవి. కాని మన స్కూల్ పేదవాడికి అందుబాటులో ఉండటంతో చాలా త్వరగా పేరొచ్చింది. సరి అయిన చదువులు లేక జీవిక కోసం వలస వచ్చి చిన్న జీతాలతో గడిపే ఎందరికో తమ పిల్లల్ని చదివించుకుందుకు ఇదొక మంచి అవకాశంగా అందుబాటులోకి వచ్చింది. తమలాగా కాకుండా పిల్లలకి మంచి జీవితాలని ఇవ్వాలన్న

ఆరాటం వాళ్ళకు మొదలైంది. నా భార్య కేన్సర్ తో పోవడంతో ఆమె బాధ్యత ని నేనే మొయ్యవలసి వచ్చింది. పిల్లలు చదువులు ముగిసి ఒక దారి ఏర్పడ్డాక నేను ఉద్యోగం వదిలేసేను . నాకంటూ పెన్షన్ ఉంది. ' ఆగేరాయన.

చటుక్కున రజని వైపు ద్రష్టి పడటంతో పలకరింపుగా నవ్వేరు. విశాలమైన కళ్ళను మరింత విశాలంగా చేసుకుని సీరియస్ గా వింటోంది .

'ఎలా వుంది రజనీ స్కూల్? నువ్వే ఒక పాపాయివి, నీకు వీళ్ళంతా ఇంకా చిన్న పాపాయిలు. . అందరూ చెబుతున్నారు, నీ క్లాస్ నిశ్శబ్దం గా ఉంటుందిట . నీ కోసం గులాబీ పువ్వులు కూడా నడిచి వస్తున్నాయిట క్లాసు రూమ్ వరకు............' ఆయన ముఖంలో నవ్వు!

రజని ఉలిక్కిపడింది. అంత పెద్దాయన తనని ప్రత్యేకించి పలకరించడం, అందరూ నవ్వు ముఖాలతో తనవైపే చూస్తుండటం ........సిగ్గు పడి పోయింది.

మొదటి రోజు పరిచయం అయిన రోజు ' నాకు మీ మదరాసి భాష నేర్పుతావా ? ' అని అడిగినప్పుడు ' నేను మదరాసీ కాదు, ఆంధ్రా నుండి వచ్చేను. మాకు ప్రత్యేకమైన భాష ఉంది ' అంటూ ఉక్రోషంగా జవాబు చెప్పడం జ్ఞాపకం వచ్చి మరింత తల వాలిపోయింది . ఆయన కళ్ళల్లో దయమాత్రం ఉంది.

'నేను ఒక్క విషయం చెబుతాను మీకు ...' ఆయన ఒక్క క్షణం గొంతుకేదో అడ్డు పడ్డట్టు ఆగిపోయేరు .

' స్కూల్ ప్రారంభించిన రోజుల్లో క్లాస్ కి ఇరవైమంది అయినా వస్తారా ? అలా వచ్చినా ఐదు క్లాసులు మొదలు పెట్టాలనుకున్నాం. క్రమంగా ఒక్కో ఏడాది ఒక్కో క్లాసు పెంచుతూ ఉండచ్చు అనుకుంటే మొదటి సంవత్సరమే ఒక్కో క్లాసుకి పాతిక ముప్ఫై మంది పిల్లలు వచ్చేరు. చదువుకుందుకు ఎంత మంది తపన పడుతున్నారో అర్ధమైంది. ఉద్యోగానికి వెళ్లి రావడం, స్కూల్ కొచ్చి ఆ రోజు ఎలా జరిగిందని నా భార్యతో కూర్చుని మాట్లాడటం, ఇద్దరం కల్సి ఇల్లు చేరడము. ఇంట్లో నే కూర్చుని మాట్లాడుకోవచ్చు కానీ స్వంత విషయాల్లో పడి అసలు విషయం వెనక్కి పెట్టేస్తే ?. .

ఒకసారి చాలా దూరం నుండి ఒక అతను తన పిల్లల్ని తీసుకొచ్చేడు. ఈ స్కూల్ లో తమ లాటి వారికి చక్కని చదువులు చెబుతున్నారని తెలిసిందని , తన పిల్లల్ని చేర్చేటందుకు వచ్చేనన్నాడు.

ఆ సంవత్సరానికి క్లాసులన్నీ నిండిపోయేయని, అంతకు మించి చేర్చు కోలేమని చెప్పేసరికి కళ్ళ నీళ్ల పర్యంతం అయిపోయేడు. వచ్చే సంవత్సరం అంటే ఒక సంవత్సరం వృధాగా కాలక్షేపం చేస్తారని, పిల్లలని గ్రామంలో చిన్న స్కూల్ కి పంపేవాడననీ, పని వెతుక్కుంటూ వచ్చి ముందుగా ఉద్యోగం చూసుకున్నానని చెప్పేడు. ఖాళీగా ఉంటే చెడు దారిలో పడతారేమో భయపడుతున్నానని అన్నాడు. ఆఖరికి ఏమన్నాడో తెలుసా .....

ఆ పిల్లలిద్దరూ స్కూల్లో ఏదైనా పని చేస్తూ పగలల్లా ఇక్కడే ఉంటారని, ఖాళీ సమయంలో క్లాసులో పాఠాలు వినేందుకు అనుమతి ఇవ్వమన్నాడు. ఇంకేం చెప్పను ?

మన స్కూల్ కాంపౌండ్ లో ఉన్న పెద్ద పెద్ద వేప, మామిడి , నేరేడు చెట్లు అతను నాటినవే. కాంపౌండ్ పొడవునా ఉన్న చెట్లన్నీ అతని శ్రధ్ధలో పెరిగినవే.

భవన నిర్మాణ పనుల్లో తాపీ పని చేసే మరొక వ్యక్తి వచ్చి పిల్లలకి కనీసంగా చెల్లించాల్సిన ఫీజు కూడా చెల్లించ లేనని ,పెద్దకుటుంబం అవటాన ఖర్చులు వెళ్ళదీయటం కష్టంగా ఉందని, స్కూలు కోసం కానీ, నా కోసం కాని పనిచేసి పెడతానని ఆదివారాలు, అవి కాకుండా దొరికే సెలవు దినాలు ఇక్కడే ఉంటానని చెప్పేడు. అన్నట్లుగానే సెలవురోజుల్లో వచ్చి స్కూలు ఆవరణ అంతా కలియ దిరుగుతూ కనిపించిన పనల్లా చేసేవాడు. తోట పని చేసేవాడు. స్కూలు ఆవరణ అంతా శుభ్రం చేసేవాడు. ఎక్కడ ఏ రిపేరు పని ఉన్నా చక్క పెట్టేవాడు.

ఉచితంగానో, ఉదారంగానో దొరుకుతోంది కదా అని ఏనాడూ వాటి కోసం చెయ్యి చాచకుండా ఆత్మగౌరవంతో తమకు చేత నైన సాయం తామూ చేసి ఈ యజ్ఞం లో భాగ స్వామ్యం తీసుకున్న వాళ్లు ఎందరో ! వాళ్ళందరివి తీర్చుకోలేని ఋణాలు . ' ........... ఏకధాటిగా మాట్లాడుతున్న ఆ వృధ్ధుడి గొంతు ఆవేశంతో వొణికింది.

రజనితో పాటు అందరి కళ్లు చెమర్చేయి. క్రొత్తగా చేరిన టీచర్లు మాత్రం ఇదంతా ఏమిటి అని చూస్తున్నారు. ఎప్పుడో ఏళ్ల క్రితం జరిగిన కథ కి ఇప్పుడెందుకు ఇలా ఇమోషనల్ అవుతారీ పెద్దవాళ్ళు అనుకున్నారు.

' ఇక్కడ తీసుకుంటూ వస్తున్న నామమాత్రపు ఫీజులు ఇప్పటికి సరిపోతున్నాయి . కానీ క్రమం క్రమంగా బిల్డింగులు పాత పడటం, నిర్వహణా వ్యయం పెరుగుతూ పోతోంది . మా అబ్బాయిలు ఫిర్యాదులు చేస్తున్నారు. మీరంతా నామ మాత్రపు జీతాలతో ఇది మీ స్వంత సంస్థ అన్నంత డెడికేటెడ్ గా పనిచెయ్యడం వల్లనే ఇన్నేళ్లు విజయవంతంగా నడిచింది. ఇది ఇలాగే రాబోయే తరాలకి కూడా సేవ చెయ్యాలని నా కోరిక '.

ఆయన కోరిక తీరాలని శ్రోతలంతా మనసుల్లోనే ప్రార్ధించారు మౌనంగా.

అంతే , అదే ఆఖరు ఆయన్ని కలవటం. ఆ తర్వాత కొన్నాళ్లకి ఆయన ఇక లేరన్న వార్త !

స్కూల్ ఎప్పటిలాగే నడుస్తున్నట్లు కనిపిస్తున్నా లోపల కొంత సమస్య ఉహామాత్రంగా తోస్తోంది. గయక్వాడ్ జూనియర్లు ముగ్గురు ఎవరూ స్కూల్ నిర్వహణ గురించి పట్టించుకునే తీరిక, శ్రధ్ధ లేకపోవడంతో కొంత కాలంగా ఆ వ్యవహారాల విషయంలో ఒత్తిడి ఎక్కువై ప్రిన్సిపాల్ స్థానంలో ఉన్న వారిమీద పడుతోండటం తో, తరచూ ప్రిన్సిపాల్ కోసం కూడా వెతుక్కునే పరిస్థితి వచ్చింది.

అదే**...** ఇప్పటికిలా**...**.!!

వీణా మహాజన్ ఒక ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్ గా చేసి రిటైరైన వ్యక్తి.మంచి కార్య దక్షత ఉన్నావిడ.ఆవిడని ఇంటర్వ్యూ చేసిన (గయక్వాడ్ కొడుకు) నారాయణ గైక్వాడ్ , ఆయన అన్నదమ్ములు పూర్తి నమ్మకంతో ఆవిడని ఆకుర్చీలో కూర్చో బెట్టేరు.

ఆవిడ జీత భత్యాలు నిర్ణయించేప్పుడు అభిప్రాయం అడిగితే ఆమె కూడా ఉదారంగా మాట్లాడింది. ఇప్పుడిక ఇన్నేళ్ళ కెరీర్ అయినతరువాత ఆర్థిక పరమైన విషయం కంటే తనకు తృప్తి కలిగించేది పని మాత్రమే అని చెప్పింది. స్కూల్లో సీనియర్ టీచర్లకి ఇచ్చినట్లే తనకీ ఇవ్వమని చెప్పింది. ఆవిడ మాటలకి ఇంటర్వ్యూ చేస్తున్నవాళ్లు ఆశ్చర్య పోయేరు. ఆవిడ ఎంత అడిగినా ఇచ్చి స్కూల్ బాధ్యతనంతా ఆవిడ భుజాల మీద పెట్టే ఆలోచన లో ఉన్నవాళ్లు ఆవిణ్ణి విచిత్రంగా చూసేరు.

' వీణా మేడమ్, మీకు కావలసినది అడగండి.మేము మనస్పూర్తి గా ఇవ్వగలం ' అని నొక్కి చెప్పినా ఆవిడ ' నో' చెప్పేసింది.బహుశా స్కూల్ చరిత్ర ఆవిడని ప్రభావితం చేసి ఉండొచ్చు. పని విషయం లో ఏవేవో డెడ్ లైన్స్ పెట్టి మరింత క్రమశిక్షణ తీసుకొచ్చే ప్రయత్నం ప్రారంభించింది.

క్రమశిక్షణకి పాఠాలు చెప్పగలిగే మిసెస్ శర్మ, రజని లాటి వాళ్ళు ఆమె ధోరణికి ఆశ్చర్య పోయేరు. ఇన్నేళ్లుగా స్కూల్తో మమేకమైపోయిన తమ లాటి వారిని కూడా అర్థం లేని ఒత్తిళ్లతో విసిగించడం చూస్తే తాము అనుభవించిన స్వేచ్ఛ పూర్తిగా మాయమైపోయినట్లు ఫీలయ్యారు. స్వేచ్ఛా వాతావరణం ఇచ్చిన బలంతో ఆకాశమే హద్దన్నట్లు శ్రమించిన వాళ్లు ఇప్పుడు వీణ రాకతో కాస్త అనీజీనెస్ ను ఎదుర్కోక తప్పలేదు.

ఆమెకూ తెలుసు, సీనియర్ టీచర్ల అంకిత భావం. వాళ్లని చూస్తే ఆమెకు ముచ్చటే. అలా అని వాళ్లని విడిచి పెట్టక సలహాలు ఇచ్చేది.

' మీ కోసమే , మిమ్మల్ని మీరు రిఫైన్ చేసుకునేటందుకే ' అనేసేది.

గాంభీర్యం మాటున వాళ్లూ అసంతృప్తిని పైకి వ్యక్తం చెయ్యకుండా మౌనంగా ఉండిపోయేవారు. వీణ మాత్రం వీళ్లందరి మీదా తనది పై చేయి , తన హోదా అందరికి జ్ఞాపకం ఉండాలని అనుకునేది.

ఇంకా జూనియర్ టీచర్లకి మాత్రం ఆమె పట్ల తగని అసహనం. స్టాఫ్ రూమ్ లోకి వచ్చి కూర్చుని తమ ప్రైవసీ కి భంగ కలిగిస్తుందని లోలోపల విసుక్కుంటూ ఉండేవారు. క్లాసులో పాఠం చెప్పేప్పుడు సరే, వినేందుకు వచ్చి, తనకు తృప్తిగా అనిపించని అంశాలన్నీ వాళ్లకి వివరించేది. డిసిప్లిన్ అంటూ వెంట పడేది. స్కూల్ కి వస్తూనే మొబైల్ ఆఫీస్ రూమ్ లో డిపాజిట్ చెయ్యమనేది. చేసే పని వంద శాతం నిబద్ధత తో చెయ్యమనేది. చీరలు మాత్రమే కట్టు కోవాలని , స్లీవ్ లెస్ కూడదని రూల్ పెట్టింది.

కొత్తగా చేరిన టీచర్లు, మూడు నాలుగేళ్ళ గా చేస్తున్నవాళ్లు కూడా కొందరు ఏ బాధ్యతా లేనట్లు ప్రవర్తించేవాళ్లు. బెత్తం పుచ్చుకున్నా కానీ ఝడవని వాళ్లు , పెంకెతనం , నిర్లక్ష్యం , ఉదాశీనతా లాటి లక్షణాలతో ఉండే వాళ్ళను చూస్తే వాళ్ళంతా ఏమైపోతారు , పిల్లలకి ఏమి ఆదర్శాలు చూబిస్తారు అని వీణా వాదన. ఏ డెడ్ లైన్లకీ చలించరు. వీళ్లకి ఎలాటి మెప్పుదలా కూడా అక్కరలేదు. స్టాఫ్ రూమ్ లో కూర్చుని ఏదో గాసిప్ పోగేస్తూ ఉండేవాళ్ళు . కరెక్షన్ చెయ్యడం అంటేనే లీజర్ పిరియడ్ లన్నీ వృధా చేసుకోవటం అని అనుకునేవాళ్ళు . ఆ వైఖరి వీణకి చిరాకు కలిగించేది.

పి. జి. తో పాటు టీచింగ్ లో ట్రెయిన్ అయి ఉండాలన్నది తప్పనిసరి క్వాలిఫీ కేషన్ చేసింది. ఎప్పుడంటే అప్పుడు రిజైన్ చెయ్యకుండా ఒక సంవత్సరంపాటు పని చేస్తామన్న బాండ్ కూడా రాయించడం మొదలు పెట్టింది. ఏమాటకామాట చెప్పుకోవాలి , వాళ్ల శాలరీలు కూడా ఇదివరకటి కంటే రెట్టింపు చేయించింది.

అయితే వృత్తి పరంగా అనేక అవకాశాలు కొత్తగా వస్తున్నాయి.కొందరు తమ పిల్లలతో పాటు వస్తూ వాళ్లు కాస్త పెరిగేవరకూ స్కూల్లో పని చెయ్యాలని అనుకుంటారు. కొందరు కాలక్షేపం కోసం, కొందరు తాము కోరుకున్న ఉద్యోగం వచ్చేవరకు తాత్కాలికంగా వస్తుంటారు. వీణాకి అభ్యంతరం లేదు కానీ ఆమెకి కావలసింది మాత్రం పిల్లలకి చక్కని పాఠం, చక్కని ఫలితం.

*************************

'రాజీ,స్కూల్లొ పేరెంట్స్ తో మీటింగ్ ఎదో ఉందని అన్నావు , అలా కూర్చుండిపోయేవేమి ?' మధు ప్రశ్నకి, స్కూలుతో తనకు కలిగిన పరిచయం, క్రమంగా దానితో అల్లుకున్న గాఢమైన చెలిమి స్మరించుకుంటున్న రజని ఉలిక్కిపడింది. ఆలోచనల్లోంచి బయటపడి, గబగబా తయారవడం మొదలెట్టింది రజని.

స్కూల్ ఆవరణ అంతా పిల్లల తల్లి తండ్రులతో నిండిపోయింది. అనుకున్నదాని కంటే ఎక్కువ మంది వచ్చేరు.రావలసిన టీచర్లు అందరు వచ్చేసేరు.

ఒక్కొక్క ఇంటికి ఒక్కొక్క కథ. ఒక్కో కుటుంబంలో కనీసం ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొందరికైతే ఇంకా ఎక్కువ. నిలకడైన జీవనోపాధి లేకుండా, ఆర్థిక సమస్యలు తెలిసి ఉండికూడా సంతానాన్ని ఎందుకు నియంత్రించుకోరో ! ఆ ప్రస్తావన చూచాయగానైనా తీసుకురాబోతే ఇద్దరు ముగ్గురు కాస్త సీరియస్ గానే తీసుకున్నారు. పిల్లలు దేవుడిచ్చిన వరం అని ఒకరంటే, తన బిడ్డలకి ఎక్కడ దిష్టి తగులుతుందో అన్నట్లు మరొకరు మాట్లాడేరు.

ఇంకొకామె చెబుతోంది , 'పిల్లలే మాకు ఆస్తి. డబ్బు ఉన్నవాళ్ళకి ఇద్దరు పిల్లలున్నా కూడా ఆస్తి భాగాలైపోతుందని భయం',. 'ఇంట్లో ఒకరం పని లోకి వెళ్ల లేకపోయినా ఇంకొకరు సంపాదించి తెచ్చిన దానితో గడు పుకుంటాము ' అని మరొకరు. అసలు సమస్య లోకి వస్తే 'ఫీజులు ఒక్కసారి పెంచేస్తే మేము ఏమైపోవాలి' అంటూ ప్రశ్నించేరు.

పెరిగిన ధరలుతో ఆర్థిక భారం మొయ్యలేక పోతుంటే జీవితాలు ఎంత భారంగా తయారయ్యాయో చెప్పుకొచ్చేరు. ఇరవై ఏళ్లుగా ఫీజు పెంచలేదంటే అప్పట్లో ఒక గది అద్దె ముప్పై,నలభై రూపాయలు ఉండేది, ఇప్పుడు అదే గదికి మూడు వేలు ఇస్తున్నాం. పెరిగిన మా ఆదాయాలు అదే తీరుగా పెరిగిన ఖర్చులకి సరిపోతున్నాయి. మాకోసమే నడుపు తున్న స్కూల్ కూడా ఫీజులు పెంచితే ఎలా అన్నదే వాళ్ల ప్రశ్న.పెరిగిన ఫీజులు కట్టలేమన్నది వాళ్లు పదే పదే చెప్పు కొచ్చేరు.

ఒక తల్లి చెబుతోంది, 'మేడమ్ , ఇన్నేళ్లు పెంచకుండా ఇప్పుడు ఒక్కసారి డబుల్ కట్టమంటే ఎలా అవుతుంది?పోనీ పెంచే తీరాలంటే ఏడాదికి కొంత చొప్పున పెంచినా మాకు బరువు అనిపించదు.'

'ఇన్ని సంవత్సరాలు ఫీజులు పెంచక పోవడం వల్లనే ఇంతమంది ఇక్కడ పిల్లల్ని చదివించుకో గలుగు తున్నాం. అందుకు మా అందరికి స్కూల్ పట్ల అభిమానం ఉంది, మా పిల్లలు ఈ కాలానికి తగినట్లు మీలాటి టిచర్ల దగ్గర మంచి చదువు చదువుకుంటూ న్నారని సంబరంగా ఉంది. పది సంవత్సరాల క్రితం నా పెద్ద కొడుకు ఇక్కడ చదివినవాడే. ఇప్పుడు మంచి కొలువులో ఉన్నాడు. కాని వాడి సంసారం బాధ్యతలు వాడికి ఉండటం తో మాకు సాయం చెయ్యలేని పరిస్థితి. వాడి తమ్ముళ్లిద్దరూ ఇక్కడ హైస్కూల్లో ఉన్నారు. ఇద్దరి ఫీజులు కాదు కదా ఒక్కడి కి పెంచినా మాకు చేతకాదు మేడమ్ ' చేతులు ఎత్తి దండం పెట్టేసింది ఆమె.

'జీతాలు కట్టలేక చదువులు మాన్పించి కూర్చోబెట్టు కోవాలమ్మా , పిల్లలు ఏమైపోతారు ? ఏదైనా పనిలో పెట్టాలన్నా వయసు లేదు.వేరే స్కూల్ కి పంపుదామంటే ఖర్చు భరించలేము.గవర్నమెంట్ స్కూల్లో ఇప్పుడు సీటు దొరుకుతుందా ? '

' మా ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లలు ఇక్కడే చదువుకుంటున్నారు.పెద్ద పిల్ల పది చదివింది. ఇంకా చదివించ లేక పని లో పెట్టేను.మగ పిల్లలు ఇద్దరూ చిన్నవాళ్ళు. బస్ పాస్ తీసుకుని వస్తున్నారు.జీతాలు పెరిగితే బస్ పాస్ కొనే స్థితి లేదు.ఆడపిల్లలు ఇద్దరూ రోజూ నడవలేమని గోల చేస్తున్నారు.పిల్లలు కష్ట పడుతున్నారు, మా లాటి ఇళ్ళల్లో పుట్టి ఇన్ని బాధలు పడుతున్నారు......' ఆమె గొంతులో దుఖం. అంత తక్కువ ఆదాయంలో ఐదుగురు పిల్లలు ! ఏం చెప్పాలి ? ప్రస్తుతం వాళ్ళని పిలిపించింది మరో విషయం గురించి మాట్లాడేందుకు .....

రెండు మూడు గంటలు అనుకున్నది అలా భోజనం వేళ దాటే వరకు జరుగుతూనే ఉంది. పిల్లల తరపున పెద్దలు వస్తూనే వున్నారు.ఆరోజు పని మానుకుని జీతం నష్టం మీద కొందరు , అర్ధ రోజు సెలవు మీద కొందరు . ... ఇలా అందరూ ఆత్రంగా తమ సమస్యను చెప్పుకుందుకు, ఫీజులభారాన్ని పెంచవద్దని, పెంచినా నామ మాత్రపు పెంపుతో సరిపెట్టుకొమ్మని అభ్యర్ధించి వెళ్లి పోయేరు. రెండో రోజూ అదేవిధంగా గడిచింది.

స్కూల్ సమస్య అలాగే ఉంది. మ్యానేజ్ మెంట్ తరఫున ఇక చెప్పేది ఏమీ లేదని, స్కూల్ మూసివెయ్యడమే మార్గం లా కనిపిస్తోందని నిష్కర్షగా చెప్పేసేరు.క్లాసులు నిరవధికంగా రద్దు చేసేరు. పదో క్లాసు పిల్లల అవస్థ చెప్పలేనట్టు తయారైంది. టీచర్లని క్లాసులేవీ తీసుకోవద్దని చెప్పడంతో పొద్దున్నే స్కూలుకి వెళ్ళడం రిజిస్టర్ లో సంతకం చేసి రావటం. ఇది మాత్రం అవసరమా అనుకుంటున్నట్లే ఒక రోజు ఆఫీస్ క్లర్క్ రాజేంద్ర చెప్పనే చెప్పేడు సంతకాలు అవసరం లేదని. ఇంక ఆ ఆనవాయితీ కూడా తీరిపోయింది.

************************

సాయంత్రం వాకింగ్ ముగించి వెనక్కి వస్తూంటే తన తో పాటు స్కూల్లో పనిచేసే వసుధ పలకరింపు. మనసుకు హాయిగా అనిపించింది .

'రాజీ, నీకొక న్యూస్ , నా కూతురు ఇంటికి వచ్చింది. కొన్నాళ్లు ఉంటుందట ఇక్కడ.అది ఒక పని మీద వచ్చినట్లు ఉంది. మన స్కూలు ఇంకా తెరవకపోవటం ,స్కూల్ సమస్య అంతా తన వరకూ వెళ్లిందట. ఇదివరకు తను ఇక్కడ ఉన్నన్నాళ్లూ సాయంత్రాలు పిల్లల చదువు బాధ్యత చూసేది కదా. తన గ్యాంగ్ లో పిల్లలు తమకు జరుగుతున్న నష్టం చెప్పుకున్నట్లున్నారు. ఇక్కడికి వచ్చి తమకు లెక్కలు చెప్పమని అడిగేరుట. నీతో చాలా ముఖ్యమైన విషయం మాట్లాడాలని చెప్పింది.తన ఫ్రెండ్స్ అందరినీ కలుసుకోవాలని వెళ్లింది. రేపు నిన్ను కలుస్తుంది బహుశా. ..యోగా క్లాస్ కి టైం అయిపోయింది' అంటూనే హడావిడిగా పరుగెత్తింది వసుధ.

తన స్నేహితులందరితో స్కూల్ విషయం మాట్లాడాలని అనుకుంది రజని.ఇంటికి చేరుతూనే ముందుగా రఫీని పలకరించింది .

'రఫీ, ఎలా వున్నారు మీరు అందరూ ?' ఆమె పలకరింపు అతడిలో ఉత్సాహం నింపింది.

'రజనీ మేడమ్ , బావున్నాం.పేరెంట్స్ కూడా ఇప్పుడిప్పుడే నార్మల్ అవుతున్నారు. మీరు, మన స్కూలు, పిల్లలు ఎలా వున్నారు ?'

' రఫీ , స్కూలు గురించి మాట్లాడేందుకే ఇప్పుడు నిన్ను పిలిచింది.మన స్కూలు పరిస్థితి కొంచెం ప్రమాదంలో పడింది.'

'చెప్పండి మేడమ్ , ఏమైంది ?'

'స్కూలు ఫీజులు పెంచుతామని మ్యానేజిమెంట్ ప్రకటించింది.అది కట్టలేమని పిల్లల తల్లిదండ్రులు గొడవ పెడుతున్నారు.ఈ సంవత్సరం ఇంకా క్లాసులు మొదలు కాలేదు.ఫీజులు పెంచకుండా నడపటం కుదరదని గైక్వాడ్స్ చెబుతున్నారు........'

'మరి పిల్లలు ఏమైపోతారు ? పదో క్లాసు పిల్లలు ముఖ్యంగా ........' అతని గొంతులో ఆవేశం, సహజంగానే.

'రఫీ, అదే చెబుతున్నాను. పదో క్లాసు వాళ్లకి మేము సీనియర్ టీచర్లం ఇంటి దగ్గర క్లాసులు నడుపుతున్నాం. స్కూలు భరించలేదు అని చెబుతున్న ఖర్చులు కోసం కొంత డబ్బు సేకరించ దల్చేం. నువ్వు తమ్ముడి స్మృతి గా ఏర్పాటు చెయ్యదలచిన స్కాలర్ షిప్ డబ్బు ని స్కూలు నడిపేందుకు కొన్నాళ్ళ పాటు ఉపయోగించాలని ఆలోచన వచ్చింది. నువ్వు ఆ డబ్బు ఇచ్చిన ఆశయం వేరు కదా. నీకు చెప్పి నీ అభిప్రాయం తెలుసుకుందుకే ఫోన్ చేసేను .............'

అతన్ని వినేందుకు ఆగింది.

'మేడమ్ , మీరు నన్ను అడగాలా ఈ విషయం ? నన్ను చిన్నబుచ్చకండి. మీ కంటే స్కూలు గురించి ఎవరు సరి అయిన నిర్ణయం తీసుకోగలరు? అంతా సవ్యంగా నడుస్తుంటే ఆ డబ్బు స్కాలర్ షిప్ కోసం అనుకున్నాను.కాని స్కూలు మూసేసే పరిస్థితి లో ఉంటే, ముందు అది నడిచే మార్గం చూడాలి కదా.తప్పకుండా మీరు అనుకున్నట్లు చెయ్యండి.నేను మరికొంత డబ్బు సమకూరుస్తాను.'

రజని కి తెలుసు అతని ఆలోచనలు.అందుకే ముందుగా అతన్నే కదిపింది డబ్బు విషయంలో .

'రఫీ, ప్రస్తుతం నువ్వు మళ్లీ పంపక్కర్లేదు. ఇంకా మన సీనియర్ స్టూడెంట్స్ తో కూడా మాట్లాడుతాము. మేము అందరం ఇదే పనిలో ఉన్నాము. మా ప్రయత్నం ఒక దారికి వచ్చేక మ్యానేజ్ మెంట్ తో మాట్లాడుతాం.థాంక్యు రఫీ.పేరెంట్స్ ని తలుచుకున్నానని చెప్పు '

ఉద్యోగంలో సెటిల్ అయ్యాక తన కలీగ్ ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు రఫీ.. పాట వాళ్ల ఇద్దరినీ కలిపింది .తన పాటతో కీర్తి శిఖరాలు ఎక్కాలని ఆమె కల. అతనికి మాత్రం పాట మనసారా పాడుకుందుకే

తమ్ముడి చదువు కూడా సక్రమంగా జరుగుతోందని, ఇంకా ఒక సంవత్సరం అయితే అతని చదువు అయిపోతుందని , తల్లిదండ్రులని తన దగ్గరకి తీసుకెళ్లి పోతాననీ చెప్పేవాడు రఫీ.

అలాటి రోజుల్లోనే ఒక రోడ్ ఏక్సిడెంట్ లో రఫీ తమ్ముడు అందరినీ విడిచి వెళ్లి పోయేడు. అది ఆ కుటుంబానికి పెద్ద షాక్. దాని నుండి ఆ కుటుంబం ఎప్పటికీ కోలుకోనేలేదు. తండ్రి చేత ఉద్యోగం విరమింప చేసి తనదగ్గరకి తీసుకెళ్లి పోయేడు. ఆ తర్వాత అతను ముంబై రావటం బాగా తగ్గి పోయింది.

ఆ తర్వాత తమ్ముడి జ్ఞాపకార్ధం కొంత ఫండ్ పంపుతూ, ఆర్ధికంగా అవసరమున్న ఇద్దరు విద్యార్థులకోసం ప్రతి సంవత్సరం ఉపయోగించమని కోరేడు. తమ్ముడి ఆకస్మిక మరణం తమ కుటుంబాన్ని, ముఖ్యంగా తల్లిదండ్రులని ఎంతగా కృంగతీస్తోందో చెప్పి బాధ పడ్డాడు.

***************************************

స్కూలు జీవితం రజని కి ఇచ్చిన మరో మంచి మిత్రురాలు వైశాలి. గైక్వాడ్ సీనియర్ ప్రేమగా పెంచుకున్న మనవరాలు. రజని క్రొత్తగా చేరిన రోజుల్లో స్కూల్లో తాతగారి చెయ్యి పట్టుకుని అందరిమధ్యా తిరుగుతూ కనిపించేది. మనవరాలితో పాటుగా రజని ని అదే ఆపేక్షతో పలకరించేవారాయన.

ఆలా కల్సిన స్నేహం, వైశాలి మహేంద్రని ప్రేమించి పెళ్లి చేసుకుని తల్లిదండ్రులకి దూరం అయ్యాక కూడా కొనసాగుతూనే వచ్చింది.

ఇప్పటి స్కూలు నిస్సహాయ స్థితి తనవరకూ వెళ్లిందా? గైక్వాడ్ సీనియర్ మరణం తర్వాత పుట్టింటి నుండి ఆమెను పలకరించే వాళ్లు పూర్తిగా కరువైపోయేరు.

పెళ్లి నాటికి అత్తమామలు కోడలిగా ఆమెను అంగీకరించక పోయినా, వాళ్ళ మధ్య మాత్రమే తాము జీవించాలని , ఆ ఇంటి బాధ్యత ఇంటికి పెద్ద కొడుకు , కోడలు గా తమదేననీ చెప్పి నిరశనల మధ్యే ఆ ఇంట్లోకి ప్రవేశించింది వైశాలి. కుటుంబం అంటేనే ఒక వారసత్వపు ఆస్తిగా గౌరవించే వైశాలి ఆ మధ్యతరగతి కుటుంబంలో సులువుగా ఇమిడిపోయింది.

'వైశాలీ, ఎలా వున్నారు మీరంతా? ......'

రజని మాటల్ని మధ్యలోనే త్రుంచేస్తూ వైశాలి అడిగింది..........'దీదీ , మీరంతా ఏంచేస్తున్నారు? స్కూలు ని అలా వదిలిపెట్టేస్తారా? పప్పాని,చాచాల్ని నిలదీసి ఆడుగుదామంటే వాళ్లని కలిసే అవకాశమే ఇవ్వటం లేదు నాకు......'

'అవును, ఏదైనా చెయ్యవలసిన అవసరం ఉంది. ఇన్నాళ్లుగా లేనిది ఇప్పుడు ఒక్కసారిగా ఫీజులు పెంచమంటే పెంచే స్థితి వాళ్లకి లేదు. అందరికి తెలుసున్నదే ఇది. అయినా ఇప్పుడిలాటి ప్రస్తావన ఎందుకు వచ్చిందో అర్థం కావటం లేదు. పిల్లలు స్కూలు , క్లాసులు మిస్ అవకుండా మేమంతా ఏమి చెయ్యగలమో ఆలోచిస్తున్నాము వైశాలీ .'

'దీదీ , నాకు ఒకటే కారణం తోస్తోంది.గడచిన ఏడాది కాలంగా నారాయణ చాచా కంపెనీ కోసం తీసుకున్న నిర్ణయాలు అన్నీ ఫెయిల్ అవటంతో ,ఖర్చు పెట్టిన డబ్బు కి సమాధానం చెప్పవలసిన బాధ్యత ఆయన మీద పడింది. ఉద్యోగం లో నుండి బలవంతంగా బయటకు రావలసి వచ్చింది ,ఇంకా బోలెడు డబ్బు కంపెనీ కి కట్టవలసిన అవసరం వచ్చింది. ఆయన వైపు నుండి డబ్బు కోసం కొంత ఒత్తిడి ఉండి ఉండవచ్చు.

దీదీ, చిన్న రూం ఏదైనా తీసుకుని పెద్ద క్లాసుల పిల్లలకి పాఠాలు పోకుండా ముందు ఏర్పాటు చెయ్యాలి.దానికి నేను కొంత డబ్బు సర్దుబాటు చెయ్యాలని అనుకుంటున్నాను. మా అత్తమామలతో కూడా ఇది మాట్లాడేను. రెండు కిలో మీటర్లు రాగలిగితే మా ఇంట్లో క్లాసులు తీసుకునే ఏర్పాటు చేస్తామని వాళ్లు అంటున్నారు .ఏమంటావు దీదీ? '

'వైశాలీ, మేము కూడా అదే ప్రయత్నంలో ఉన్నాం. నీకు విషయం తెలుసా లేదా అని ఫోన్ చేసేను. అవసరమైతే మీ అత్తమామలు చెప్పినట్లు వారి సహకారం కూడా తీసుకుంటాము.నీకు ఏ విషయమూ మళ్ళీ చెబుతాను ,సరేనా !' అంటూ ముగించింది రజని.

అవును ,తామంతా గమనించకపోలేదు,నారాయణ్ గైక్వాడ్ ఉద్యోగ జీవితం సమస్యలో పడిందని. ఆయన మీద ఏదో లీగల్ గా కూడా కేసు నడుస్తోంది. దాని గురించి న్యూస్ పేపర్లు వివరంగా వ్రాస్తూనే ఉన్నాయి. స్కూలు పరిస్థితికి అది ముఖ్యమైన కారణం అయి ఉండొచ్చు. కోర్టులు, కేసులు అంటే దానికోసం ఖర్చు పెట్టటం సాధారణ పౌరుడుకి సాధ్యం కాదు. నారాయణ్ గైక్వాడ్ తప్పు చేసి ఉండక పోయినా ఇప్పుడు పడ్డ ఈ మచ్చని తుడిచివేసుకుందుకు, అందులోంచి బయట పడేందుకు బోలెడు సమయం పట్టటం ఖాయం. గైక్వాడ్ ల కుటుంబ వ్యవహారాలు కూడా అంత సజావుగా లేవని అడపాదడపా కొన్ని విషయాలు బయటకు వస్తూనే ఉన్నాయి.

నిజమే కానీ, కుటుంబ సమస్యలు స్కూలు ఉనికినే ప్రశ్నార్థకం చెయ్యటం బాధగా ఉంది .

ఇక్కడ వ్యక్తి సమస్యల కంటే సమాజ సమస్య ఖచ్చితంగా ముఖ్యమైనది. ఒక వ్యక్తి సమస్య సుదీర్ఘంగా సాగుతున్న ఒక చక్కని వ్యవస్థని అల్లకల్లోలం చెయ్యటమే ఇబ్బందిగా ఉంది.

' రజనీ మేడం, మిమ్మల్ని కలిసి మాట్లాడాలని అనుకుంటున్నాం.' తనతో పనిచేసే వర్ష అకస్మాత్తుగా ఫోన్ చెయ్యటం రజనిని ఆశ్చర్య పరిచింది.

'ఎప్పుడు వస్తే మీకు వీలుగా ఉంటుంది మేడం?' ఆమె రెట్టించటం తో జవాబు చెప్పి, ఆమె కోసం ఎదురుచూడ సాగింది.

వర్ష, ఆమెతో సన్నిహితంగా ఉండే మరికొంత మంది టీచర్లు ప్రిన్సిపాల్ తో తరచూ దేనికో దానికి గొడవ పెట్టుకుంటూనే ఉంటారు . చిన్న విషయాలకి కూడా సర్దుబాటు ధోరణి చూపించరు. స్కూల్లో సీనియర్ టీచర్లతో దూరదూరంగా మసిలే వర్ష లాటి జూనియర్ టీచర్లు కొంత మంది ఉన్నారు. సీనియర్లతో పోల్చినప్పుడు పని విషయం లోనూ, క్రమశిక్షణ విషయంలోనూ కూడా వెనకబడే ఉంటారు. కొంత నిర్లక్ష్యంగానూ ఉంటారు. తప్పించుకుని తిరిగే ధోరణి ఉంది. టీచింగ్ విషయంలో ప్రిన్సిపాల్ ఇచ్చే సూచనలు కూడా వాళ్లకి నచ్చవు . సహజంగానే ఆవిడ మృదువుగా చెప్పదు, తన అథారిటీ ప్రయోగించి అమలు చెయ్యాలని చూస్తుంది . క్లాసులో పిల్లలతో అవసరానికి మించి చనువుగా ప్రవర్తిస్తున్నా వీణా హెచ్చరిస్తూనే ఉంటుంది. ఆవిడ మాటలు, హెచ్చరికలు అలాగే ఉంటాయి. వీళ్ల ధోరణి ఎప్పటిలాగే సాగుతూంటుంది.

ముందు ముందు రజని, మిసెస్ శర్మ లాటి వాళ్లు బుజ్జగించి చెప్పే ప్రయత్నం చేసేరు. కానీ వాళ్ల ధోరణి మార్చలేక పోయేరు . పిల్లల పట్ల మాత్రం తమ వంతుగా వాళ్ళ ప్రవర్తన సరి ఐన మార్గం లో పెట్టే ప్రయత్నం చేస్తూ ఉంటారు.

ఎప్పుడైనా స్టాఫ్ రూం లో పని ముగించుకుని కూర్చున్నప్పుడు వాళ్లతో మాటలు కలిపి వాళ్లధోరణి కొంచెం అయినా మార్చాలన్న ప్రయత్నం రజని వదిలిపెట్టదు. వాళ్లంతా వయసురీత్యా చిన్నవాళ్లే. వాళ్లల్లో కొందరు పెళ్లిళ్లు కాని వాళ్లు, మరికొందరు ఇంకా పిల్లల బాధ్యత లేని వాళ్లు. రేపు ప్రొద్దున్న వాళ్ల పిల్లల్ని ఎలా పెంచుకుంటారు ఇప్పుడు టీచర్లుగా ఉండికూడా నేర్చుకోలేనిది అని ఆమె భావం.

'టిచింగ్ ఎప్పుడూ వృత్తిగా అనుకోలేదు మేడం. నేను ఎంత కాలం ఇక్కడ ఉంటానో నాకే తెలియదు ' అనే వాళ్లు చాలా మందే ఉన్నారు. టీచింగ్ లో ఉన్నా లేకపోయినా బాధ్యతాయుతమైన ప్రవర్తన అందరికీ అవసరమే అని రజని వాదన.

వర్ష రాకతో ఆలోచనలు వదిలి లేచింది రజని. వర్షతో పాటు ఇంకొక అయిదారు గురు టీచర్లు వచ్చేరు.

'మేడం , మా ఆలోచన మీతో చెప్పాలని వచ్చేము. మన స్కూల్ అంటే మీకూ ,మాకూ కూడా అభిమానముంది. ఇలా అకస్మాత్తుగా మూతపడిపోతుందంటే బాధగా ఉంది. మన సర్ చెప్పినట్లు దాదాపు ఇరవై ఏళ్ల తర్వాత ఫీజులు పెంచటంలో మాకు తప్పు కనపడటం లేదు. ఇలాటి స్కూల్ ఇక్కడ చుట్టుప్రక్కల ఏదీ లేదు అని మనకు తెలుసు, విద్యార్థుల తల్లిదండ్రులకి కూడా తెలుసు. మనం పెంచే ఫీజు సర్ చెప్పినట్లు లాభాల కోసం కాదు. ఎలాటి వృధా ఖర్చులకి కాదు . స్కూల్ మరింత బాగా నిర్వహించటానికే కదా. ఫీజులు పెంచితే మేము కట్టలేము అని పంతానికి పోతే నష్ట పోయేది వాళ్లే కదా మేడం ' తను చెప్ప దలచుకున్నది గుక్క తిప్పుకోకుండా చెప్పింది వర్ష.

'కానీ వర్షా, వాళ్లు ఎలాటి నేపథ్యాలతో వచ్చిన పిల్లలో మనకు తెలుసు. వాళ్లు పెంచిన ఫీజుల గురించి పూర్తిగా 'కాదు ' అనటం లేదు. వాళ్ల కి తెలుసు ఈ స్కూల్ లేకపోతే వాళ్లకి జరిగే నష్టం . అంతకంటే ఈ స్కూల్ చేసిన కృషి వాళ్ల కంటికి ఎదురుగా తరతరాలుగా కనిపిస్తోనే ఉంది . వాళ్లు అడిగినది ఒక్కటే, ఒక్కసారిగా ఇంత పెంచవద్దు అని. అదీకాక నష్టం వాళ్లది అని వదిలెయ్యలేం. మనం సమాజం లో ఇవ్వ గలిగే స్థాయిలో ఉన్నాం. అందుకని వాళ్లకి నష్టం జరగకుండా చూడవలసిన బాధ్యత మన అందరిదీనూ' రజనిమాటలమౌనంగా విన్నారు.

'ఇన్నేళ్లుగా నడుపుతూ వచ్చిన స్కూల్ని సర్స్ కూడా ఎందుకు మూసెయ్యాలని అనుకుంటారు ? మేమంతా సర్స్ చెప్పినదాన్ని సపోర్ట్ చేస్తున్నా, ఆరోజు మీటింగ్లో అది చెప్పేందుకు ధైర్యం సరిపోలేదు. అదీకాక మేము జూనియర్స్, మా మాటకు ఎంత విలువ ఇస్తారో తెలియక మాట్లాడలేకపోయేం. స్కూల్ కి ఆదాయం పెరిగితే టీచర్లకి కొంత శాలరీలు పెరుగుతాయి, క్రొత్త టీచర్లు కూడా చేరేందుకు ముందుకు వస్తారు . మన స్కూల్ కి టీచర్ల కొరత తగ్గుతుంది. ఇప్పటిలా మంచి శాలరీలకోసం మరో ఉద్యోగానికి వెళ్లడానికి ప్రయత్నమూ చెయ్యరు.

మీరు ,మిసెస్ శర్మజీ చెబితే పేరెంట్స్ అందరూ వింటారు, మరోసారి పేరెంట్స్ తో మీటింగ్ ఏర్పాటు చేస్తే బావుంటుంది. మీరు చెప్పి, వాళ్లని ఒప్పించి స్కూల్ నడిచేలా చూడాలి మేడం ' వాళ్ల ధోరణి లోనే పదే పదే చెప్పుకొచ్చారు .

ఇంక తను చెప్పగలిగేది ఏమీ లేదని తెలిసింది రజనికి. వెళ్తున్న వాళ్ల ముఖాల్లో అసంతృప్తి గమనించింది.

**********************

వసుధ కూతురు 'నీతో మాట్లాడాలి ఆంటీ , ఒక అరగంటలో రావచ్చా?' అంటూ రజనికి కబురు చేసింది. ఇంతలో రజనితో పని చేసే శ్యామ ఫోన్ కాల్ , 'రాజీ ' అంటూ .

'రాజీ, సెక్టర్ 19 లో కోచింగ్ సెంటర్ లో చేరేను, మంచి పే. నువ్వు కూడా చేరకూడదూ ? వేకెన్సీలు ఉన్నాయి. మన స్కూల్ ఎటూ ఇంక నడుస్తుందన్న నమ్మకం లేదు. '

స్కూల్ నడుస్తుందన్న నమ్మకం లేదా ? ఎవరికి?మె మాటలకి రజని మనసు గాయ పడింది .

'నా చిన్నపుటి రోజులు జ్ఞాపకం వస్తున్నాయి ఈ పిల్లల్ని, ఈ స్కూల్ ని చూస్తూంటే ', అంటూ తన చిన్నతనంలో చదువుకుందుకు పడిన అవస్థలు తరచూ చెప్పే శ్యామ ఇప్పుడు స్కూల్ పరిస్థితి అయోమయం లో పడిందని, మంచి జీతమిచ్చే మరో ఉద్యోగం చూసుకుంది . చిన్ననాటి ఆదర్శాలు , తను నడిచి వచ్చిన దారి శ్యామ పూర్తిగా ఎలా మర్చిపోయింది?

రజని కి స్కూల్ తో పరిచయం అయిన ఇన్నేళ్ళుగా స్కూలు కోసం తపన పడే ఎందఱో తటస్థ పడ్డారు ,అలాగే స్కూల్ నుండి స్వయంగా దూరం గా తప్పుకున్న వాళ్ళు తటస్థ పడ్డారు !

అసంకల్పితంగా బలానీ ఆంటీ జ్ఞాపకం వచ్చింది.

బలానీ ఆంటీ తన పిల్లలకి తక్కువ ఖర్చుతో చదువు అందించింది అన్న కృతజ్ఞత తో స్కూలు కోసం తను కూడా ఏదైనా చెయ్యాలనుకుని అప్పడాలు తయారు చేసి వాటిని ప్రక్కన ఉన్న కిరాణా కొట్లకి అమ్మి తనకుగా సంపాదించిన కొంత మొత్తాన్ని స్కూలు కోసం విరాళంగా ఇవ్వటాన్ని రజని చూసింది.

అదొక సంప్రదాయంగా ఆచరించేది ఆంటీ. ఏడాదికి రెండు సార్లు భర్త పుట్టినరోజు నాడు , నవంబర్ 14 పిల్లల పండుగ నాడు తనకు చేతనైనంతలో స్కూల్లో పిల్లలందరికీ ఒక పెన్ను, ఒక పుస్తకం కొని ఇచ్చేది. ఆర్థిక సమస్యల మధ్య సంసారాన్ని నెట్టుకొస్తూ కూడా తన తృప్తి కోసం ఆనందంగా కష్టపడేది. అంత గొప్పగా ఆలోచించే ఆంటీ ఒక్కోసారి ఆర్థిక పరిస్థితులు ఉక్కిరిబిక్కిరి చేస్తూంటే బేలగా అడిగేది

'రజనీ, ఖర్చు ఎక్కడ తగ్గించను ? మంచంలో ఉన్న అత్తగారిమీదా? పెరుగుతున్న పిల్లల మీదా? సంపాదించి తెచ్చే బలానీ మీదా? ఇందరికీ అన్నీ అమర్చి, చూడవలసిన దాన్ని నామీదా?'

అయినా తాను ఒక వ్రతం లాగా స్కూల్ కోసం చేస్తూ వచ్చిన చిన్న సాయాన్ని ఎప్పుడూ వదిలెయ్యలేదు . తనకి తానే శాసనం చేసుకున్నట్లు ఆచరించేది .

ఇలాటి వ్యక్తులతో అనుబంధం ఉందని జ్ఞాపకం వస్తేనే మనసు ఆనందంతో గెంతులేస్తుంది .

క్వార్టర్ దొరికి ఇక్కడికి వచ్చేసేక తమని చూసేందుకు వచ్చిన బలానీ ఆంటీ 'ఇంత పెద్ద ఇల్లు మీ ఇద్దరికోసమా?' అంటూ ఆశ్చర్య పోయింది. ఆ తర్వాత చాలా ఏళ్లకి, ఎప్పుడో బలానీ రిటైరయ్యాక కలిసినప్పుడు ఆయన అన్న మాటలు తలుచుకున్నప్పుడల్లా రజని గుండె ని గాయం చేస్తూనే ఉన్నాయి.

' రజనీ! నాకు ఇప్పుడు మంచి పెన్షన్ వస్తుంది. చూసేవుగా, హౌసింగ్ సొసైటీ వాళ్లు రెనొవేట్ చేసేక మాకు మూడు గదుల విశాలమైన ఇల్లు వచ్చింది. పిల్లలు వాళ్ల దారిన వాళ్లు వెళ్లిపోయేరు. మీ ఆంటీ నా ఒక్కడికీ ఇంత ఇల్లు వదిలి తన దారి తను చూసుకుంది' అంటూనే బావురుమన్నాడు .

జయకాంతన్ చెప్పిన మనిషిలోని చీకటి కోణాలు అంటే ఏమిటి ? ' ఒక' ఇల్లు... ' నవలలో కథా నాయకుడు హెన్రీ పిళ్ళై! .

పెంపుడు తండ్రి కి తన స్వంత ఊరు పట్ల ఉన్న మమకారాన్ని అర్థం చేసుకుని ,ఆయన మరణానంతరం ఊరు వెతుక్కుంటూ వస్తాడు హెన్రీ పిళ్ళై . ఆ ఊళ్ళో ఉండటం అంటే తండ్రితో ఉన్నట్లే అనుకుంటాడు .

తండ్రి తాలూకు ఆస్తులు,పొలాలు, ఇళ్ళూ గురించి పంచాయితీ జరిగినప్పుడు అతను అంటాడు ,

' ఇవి ఏవి నాకు అక్కర్లేదు . నన్ను పప్పా కొడుకుగా ఊళ్ళో అందరూ అంగీకరించడమే నాకు కావలసినది.నాకు పప్పా ఇల్లు ఒకటే చాలు , అదికూడా లేకపోతే ఈ ఊరు చాలు . అందుకోసమే నేను పంచాయితీ కి వచ్చేను ' అంటాడు.

అలాగే పప్పా తమ్ముడు దొరైకణ్ణూ తన అన్నగారి ఆస్తికి అప్పటిదాకా సంరక్షకుడుగా ఉంటాడు . హెన్రీ వచ్చేక ఆస్తి అతనికి అప్పగించవలసి వస్తుందేమో అని కొంచెం కూడా దిగులు పడడు. ఈ ఇద్దరూ కూడా ఎదుటివారికి ఆస్తి దక్కాలని చెబుతారు . పంచాయితీ ముగిసి న తర్వాత గ్రామస్థులంతా ఒక శుభకార్యాన్ని జరిపించి వెళ్తూన్నంత ఆనందంగా ఇళ్ళకి వెళ్తారు. ఎంత అపురూపమైన దృశ్యమో కదా .

ఆ ఊళ్ళో తప్పు చేసిన వాళ్ళ చేత కూడా మంచి పని చేయించే శిక్షలు ఉంటాయిట. ఎంత చక్కని సంస్కారం!

డోర్ బెల్ విని లేచింది రజని. గుమ్మం ముందు వసుధ కూతురు శ్రీజ! ఆ అమ్మాయి ముఖంలో, కళ్లల్లో ఆత్మవిశ్వాసం తాలూకు ఒక ఆకర్షణ !

''ఆంటీ! ఎలా వున్నారు ?విరాజిత ఎలా వుంది ?' శ్రీజ చక్కగా అందరి క్షేమ సమాచారాలు అడుగుతుంటే రజని కి ముచ్చట వేసింది. ఈ పిల్లలు ఎంతలో పెద్ద అయిపోతారు! అనుకుంది .

'ఆంటీ, నేను ఇదివరకు చదివించిన నా స్టూడెంట్స్ స్కూల్ గురించిన విషయాలు అన్నీ చెప్పేరు . మీరు అందరూ ఉన్నారన్న భరోసా అయితే ఉంది, కానీ నేను నా వైపు నుండి ఏమి చెయ్యగలనా అని ఆలోచిస్తే ఒక విషయం తోచింది . స్కూల్ నడపమని మ్యానేజిమెంట్ వాళ్లకి లీగల్ గా చెప్పించేందుకు పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ వెయ్యాలను కుంటున్నాను. పిల్లలు అందరూ మైనర్లు . వాళ్లకి పిటిషన్ ఫైల్ చేసే అధికారం లేదు. వాళ్ల తరఫున ,వాళ్ల తల్లిదండ్రులు పిటిషన్ పెట్టుకోవచ్చు . వాళ్లు కాకపోయినా నేను ఐనా చెయ్యచ్చు ఆ పని. నేను పిల్లల తో ముందుగా చెప్పి వాళ్ల పెద్దవాళ్లతో మాట్లాడుతాను . వాళ్లలో చదువుకున్న వాళ్లు తక్కువ . చాలా మందికి దీని పట్ల అవగాహన ఉండదు కదా. ఇది కొంచెం ఖర్చు తో కూడినదే . కానీ తప్పదు అనిపిస్తోంది . ఈ న్యాయపరమైన పోరాటంలో పబ్లిక్ ని కూడా సహాయం కోసం అడగవచ్చు. ముందుగా నేను , నా ఫ్రెండ్స్ న్యూస్ పేపర్ లో ఒక యాడ్ ఇవ్వాలనుకుంటున్నాము ఆంటీ. కొంచెం కొంచెం గా మన సమస్య అందరి దృష్టికీ తీసుకు రాగలిగితే పరిష్కారం సులువు అవుతుంది అని మా ఆలోచన. ఇప్పటికే నా కాలేజ్ లో మా లెక్చరర్లు , ఫ్రెండ్స్ తో మాట్లాడేను . వాళ్లు నా అభిప్రాయం సపోర్ట్ చేస్తున్నారు . అదీ కాక, నేను నా స్నేహితులు కొన్ని స్వచ్ఛంద సంస్థలకోసం పనిచేస్తున్నాము . వాళ్ల నుండి కూడా మంచి సపోర్ట్ ఉంది మనకి . కొంత డబ్బు కూడా మొబిలైజ్ చేసేందుకు సిద్ధపడుతున్నారు.

ముందు మీరు ఏమి ఆలోచిస్తున్నారో తెలుసుకునేందుకు వచ్చేను . మమ్మీ కంటే మీరు ఈ విషయంలో ఎక్కువ శ్రద్ధ చూపిస్తారని తెలుసు నాకు . ప్రస్తుతం మాకు క్లాసులు ఇంకా సీరియస్ గా మొదలు కాలేదు . మేమంతా కొంచెం సమయం కూడా కేటాయించగలం .'

ఆమె చొరవ ,సమస్య కి ఒక పరిష్కారం చూపించాలన్న ఆలోచన రజనికి నచ్చింది .

'శ్రీజా, నువ్వు ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుని ఏదైనా చెయ్యాలనుకోవటం చాల మంచి నిర్ణయం . కానీ మనం ఈ అడుగు వేసేముందు ఒకసారి మ్యానేజ్ మెంట్ తో మాట్లాడితే బావుంటుంది. అందరి ఆలోచన స్కూలు , పిల్లలు కోసమే అయినా ఎవరినీ నొప్పించటం సరైన పద్ధతి కాదు. ఒక స్కూలు అంటే ఏ ఒక్కరితోనో, ఏ ఒక్కరోజులోనో తీరిపోయే సంబంధం కాదు . ఇది మన చుట్టూ ఉన్న ఎందరి జీవితాలతోనో ముడిపడి ఉన్న విషయం . ఇంక, ఈ స్కూలు విషయానికి వస్తే ఒక పరంపరలా చాలా కాలంగా జరుగుతూ వస్తోంది . ఇంకా ఇలా ముందు ముందు కూడా జరుగుతూనే ఉండాలన్న ఆశ మనందరికీ ఉంది. అవునా కాదా అని తేల్చి చెప్పేయ్యమని నిలబెట్టి తేల్చుకునే విషయం కాదు ఇది. నీకు సమయం ఉందని అంటున్నావు కనుక పిల్లలకి క్లాసులు తీసుకుంటూ ఉండు . ఒకసారి అందరితో మాట్లాడి ఏం చెయ్యాలో చూద్దాం.'

' కానీ ఆంటీ ,మనం ఇలా ఆలోచిస్తూ ఎంతో కొంత సమయం వృధా చేసేస్తున్నామేమో ! క్లాసులు జరగకుండా ఆలస్యం అవుతున్న కొద్దీ పిల్లలు సరైన వ్యాపకం , కట్టడి లేకుండా అల్లరిగా తయారవుతారు. నిన్న నేను వస్తూనే నా స్నేహితులని కలిసేందుకు వెళ్లేను. దారిలో ఇద్దరు, ముగ్గురు పిల్లలు, వాళ్ల పేరెంట్స్ కలిసేరు . వాళ్ళు చెబుతున్నారు , తెల్లవారి వీధిలోకి వెళ్లిన

పిల్లలు మధ్యాహ్నం భోజనం కోసం కూడా ఇంటికి రావటం లేదట. వాళ్లని కనిపెట్టుకుని చూసేందుకు ఇళ్ల దగ్గర పెద్దవాళ్లు ఎవరూ ఉండే అవకాశం లేదు . అందరు పనులకి వెళ్లిపోతారు . పిల్లలు ఎప్పుడో తోచినప్పుడు ఇల్లు చేరుతున్నారుట. ఎలాటి చెడు అలవాట్లకి దారి తీస్తున్దో ఇది అని వాళ్లు భయ పడుతున్నారు. సాధ్యమైనంత వరకు మనం త్వరగా ఏదైనా చెయ్యాలి ఆంటీ '

ఆమె మాటలు రజని ఆశ్చర్యంగా వింటోంది . ఆ అమ్మాయి తన కళ్ల ముందు పెరిగిన అమ్మాయేనా అని అనిపించింది .

ముఖ్యంగా శ్రీజతల్లి వసుధ చుట్టూ ఉన్న ప్రపంచం తనది కాదు అన్నట్లు తనదైన స్వంత ప్రపంచంలో ఉంటుంది . శ్రీజ తండ్రి పిల్లలమీద అలవిమాలిన ప్రేమతో వాళ్లకి ఏదైనా నేర్పించాలన్న ఆలోచన కంటే వాళ్లని జాగ్రత్తగా తన సంరక్షణలో కాపాడుకోవాలి అన్నట్లు ఉండే వాడు . శ్రీజ తన చుట్టూ ఉన్న దంతా తన స్వంత ప్రపంచం అని నమ్ముతూ వాళ్ల కోసం ఆలోచించటం .....ఓహ్ ! గొప్పగా ఉంది.

ఎదురుగా కూర్చుని బుల్లి బుద్ధుడు తనకి హితోపదేశం చేస్తున్నట్లు అనిపించింది . 'శ్రీజా ,నిన్ను చూస్తే నాకు గర్వంగా ఉందిరా', అని మాత్రమే అంది ఆమెకు వీడ్కోలు ఇస్తూ .

'దీదీ ' అంటూ లోపలికి వచ్చిన మనీషాని చూసి రజని ఆశ్చర్య పోయింది . ఈ పది పన్నెండేళ్ళ కాలంలో మనిషా తనంత తానుగా సెలవు తీసుకున్నది లేదు. రెండు రోజులన్నది , ఇలా వారం రోజుల తర్వాత ......... మనిషి బాగా అలిసిపోయి నట్లు ఉంది. అకస్మాత్తుగా పదేళ్ళ వయసు మీద పడినట్లు తగని అలసట ఆ ముఖంలో, అలవాటుగా తోసుకు రాబోయిన చిరునవ్వు పేలవంగా మాత్రమే కదిలింది.

'దీదీ, అబ్ మేరేసే కుఛ్ భీ నహీ హోనే వాలా హై ', కళ్ళ నిండా నీళ్ళు. కూర్చోమని బలవంతంగా పక్కన కూర్చోబెట్టు కుంది.

పగలంతా పనిచేసుకునే మనిషాకి బయట ప్రపంచం గుర్తురాదు. ఇల్లు చేరేసరికి తల్లి సణుగుడు మొదలవుతుంది. 'పగలంతా ఇల్లు పట్టక పోతావ్. ఇంట్లో జనం ఎవరి ఇష్టానికి వాళ్ళున్నార'ని గొడవ పెడుతుంది. ఒంటరిగా కుటుంబ భారాన్ని మోస్తోందన్న ఆలోచన ఆ తల్లికి లేదు. ఖర్చులు పెరిగేయి, మరింత డబ్బు కావాలని అంటుంది .

స్వంతంగా , చిన్న వసతి ఒకటి కుటుంబం కోసం ఏర్పాటు చెయ్యాలంటే మనీషాకి సాధ్యం కావటం లేదు. తల్లితో, తమ్ముళ్ళతో చర్చించింది. మామని సలహా అడిగింది .'ఇంట్లో అందరూ సంపాదనాపరులే . ఇల్లెంతలోకి అమర్చుకోవాలి' అంటాడాయన. తమ పొలం కాస్తా అమ్మి పెట్టడమో, తనే కొనుక్కోవడమో చేస్తే తనకి ఉపకారం చేసిన వాడవుతాడని మేనమామతో

చెప్పుకుందుకు పల్లె వెళ్ళింది. మామ దగ్గరకి వెళ్ళిరావటం, అక్కడ ఎదురైన ఆశాభంగం ఆమె మనసులో కదులుతూనే ఉన్నాయి. వస్తూనే తిన్నగా పనిలోకి వచ్చింది.

రజనికి అన్ని వివరాలూ చెప్పుకోవాలనే వచ్చింది . మనీషాకి తెలుసు రజని మాత్రమే తనను అర్థం చేసుకునే వ్యక్తి అని . 'దీదీ ,పల్లెలో ఏమైందో తెలుసా' అంటూ చెప్పుకొచ్చింది

★★★

'రెండు రోజులుండు మాట్లాడుదాం. కొనేందుకు ఎవరైనా సిద్ధంగా ఉన్నారేమో చూద్దాం' అంటూ ఏ రోజుకారోజు గడిపేస్తూ వచ్చేడు మనీషా మామ .

ఆయన పెద్ద కొడుకు దగ్గర్లో ఉన్న మిల్లు లో పని చేస్తాడు . మంచి కట్నం తో పెద్ద కోడల్ని తెచ్చుకున్నాడు . రెండోవాడు చదువు అబ్బక, తండ్రి వెనుక పొలం పనికి కాస్త చేదోడు గా వెళ్ళడం అలవాటు చేసుకున్నాడు. ఏ పనీ చేసే ఉద్దేశ్యం లేని బద్ధకస్థుడు. తండ్రి వెనక ఉండి, పోరితే పనికి కదులుతాడు. లేకపోతే ఊళ్ళో పనిలేని కుర్రాళ్ళతో కల్సి కాలక్షేపం చేస్తాడు .

మామ ఏమి చెబుతాడో , తీరా ఇంత దూరం వచ్చింది. మళ్ళీ మళ్ళీ రావాలంటే తన చేతకాదు అని సహనంతో వారం రోజులు ఎదురుచూసింది. అన్నాళ్ళు ఆగేక ,

'ఇప్పుడు ఉన్న పళంగా ఈ కాస్త పొలం కొనేందుకు ఎవరొస్తారు? నీ చెల్లెల్ని మా రెండోవాడికి చేసుకుంటాను. దానికిచ్చే కట్నం క్రింద ఈ పొలం చెల్లు' అంటూ తాపీగా చెప్పిన ఆయన మాటలకి ఏం చెప్పాలో తోచక ఉండిపోయింది. చెల్లెలు సంగతి తనకు తెలుసు. అది కట్టుకునే ఫ్యాషన్ బట్టలు, దాని వైఖరికి ఈ పల్లెటూళ్ళో వచ్చి ఉంటుందా ?

అదీ కాక మామ కొడుకు సరి ఐన వ్యాపకం లేకుండా సోమరిగా ఉన్నాడు. వీళ్ళ జీవితాలు ఇక్కడెలా వెళ్తాయి? ముందు ముందు ఎలా జరుగుతుంది? అసలు చెల్లెలి పెళ్లి గురించి నిర్ణయం తీసుకునే స్థితిలో తాను ఉందా? ఊహు, ఇది అయ్యేపని కాదు. మామ అంటే తండ్రి తరువాత తండ్రి లాటి వాడు అంటారు .

తన తండ్రి పిల్లలకోసం ఏమీ దాచి పెట్టకపోయినా తాతలిచ్చిన కాస్త భూమి ని నమ్మకంతో ఏళ్ళ తరబడి మామ చేతిలో పెట్టేడు .

మనీషా మాటలు రాని దానిలా అయిపోయిందో క్షణం .

'మామా ! తమ్ముళ్ళు కల్సిరారు. నీకు తెలియనిది ఏముంది. అమ్మ పని చెయ్యలేదు. నా ఒక్కదాని వల్లా చెల్లి పెళ్లి ఖర్చు రాదు. పొలం అమ్మాలనే వచ్చేను. నీకు చాలా రోజులుగా చెబుతూనే ఉన్నాను. పొలం అమ్మిన డబ్బుతో పెళ్లి ఖర్చు తీరేక, ఒక చిన్న వసతి ఏర్పాటు చేసుకుందామని ఆలోచన. సంవత్సరం సంవత్సరం పెరుగుతున్న అద్దెలు చాలా కష్టంగా ఉంది. .............'

ఆ మాటలకి ఆయన నవ్వేడు . 'భలేదానివే, మనీషా. అమ్మితే ఎంత వస్తుందను కుంటున్నావ్ ? పెళ్లి ఖర్చులు కాక ఇల్లు కొనుక్కునేంత డబ్బెక్కడ వస్తుంది? పిచ్చి ఆలోచనలు మాని నీ చెల్లిని పెళ్లి కి ఒప్పించి, కబురంపు ' ఇంకా చెప్పేది , వినేది లేదన్నట్లు లేచి వెళ్ళిపోయాడాయన.

భోజనం వేళ వరకు ఉండమంటున్న అత్త మాటలు వినిపించుకో కుండా తిరుగు ముఖం పట్టింది.

పని సానుకూలం కాకపోవడం ఆమెను కృంగ దీసింది. వింటున్న రజని మనసు నొచ్చుకుంది. ఎప్పుడూ కంట నీరు పెట్టని ఆమె అంత దిగులుగా ఉంటే కష్టమనిపించింది.

' అనుబంధాలు, అయినవాళ్ళు నీ ఉచ్వాస నిశ్వాసాలుగా
జీవనానందాన్ని నీదైన మతంగా చేసుకున్నావ్ !
కురవని నల్లమబ్బు డొల్లతనం మాత్రం
గుండెకి గండి పడినతర్వాతే తెలిసేది ! '

కుటుంబం పట్ల ఇంత బాధ్యతా తీసుకుంటున్నా డబ్బు మీద మమకారం మాత్రం చూబించదు. ప్రతి దీపావళికీ అందరూ రెండు నెలల జీతాన్ని బహుమానంగా ఇస్తే దానిలో మూడో వంతు తన వంతుగా స్కూల్ లో పేద పిల్లల చదువుకి ఇచ్చేస్తుంది.

'నీ కుటుంబ ఖర్చులు లేవా ? అది ఏడాదిపాటు నీ కష్టానికి దొరికే ప్రత్యేక బహుమతి , స్వంత ఇంటికోసం కాస్త కాస్త కూడ పెట్టుకో ' అని రజని ఎంత చెప్పినా వినదు .

'దీదీ , నేను ఇప్పుడు కొంచెం సంపాదించుకోగలుగు తున్నాను కానీ , ఈ జన్మ లో చదువుకునే అదృష్టం నాకు లేదు. ఇప్పుడు చదువు కునేందుకు డబ్బు లేక అవస్థలు పడే వాళ్ళకోసం ఈ డబ్బు ఉపయోగ పడితే వచ్చే జన్మ లో చదువుకుందుకు నాకు సహాయం, దొరుకుతుంది. అందుకే నేను ఈ పెట్టుబడి పెట్టుకుంటున్నాను. వద్దు అనకు, అవసరమైన వాళ్ళకోసం ఇది ఖర్చు పెట్టు దీదీ ' అంటుంది, తను పూజించే దేవుడి మీద అపార నమ్మకంతో.

★★★★★

ఎవరో ఫోన్ చేస్తున్నారు , వాయిస్ క్లియర్ గా లేదు . లైన్ కట్ అయింది. మళ్ళీ రింగ్ అయింది . ఈసారి కొంత స్పష్టంగా వినిపించింది .

'నమస్తే మేడమ్, నేను టెన్త్ బి సెక్షన్ లో రవీంద్ర ని మాట్లాడు తున్నాను .

'చెప్పు రవీ , ఏమిటి విషయం ? '

'మేడమ్, మీ ఇంటి ఫోన్ నంబర్ స్కూల్లో కనుక్కుని చేస్తున్నాను. నాతో పాటు శ్రీకర్ , శివాజీ అందరు ప్రస్తుతం ఇక్కడ ఉన్నారు. మాకు క్లాసులు ఎప్పటినుండి జరుగుతాయి? ఎవరిని అడగాలోతెలియటం లేదు. ఆఫీస్ లో ఎవరూ చెప్పడం లేదు . సిలబస్ ఎలా పూర్తి అవుతుంది మేడమ్ ?' అతని గొంతులో ఆందోళన .

వాళ్ళ బాధ అర్ధమవుతోంది. ఏం చెప్పాలి ఈ పిల్లలకి ? పదో క్లాసు పిల్లలు వందమంది పైన ఉన్నారు రెండు సెక్షన్స్ కలిపి . తనతో పాటు క్లాసులు తీసుకునేందుకు అందరు సిద్ధంగా ఉన్నారు. కాని ఎక్కడ?ఎలా? తన ఆలోచన సాగుతోంది.

'రవీంద్రా, మీరందరూ దిగులు పడకండి . మీరు చిన్న చిన్న గ్రూపులుగా ఎవరో ఒకరి ఇంటి దగ్గర చేరి అర్ధమైనంతవరకూ పాఠాలు చదివే ప్రయత్నం చెయ్యండి. '

'సరే మేడమ్. మిమ్మల్ని మేమంతా ఇంటి దగ్గర కలవచ్చా ?'

'తప్పకుండా. నేను చెబుతాను ఎప్పుడనేది'.

ఫోన్ పెట్టేసినా అదే విషయం నలుగుతోంది. రజని ఈ విషయం గురించి ఇప్పటికే ఒక ఆలోచనకి వచ్చింది. తమ హౌసింగ్ సొసైటీ వాళ్ళతో చిన్న మీటింగ్ కూడా ఈ వారాంతంలో ఏర్పాటు చేసింది. ఇంకా గీత, మిసెస్ శర్మ అందరూ ఒక్కలాగే ఆలోచిస్తున్నారు. స్కూల్ సంగతి పూర్తిగా తేలేవరకూ పిల్లలకి తమకు చేతనైనంత సహాయం చెయ్యాలి. దాని కోసం తమ తమ హౌసింగ్ సొసైటీ ల వాళ్లతో మాట్లాడి,వాళ్ళ అనుమతి తో ఇళ్ళ దగ్గరే క్లాసులు జరుపుకుంటూ ఉండాలి.

అలవాటుగా స్కూలు దారి పట్టి , వాకింగ్ ముగించుకుని వస్తూ వయసు బరువుకి ఒంగిన సోనార్ బాయిని చూస్తే ..... ఆ వయసుకు ఆమె పడే శ్రమ ఆమె జీవనానికి అవసరం అయినమాట నిజమే అయినా ఇంకా ఆ చేతులకి అంత శక్తి ఉందా అని ఆశ్చర్యం ! ఆ తరం వాళ్లకున్న మనోబలం గొప్పది .

సోనార్ బాయి ని చూడగానే చిన్న అమ్మమ్మ గుర్తొచ్చి మనసు మరోసారి గతంలోకి జారుకుంది.

★★★

చిన్న అమ్మమ్మ కూడా అంతే కదూ . ఎప్పటిలాగే వేసవి సెలవులు రావడం , పరుగెత్తుకుని ఆంధ్ర వెళ్ళడం ........ రైల్లో తాపీగా వెళ్లి , రోజంతా చేసిన ప్రయాణం బడలిక ని స్టేషన్ లోనే వదిలి హాయిగా రిక్షా ఎక్కి ఇల్లు చేరడం రజని కి సరదా . ఇంట్లో అందరూ

చెప్పి చెప్పి విసిగి పోయేరు. తనను రిసీవ్ చేసుకునేందుకు ఎవ్వరూ రావద్దని ఆమె పెట్టే ఆంక్ష అందరికీ అలవాటై పోయింది . రైలు వచ్చి వెళ్లి పోయిన గంట కి తాపీగా ఇల్లు చేరే రజని ని చూసి విసుక్కో వటం మాని, నవ్వటం అలవాటు చేసుకున్నారు .

ఊళ్ళోవచ్చిన మార్పులు తాపీగా పరిశీలిస్తూ , రిక్షా అబ్బి చెప్పే కబుర్లు వింటూ , ఈ మధ్యలో మాయమైపోయిన ల్యాండ్ మార్కుల కోసం వెతుక్కుంటూ ఇల్లు చేరేది . రిక్షాలు చాల వరకు తగ్గిపోయెయి . మళ్లీ వచ్చేసరికి అసలే కనిపించవేమో అని దిగులు పడేది.

ఈ సారి ట్రిప్ లో తల్లి ముందుగా చెప్పినట్లు చిన్న అమ్మమ్మ ని చూసేందుకు బయలు దేరేరు మరునాడే. కృష్ణా జిల్లా దాటి, గోదావరి జిల్లాల అందాలను చూసుకుంటూ వెళ్తే ఎంత, ఒక్క రెండున్నర గంటల్లో చేరిపోయేరు కోనసీమకి. రోడ్లు బాగా ఉన్నాయి. ఊరు మాత్రం అలాగే శిధిలమవుతున్న ఇళ్ళతో ఉంది. ఇప్పటి తరం అంతా చదువులు , ఉద్యోగాలు వెతుక్కుంటూ దేశం నలుమూలలకీ , ఇంకా విదేశాలకీ వెళ్లి పోతూ ఉండటంతో వ్యవసాయం నమ్ముకున్న వాళ్ళు , ఇల్లు వదలలేని పెద్దలు మిగిలేరు.

తల్లి పక్కన కూర్చుని ఆవిడ నెమరు వేసుకుంటున్న పాత రోజుల్ని పంచుకుంటూన్నా రజని ప్రకృతి అందాలని తన లోకి ఆవాహన చేసేసుకుంటూనే ఉంది దారి పొడవునా. ప్రయాణం తల్లిని శారీరకంగా అలిసిపోయేలా చేసినా, పుట్టి పెరిగిన ఊరు, ఇల్లు చేరి, తన వాళ్ళ ని కలుసుకుంటున్నానన్న ఆనందం ఆవిణ్ణి ఉత్సాహంగా ఉంచింది.

చిన్న అమ్మమ్మ బలహీనంగా ఉంది. వీళ్ళని చూసిన బలంతో కబుర్లు చెబుతోంది. చిన్నప్పుడే భర్త పోవటంతో ఆవిడ జీవితంలో సుఖపడిన రోజులు తక్కువే . తన బాధని మరిచి ఉమ్మడి కుటుంబంలో అందరి కీ సేవ చేసి తన ఇద్దరు పిల్లల్ని చదివించుకుంది. వాళ్ళు ఉద్యోగస్థులయ్యాక పెళ్ళిళ్ళు చేసి, ఆపైన మనవలని పెంచి పెద్ద చేసింది.

జీవితపు ఆఖరి మజిలీ వరకు వచ్చింది, ఇంక తనకు విముక్తి వచ్చేస్తుంది అని ఎదురుచూస్తుంటే షష్టి పూర్తి చేసుకున్న కొడుకులిద్దరూ భార్యలతో కలిసి యాత్రలకి వెళ్లి తిరిగి రాక పోవటంతో ఆవిడ ప్రపంచం తలక్రిందులైంది. అప్పటిదాకా ఆమె చూసిన కష్టాలు చిన్నవి అయిపోయేయి. మండల కేంద్రం లో పని చేస్తున్న మనవడు నీడలోకి వచ్చింది. వృధ్ధాప్యం శాపం కాదు అని చెబుతున్నా తను ఇంకా ఏమి చూసేందుకు జీవించి ఉందో అర్ధం కాలేదు ఆవిడకి.

ఎక్కడో పుట్టి, ఆ ఇంటి కోడలైన మనవడి భార్య ఆ వృద్ధురాలి పట్ల అభిమానం చూబించటం ఆవిడ తను చేసుకున్న పుణ్యం అంటుంది. రోజూ ప్రొద్దున్నే కాఫీ గ్లాసు అందించే మనవడి భార్యతో ' తెల్లారి లేచే శ్రమ లేకుండా చెయ్యమని రాత్రి దేవుణ్ణి కోరుకునే పడుకున్నానే సుజాతా ' అంటుంది. ఇంకా జీవించి వాళ్లకి భారం అవుతున్నానన్న భావం ఆవిడలో .

'అలా అయితే మా పిల్లలకి కథలు చెప్పి, నిద్ర పుచ్చేది ఎవరు ? వాళ్ళు పెద్దవాళ్ళు అయ్యేవరకు మీరు మాకు కావాలి అమ్మమ్మా ' అంటుంది సుజాత నవ్వుతూ.

నడుం ఒంగిపోయి, కంటి చూపు తగ్గిపోయినా తను ఎవరికీ బరువు కాకూడదని తన పనులు తనే చక్క బెట్టుకోవటమే కాకుండా సుజాత కి పనుల్లో సాయం చేస్తానని వెంటపడే ఆవిడని చూసి రజని గర్వపడింది. వచ్చిన అతిథులకి మర్యాదలు

చేస్తూనే, అమ్మమ్మకి అవసరమైనట్లు గా అన్నం మెత్తగా విడిగా ఉడికించి వడ్డిస్తున్న సుజాత రజనికి నచ్చేసింది. అత్తవారింటికి వచ్చినప్పటి నుండి ఆ అమ్మమ్మ బాధ్యతా తనది అన్నట్లు ఆదరించడం ............... ఇలాటి పెద్ద మనసు అంత చిన్న వయసులోనే ఎలా సాధించిందో !

'ఇదిగో, ఈ పిల్ల తన పిల్లలతో పాటు నన్నో పసిపిల్లలాగా చూసుకుంటుంది. ఒక్క క్షణం వదలదు . ' బోసినోటితో మనసారా నవ్వింది. గొంతు, కళ్ళు తడిబారనివ్వకుండా జాగ్రత్త పడింది. ఇన్నేళ్ళుగా వాటిని గొంతులోనే అణిచి జీవితాన్ని నెట్టుకొచ్చింది.

ఇంకా జీవితం ఎంత పొడవున నడిపించుకు వెళుతుందో, తను నిమిత్తమాత్రురాలే అన్న సంగతి ఆకళింపు చేసుకుని నిశ్శబ్దంగా ప్రకృతిలో ఒదిగి పోయినట్లు ఉండిపోయింది.

అమ్మమ్మతో కబుర్లు చెప్పి పెరటిలోకి దారి తీస్తే, బావి గట్టున ఆవలగా ఉన్న కొబ్బరి, అరటి, సపోటా, మామిడి చెట్లు , వాటిని దాటితే ఉన్న పశువుల పాక ....ఇవన్నీ రజని తల్లి బాల్యపు గుర్తుల్ని చెరిగిపోకుండా కాపాడుకుంటూ వస్తున్నాయి. ఆవిడ వీధి అరుగు మీద కి వచ్చి, నెమ్మదిగా మెట్లు దిగి వీధి పొడవునా మిగిలి ఉన్న ఒకప్పటి ఆనవాళ్ళను చూస్తోంది. ఎదురుపడిన తనవయసు వాళ్ళని పలకరిస్తోంది.

లోపలికి వచ్చి ఏదో మరిచి పోయినట్లు కొట్టు గది వైపుగా నడుస్తున్న తల్లి వెనుకే నడిచింది రజని .

కొట్టుగదిగా పిలవబడే ఆ గది పాత కాలం నాటి చెక్క తలుపులు తోసి మరీ లోపలికి వెళ్ళింది. తల్లి ఎన్నిసార్లో చెబుతుంటుంది తన పేరుకు ఆ గదికి ఉన్న సంబంధం. అమ్మమ్మ అమ్మను కడుపుతో ఉన్నప్పుడు ఆ కొట్టు గదిలో ధాన్యం బస్తాల క్రింద పెద్ద త్రాచు పాము కనిపించిందట. దానిని చూసి అమ్మమ్మ భయంతో వెర్రి కేకలు పెట్టిందట. అరుగు మీద వేద పాఠాలు వల్లె వేస్తున్న విద్యార్థులు పరుగెత్తుకువచ్చేరట.

ఆ హడావుడికి గొడ్ల సావిట్లో ఉన్న వీరయ్య కర్ర పుచ్చుకు వచ్చేసేడుట. ' బస్తాల క్రిందకి వెళ్ళిపోయింది, దాన్ని అలా వదిలెయ్య టానికి లేదు ,జాగ్రత్తగా పట్టుకోవాలి ' అంటూ చుట్టూ ఉన్న వాళ్ళని దూరంగా వెళ్ళ మని ఓర్పుగా గుమ్మం దగ్గర కాపు కాసేడుట. చిన్నప్పటి నుండీ పాముల పట్ల ఉన్న ఆసక్తితో పట్టుకుందుకు సిద్ధమయ్యాడు. సాయంత్రం చీకటి పడే వేళకి పట్టుకునే ప్రయత్నంలో దానిని చంపేసేడుట. క్షణాల్లో చేతికి చిక్కినట్లే చిక్కి జారిపోయింది, పట్టు జారిపోతోందని కర్రతో బలంగా దెబ్బ వెయ్యటం, దాని ప్రాణాలు కనుమూసి తెరిచే లోగా పోవటం జరిగిపోయింది.

అంత పెద్ద త్రాచుని సునాయాసంగా ఒక్కడూ చంపి ఊళ్ళో జనాల ప్రశంసల బరువుని భుజాలకెత్తుకుని ఇల్లు చేరేడు. అతని కంటే వార్తా ముందే ఇల్లు చేరింది. పుట్టింటికి పురిటికి ప్రయాణం అవుతున్న భార్య మాత్రం గజగజా వణికి పోయింది, నాగేంద్రుడు పగ

పడితే పుట్టేబిడ్డ ఏమైపోతాడు అంటూ.ఆ మాటలకి ధైర్యమంతా నీరుకారి పోగా రివ్వున వెను తిరిగి తాత గారింటికి పరుగెత్తి ,' అయ్యా,నా భార్యకు కనే పొద్దులు. నాగేంద్రుడిని చంపిన పాపం నా బిడ్డని ఏమి చేస్తుందో ' అంటూ గొల్లు మన్నాడట.

'ఏమీ కాదు. ఆ నాగేంద్రుడి పేరు పెట్టుకో ' అంటూ ధైర్యం చెప్పి పంపేరుట.

అప్పటి నుండీ పుట్టిన బిడ్డకి కళ్ళు లేవనో, కాళ్ళు లేవనో పీడ కలలు కంటూ గొడవ పెట్టేవాడుట. ఈ తప్పు కాసి తన బిడ్డని కాపాడితే ఇకపైన పాముల జోలికి వెళ్లనని శపథం కూడా చేసేడుట.

'అయితే అమ్మ వయసుదే ఇంకొక నాగమణి ఉందన్నమాట ఆ ఊళ్ళో' అని నవ్వేది కథంతా విన్న రజని.

పదకొండేళ్ళకి పెళ్లి పీట లెక్కిన తల్లిని మగపెళ్లి వారు, ముఖ్యంగా అత్తయ్యలు, బాబాయిలు పాతకాలం పేరు అంటూ వేళాకోళమ్ చేయడంతో ఆవిడకి ఆ పేరు అసలు నచ్చడం మానేసిందిట. ఎవరైనా పేరేమిటి అని అడగ్గానే బిడియంగా నేల చూపులు చూస్తూ నిలబడేదిట. తల్లి ఈ కథ చెప్పినప్పుడల్లా తామంతా నవ్వేవారు, ' అంత చక్కని పేరు , దానికేం లోటు వచ్చిందమ్మా ' అంటూ. ఆవిడ చేతిలో చెయ్యి వేసి నిలబడిపోయింది రజని ఒక్క క్షణం. పాత విషయం ఇద్దరి మనసులో మెదిలి ముఖాల నిండా సన్నని నవ్వు పరుచుకుంది .

జీవితం అంటే ........... నిన్నటి వాస్తవాలు,అనుభవాలు నేటికి జ్ఞాపకాలుగా మిగులుతాయి కాబోలు! ఎక్కడెక్కడి గతాన్ని గారంగా చెయ్యి పుచ్చుకుని ఆయా సందర్భానికో, సన్నివేశానికో తగ్గట్లుగా ఒక్కో విషయాన్ని కళ్ళ ముందు ఆవిష్కరింప చేస్తుంటాయి ఈ జ్ఞాపకాలు. ఇవి మనిషికి అన్నిటినీ మించిన నేస్తాలు .

ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. అనుకున్నట్లుగానే హౌసింగ్ సొసైటీ వాళ్ళు మీటింగ్ కి పిలిచేరు. రజని తన స్కూలు విషయం అందరి దృష్టి కి తీసుకొచ్చి కాంపౌండ్ లో తాత్కాలికంగా క్లాసులు నడపాలని అనుకుంటోంది. ఆమె నోరు విప్పక ముందే కాంపౌండ్ లో నివసించే నలుగురు అయిదుగురు నుండి కంప్లెయింట్లు మొదలయ్యేయి .

స్కూల్ పిల్లలు తరచూ రజని కోసం వస్తూ, కాంపౌండ్ లో తిరుగుతున్నారని, మెట్ల మీదా , లిఫ్ట్ లోనూ కూడా కనిపిస్తున్నారని , తమ ప్రైవసీ కి , భద్రత కి అది చాలా చాలా నష్టం కలిగిస్తోందని చెప్పుకొచ్చేరు.

వాళ్ళను కూర్చోమని, ప్రెసిడెంట్ 'ఇక్కడ మీటింగ్ ఏర్పాటు చేసింది అందుకనే' అని చెప్పేరు. ఆయన రజనిని మాట్లాడమని, విషయం ఏమిటో వివరించమని చెప్పి కూర్చున్నారు .

'ఫ్రెండ్స్ ..........' అంటూ మొదలు పెట్టి తమ స్కూల్ కి వచ్చిన సమస్య వివరించి, అది పరిష్కారం అయ్యేవరకు కొద్ది రోజులు పార్కింగ్ లో క్లాసులు నడుపుకుందుకు తమకు పర్మిషన్ ఇవ్వాలని, పిల్లల వైపు నుండి ఎలాటి సమస్య రాకుండా తను చూసుకుంటానని, రోజుకి మూడు నాలుగు గంటలు మాత్రం చాలని అభ్యర్ధించింది. వెంటనే అందరి నుండి కూడా వ్యతిరేకత వచ్చింది .

రజని వాళ్ళకి స్కూల్ ఆశయం, దాని చరిత్ర కూడా చెప్పి ఇది ఒక ప్రత్యేకమైన సందర్భంగా తీసుకుని ఆలోచించమని అంది.

సభ్యులంతా అంత క్రితం లాగా గట్టిగా మాట్లాడ కుండా తమలోతాము చర్చించుకోవటం మొదలు పెట్టేరు. కానీ ఇలాగ అందరికీ ఎప్పుడో అప్పుడు, ఏదో ఒక అవసరం రావచ్చు. ప్రతిసారి ఇలాటివి ప్రోత్సహించడం కుదరదు అని , అది సొసైటీ రూల్స్ కి వ్యతిరేకం అని కొందరు చెప్పేరు .

ప్రెసిడెంట్ లేచి ,' నేను ఒక మాట చెబుతాను, ఆలోచించండి ...... ' అనటంతో అందరు నిశ్శబ్దంగా ఆయనని వినటం మొదలు పెట్టేరు.

' మీరు అన్నట్లు ఇలాటి అవసరాలు వస్తూనే ఉంటాయి ఎవరో ఒకరికి. కానీ ఇప్పుడున్న విషయం ప్రత్యేక మైనది. స్కూల్ చరిత్ర ఇప్పుడు ఇక్కడ ఉన్న వారందరికీ తెలుసు. ఇన్ని సంవత్సరాలుగా అది సమాజంలో ఒక ముఖ్య పాత్ర పోషిస్తోంది, ఎందరో చిన్న చిన్న ఉద్యోగుల పిల్లల్ని చదివించి, తీర్చి దిద్దింది. ఇప్పుడు ఒక సమస్య తలెత్తింది. ఇన్నేళ్ళూ మనం ఈ సంస్థకి ఎలాటి సహాయం చెయ్యలేదు, చెయ్యవలసిన పరిస్థితి రాలేదు .

ఒక ఆదర్శం కోసం నడుస్తున్న సంస్థ ఇది. ఆ సమస్యని పట్టించుకోవలసిన అవసరం లేదంటే లేదు అనుకోవాలి. కాని మన మధ్య జీవిస్తున్న రజని అక్కడి పిల్లలకి ఎదురైన కష్టం అర్థం చేసుకుని తన వంతు ఏదైనా చెయ్యాలని చూస్తోంది .

ఈమె ప్రయత్నానికి నేను వ్యక్తిగతంగా అభినందిస్తున్నాను. ఇప్పుడ మనం ఆమెతో చేతులు కలిపి ఆ పిల్లలకి మన వంతు చిన్న సాయం చెయ్యగలిగేందుకు వచ్చిన అవకాశంగా ఈ విషయాన్ని చూస్తే నాకు సమ్మతం అనే అనిపిస్తోంది. అయితే మిగిలిన సభ్యులు తమతమ స్వంత అవసరాలకి ఇలాటి అభ్యర్ధన చెయ్యవద్దనే చెబుతాను. ఆలోచించండి. ' ఆయన కూర్చున్నారు. ఆయన ఎన్నో విద్యాసంస్థలలో పని చేసిన , చేస్తున్న అనుభవం ఉన్న వ్యక్తి .

ఆయన చెప్పింది న్యాయంగా తోచింది చాలా మందికి . నెమ్మది నెమ్మదిగా అందరూ తమ సమ్మతిని తెలియచేసేరు . రజని కళ్ళ నీళ్ళ పర్యంతం అయింది ఒక్కసారి. అందరికీ కృతజ్ఞతలు తెలియచేసుకుంది .

★★★★★★★★★★★★★★★★★

రజని ఆనందానికి అంతులేదు . ఇది తన తొలి విజయం . ఎదురైన సమస్యకు తనకు, తన స్నేహితులకు తోచిన పరిష్కారం లో ఇది ఒక భాగం. ఇంకా చెయ్యవలసింది చాలా ఉంది.

సాయంత్రం అలవాటుగా స్కూల్ ని చుట్టి వస్తున్న రజని కంటికి స్కూల్ ఆవరణలో పిల్లల సందడి కనిపించి ఆగిపోయింది . హయ్యర్ క్లాసు పిల్లలు దాదాపుగా ఒక ముప్ఫై, నలభై మంది దాకా చెట్ల క్రింద కూర్చుని ఉన్నారు. శ్రీజ వాళ్ల మధ్య కూర్చుని ఏదో మాట్లాడుతోంది. ఆమె తో పాటు ఆమె ఫ్రెండ్స్ కూడా కొందరు అక్కడ ఉన్నారు .

రజని ఆ పిల్లల కమిట్మెంట్ చూసి ఆశ్చర్యపోయింది. సమయం విలువ తమ తరం కంటే వీళ్లకి ఎక్కువ అవగాహన ఉందేమో అనిపించింది. వాళ్ల కమిట్మెంట్స్ ఎక్కువ, అందుకే కాలానికి పోటీగా పరుగులు పెడుతుంటారు కాబోలు.

ఆశయం అంబరమంత ఉన్నప్పుడు
ఆవేశం అధిగమించలేనిది కాకూడదు .
గమ్యం అంటూ రేపటిని ఆవిష్కరించుకున్నప్పుడు
అడుగులు నేర్చిన పాదాలుంటే చాలవు ,
వాటి క్రింద నడకను కొలిచే రహదారులు కావాలి .

నీ ఆత్మవిశ్వాసం నిన్నంటి వచ్చే నేస్తాలకు గుండె బలాన్నివ్వాలి !

తమ వైపు నుండి చెయ్యదలచుకున్న పనులు మరింత వేగవంతం చెయ్యాలన్న స్పృహ రజని కి కలిగింది .

★★★★★★★★★★★★★★

'అక్కా ,ఎలా వున్నారు మీరంతా అక్కడ ?' , చాలా రోజుల తర్వాత చెల్లెలు శైలు నుండి కాల్. రజని స్వంత వూరు వెళ్లొచ్చిన తర్వాత ప్రతిసారి దేశానికి దూరంగా ఉన్న చెల్లెలు ఫోన్ చేసి కబుర్లు చెప్పించుకోవటం ఆనవాయితీనే .

'బావున్నాం శైలూ , మీరు ఎలా వున్నారు? మీరిటు ఇండియా వచ్చే ఆలోచన ఏదైనా ఉందా ఇప్పట్లో?'

'ప్రస్తుతానికి ఏమీ లేదక్కా . నీ కూతురు విరాజిత ని వీలు చూసుకుని మా దగ్గరకి రమ్మని చెప్పేము. నీ వేసవి సెలవులు, విజయవాడ ట్రిప్ బాగా జరిగేయా? అమ్మ ద్వారా కొన్ని కబుర్లు తెలిసేయనుకో '

'బాగా జరిగాయి శైలూ, చిన్న అమ్మమ్మ ని చూసి రావటం హైలైట్. అమ్మని, నన్నూ చూసి చాలా సంతోషించింది. బోలెడు కబుర్లు చెప్పింది. నువ్వు వచ్చి ఉంటే బాగా ఎంజాయ్ చేసేదానివి. నీ కూతురు దీపూ అయితే ఆ పొలాలు, ఆ మట్టి రోడ్లు , అమ్మమ్మ ఇంటి పెరట్లో పశువుల పాక,ఆ గెంతులేసే దూడలు ,మామిడి చెట్ల నిండా వ్రేలాడుతున్న పళ్లు .... అన్నింటినీ చూసి ఎలా వ్యాఖ్యానించేదో ! అది ప్రతి దాని గురించీ చక్కని వ్యాఖ్యానం ఇస్తుందిగా ............ .' రజని సంబరంగా చెబుతుంటే శైలు అడ్డుకుంది.

'అక్కా, అసలు ఇప్పుడు ఫోన్ చేసిన కారణం కూడా దీపూనే. దాని మీద నీ ప్రభావం ఎంతగా ఉందో మొదటి సారిగా నాకు తెలిసింది. అదిప్పుడు టీన్స్ లోకి వచ్చింది కదా. తన ఆలోచనలు గట్టిగా చెబుతోంది. ఇంతకీ ఏమిటో తెలుసా? వాళ్ల స్కూల్ లో ఇచ్చిన ఒక అసైన్మెంట్ లో తన ఫ్యూచర్ ప్లాన్స్ గురించి చెబుతూ , తనని మోటివేట్ చేసినదానివి నువ్వు అని, నీ గురించి చాలా గొప్పగా వ్రాసిందని టీచర్ చెప్పింది ఒక ఆరు నెలల క్రితం.

పిల్లలు సెలవుల్లో ఉన్నారని క్రితం వారం మేము 4,5 కుటుంబాల వాళ్ళం ఒక పిక్నిక్ పెట్టుకున్నాం. పిల్లలకి కొన్ని రకాల గేమ్స్ ,పజిల్స్ కండక్ట్ చేసేం. ఆఖరుగా వాళ్లు పెద్ద అయ్యాక ఏం చేస్తారో, వాళ్ల దృష్టిలో రోల్ మోడల్ ఎవరో వివరంగా రాయమని అడిగేం . దీపూ ఏమి రాసిందో చెప్పుకోగలవా ? ' అక్కని సవాలు చేసింది శైలు.

'చెప్పు, ఏమి రాసిందేమిటి ?'

' దాని రోల్ మోడల్ నువ్వు అని, తన ప్రీ యూనివర్సిటీ చదువు అయ్యేక కొంచెం బ్రేక్ తీసుకుని ఇండియా వచ్చి నువ్వు పనిచేస్తున్న స్కూల్లో పనిచేస్తుందట. నాకు కూడా దాని ఆలోచనలు ఎప్పుడూ చెప్పలేదు ఇన్నాళ్లూ. అందరు నీ గురించి ఒకటే అడగటం !..........' ఊపిరి పీల్చుకుందుకు ఆగింది.

రజని ఆశ్చర్యంగా వింటోంది. అంతలోనే దిగులు కమ్ముకొచ్చింది ఆమెని.

'అక్కా, వింటున్నావా?.' శైలు ఉత్సాహంగా ఏదో చెప్పబోతోంటే,

'వింటున్నాను శైలూ , కానీ ఇప్పుడు మా స్కూలు ఒక సమస్య లో పడింది . ..........'

'మీరు అందరూ ఉండగా స్కూలు కి సమస్యలు ఉంటాయా ?' ఈ సారి ఆశ్చర్య పోవటం శైలు వంతు అయింది.

'అవును , స్కూల్ నిర్వహణ ఖర్చులు ఎక్కువ అయిపోయేయని ఫీజులు రెట్టింపు చేసేరు. పిల్లలు కట్టలేమని గొడవ పెడుతున్నారు. క్లాసులు నిరవధికంగా నిలిపేసేరు. వేసవి సెలవుల తర్వాత ఇంకా స్కూలు తెరవను కూడాలేదు.' చెప్పింది రజని.

ఈ పరిస్థితి చిత్రంగా అనిపించింది శైలు కి. జవాబు చెప్పేందుకు ఏమీ తోచలేదు.

'మేము కొంత మంది ఇళ్ల దగ్గర ప్రస్తుతానికి క్లాసులు తీసుకునే ఏర్పాట్లు చేసుకుంటున్నాం. కానీ పరిష్కారం అంత సులువుగా అయితే కనపడటం లేదు . '

రజని తాము చేద్దామని అనుకుంటున్న విషయాలు చెల్లెలికి చెబుతూ ఆఖరుగా అంది,

' శైలూ, ఈ సమస్య త్వరగా తీరిపోవాలని ఆశిస్తున్నాం. నువ్వు మాత్రం దీపు కి ఇవన్నీ చెప్పకు. దాని మనసు చిన్న బోతుంది .' శైలు సరే నంటూ నిట్టూర్చింది.

'అక్కా,దేశంలో ఉంటే మీ అందరితో కలిసి మంచికి ,చెడుకి తోడుగా ఉండే వీలు ఉండేది అనిపిస్తోంది. దూరంగా ఉండటం వలన మిమ్మల్ని మిస్ అవుతున్నాను. మీకు ఏ విధమైన సాయం చెయ్యలేక పోతున్నాను ' విచారంగా అంటున్న చెల్లెలి మాటలని రజని ఖండించింది.

' అలా అనుకోకు శైలూ, సమస్యలు లేనిదెక్కడ ? నువ్వు ఉన్న సమాజంలో అక్కడ నీకు చేతనైనది నువ్వు చేస్తూనే ఉంటావు . అంతే '.

ఆశల రెక్కల విమాన మెక్కుతూ
అనుబంధాల నిచ్చెన ప్రక్కకి జరిపేవ్ !
వెనక్కి తిరిగి చూస్తే ,
భౌతిక దూరాలు వాస్తవాలయ్యేయి !

అక్కున చేర్చుకునే ఆత్మీయతలు మాత్రం
అధివాస్తవాలవుతున్నాయంటావా !?
లేదు...............

ప్రవాహపు ఒడిలోనే ఉన్నావు ,
ఒడ్డు చేరేందుకు సమయముంది !.
కాస్తంత ఓరిమితో నీటి వాలునే కదులు ,
దారి పొడవునా నిన్నంటే నీటి బిందువుల్ని మాత్రం
సున్నితంగా నైనా విదిలించేయ్యాలి సుమా !

చెల్లెలి ఫోన్ కాల్ తో రజని ఆలోచన దీపు మీద కి మళ్ళింది .

రెండు మూడేళ్ల క్రితం వేసవి సెలవులకి పిల్లలని తీసుకుని చెల్లెలు రావటం జ్ఞాపకం వచ్చింది. చెల్లెల్ని, పిల్లల్ని తీసుకుని స్వరాజ్య మైదాన్ లో జరుగుతున్న ఎగ్జిబిషన్ కి వెళ్ళటం ..........

దీపుని అక్కడున్న అన్ని రైడ్స్ ఎక్కించి ఎంటర్టెయిన్ చెయ్యాలని శైలు తాపత్రయ పడింది. ఇంతా చేసి అన్నీ ముగించి ఇల్లు చేరేక దీపు పెట్టిన పేచీ దేనికో అర్థం కాలేదు. భోజనం చెయ్యకుండానే ఏడ్చి నిద్రపోయింది. రజని తల్లి సముదాయించబోయినా శైలు ఆవిణ్ణి వారించింది, 'దానికి పెంకెతనం ఎక్కువైంది , నువ్వు బ్రతిమాలకమ్మా 'అంటూ.

'చంటిపిల్ల ఆకలితో పడుకుంది ' అని రజని తల్లి బాధ పడింది.

తెలవారి వినిపిస్తున్న కోయిలరాగాలు విని, అందరికంటే ముందుగా నిద్ర లేచి పెరట్లో ఉన్న అమ్మమ్మ దగ్గర చేరింది దీపు. చెట్టు నిండా కాయలతో భారంగా ఉన్న పనస చెట్టు మీద కోయించేందుకు సిద్ధంగా ఉన్నవాటిని అమ్మమ్మతో కలిసి గుర్తుపట్టింది. అదే అదనుగా క్రితం సాయంత్రం ఎగ్జిబిషన్ లో జరిగినదంతా చెప్పుకుంది.

'అమ్మమ్మా , అమ్మ నేను ఎక్కుతానన్న రైడ్ నన్ను ఎక్కనివ్వలేదు ' అంటూ .

'అందుకని భోజనం చెయ్యకుండా పడుకుండి పోయావా దీపూ ?అమ్మని మరోసారి అడగాల్సింది. '

నిద్ర లేచి వస్తూన్న శైలు ని నిలదీ సింది ఆవిడ.

'ఎక్క నివ్వక పోవటం ఏమిటమ్మా ? దీపు కనీసమ్ 10,12 రైడ్స్ ఎక్కింది. ఇంకా ఎక్కేందుకు అక్కడ ఏమీ లేవు ' విసుక్కుంది శైలు.

'ఉంది, లోపలికి వెళ్ళంగానే రైట్ సైడ్ కార్నర్ లో ఉంది కదా ఒకటి. అది నేను ఎక్క లేదు. నువ్వు వద్దని చెప్పేవు ' తల్లి మీద ఫిర్యాదు చేసింది .

'అది 5 సంవత్సరాల లోపు పిల్లలకోసం. నీ కోసం కాదు.' అంతే కోపంగా అంది శైలు .

'అయినా ఆ అబ్బి ఎక్కచ్చని చెప్పేడు . నువ్వే 'నో' చెప్పేవ్ .'

ఆ రోజు దీపు ఎవరి మాటా వినకుండా విసిగిస్తోంటే శైలు అంది, 'అక్కా, చూసేవా దీనికి ఎంత ఆశో ,ఎంత చేసినా తృప్తి లేదు .ఈ పిల్లని పెంచటం నాకు చేత కావట్లేదు ' అంది నిరాశగా .

అలాటి పెంకి పిల్ల అని ముద్ర వేయించుకున్న దీపూ తను చేసే చిన్న పనిని ఇంత సీరియస్ గా గమనిస్తోందని తెలియనే తెలియదు ఇన్నాళ్లూ . పైగా అది ఒక ఆదర్శం చేసేసింది తన ఆలోచనల్లో . పిల్లల మనసుల మీద ఎప్పుడు , ఏవేవి ముద్ర పడతాయో ,వారిని ఎలా ప్రభావితం చేస్తాయోకదా !

రజని, వనజ ఏళ్లతరబడి కలిసి పనిచేస్తూ స్కూల్ లోనే కాకుండా ,స్కూల్ బయట కూడా తమకంటూ ఒక ఆత్మీయ స్నేహాన్ని పెంచుకున్నారు. కుటుంబాలూ దగ్గరయ్యాయి. వనజ భర్త సుబ్రహ్మణ్యం గారు అవసరమైన వారికి సరి అయిన మార్గనిర్దేశం చెయ్యగలరన్న నమ్మకం వారి మిత్రులందరికీ వుంది. రజనికైతే ఆయన మాటల మీద ఎనలేని గురి. రజని ఆయనని కలవాలని ఆలోచిస్తోంది గత వారంగా. ఆరోజు మధు ఆఫీస్ నుండి రాంగానే సుబ్రహ్మణ్యం గారి దగ్గరకి బయలు దేరేరిద్దరూ.

తలుపు తీస్తూనే వీళ్లని చూసి సంబరపడిపోయారాయన. రజని తనకు ఆత్మీయులు అనుకున్న వాళ్ళ దగ్గర ఎలాటి మర్యాదలు పాటించదు. ఫోన్ చేసి, ముందుగా చెప్పి వెళ్ళాలన్న నిబంధన అస్సలు పట్టించుకోదు. అప్పుడే కదా అతిథులు వచ్చిన థ్రిల్ దొరికేది. సుబ్రహ్మణ్యం గారికి తెలుసు ఆమె అలవాటు.

'మీకు తెలుసా, వనజ ఎల్లుండి వచ్చేస్తోంది.' ఆనందంగా చెప్పేడాయన. వనజ తన కూతురి డెలివరీ కి దాదాపు మూడు నెలల క్రితం అమెరికా ప్రయాణమైంది. సుబ్రహ్మణ్యంగారు అక్కడ తనకి కాలక్షేపం అవదంటూ భార్యని వెళ్లి వచ్చేయమన్నారు . ఉద్యోగ రీత్యా అలవాటు పడిన ముంబై వదిలి ఎక్కడికి వెళ్ళాలని అనుకోరు ఆయన.

'అదేమిటి, ఇంకా వారం రోజుల తర్వాత కదా రావలసింది? ', వనజ ప్రయాణ వివరాలు తెల్సున్న రజని ఆశ్చర్యంగా అడిగింది .

' లేదు, మా అమ్మాయి అత్తగారు వాళ్ళు అనుకున్నదానికంటే ముందుగా వచ్చేసేరు. ఇంక తను చేసే పని ఏమీ లేదని వనజ ప్రయాణం ముందుకు జరుపుకుంది. '

' మంచి రిలీఫ్ మీకు' అన్నాడు మధు.

'రజనీ, మీ స్కూల్ ఎలా ఉంది ? ఈ మధ్య మీ స్కూల్ గురించి కొంత వింటున్నాను'

' ఏమి వింటున్నారు సర్ ?'

'స్కూల్ మూత పడుతుందని, అక్కడేదో కమ్మర్షియల్ కాంప్లెక్స్ వస్తుందని అంటున్నారు. ఇంత సడన్ గా ఈ మార్పులేమిటి ? పిల్లల మాటేమిటి ?'

'సరిగ్గా ఇది మాట్లాడాలనే మిమ్మల్ని కలవాలనుకున్నాను సర్ ...............' ఉపోద్ఘాతం గా అంది

'సర్, ప్రైవేటు వ్యక్తులకి ఒక స్కూల్ ప్రారంభించేందుకు హక్కు ఉన్నట్లే మూసేసే హక్కు కూడా ఉంటుందా ?'

' ప్రైవేట్ వ్యక్తులని మీరే అంటున్నారు కదా, ఆ హక్కు వాళ్ళకి ఎప్పుడూ ఉంటుంది . '

' ఎలా సర్? స్కూల్ సమాజం కోసం పని చేసే సంస్థ. దాని మీద సమాజానికి హక్కు లేదా ?'

'హక్కు కాదు, స్కూలు సేవలు సమాజం కోసం. కాని అది నిర్వహించే బాధ్యత పూర్తిగా ఒకవ్యక్తి లేదా వ్యక్తులు చేపట్టినప్పుడు, నడపటం , మానేసి మూసివెయ్యటం లాటి విషయాల్లో వాళ్ళకి పూర్తి అధికారం ఉంది. '

'అలా అంటే నేను ఒప్పుకోలేకపోతున్నాను. పిల్లలు ఏమైపోతారు? మీరూ విన్నారు కదా ఇది దశాబ్దాల తరబడి సమాజంతో మమేకమైపోయినది అని. స్కూళ్ళు తెరిచేక అకస్మాత్తుగా ఫీజులు పెంచి, అదీ రెట్టింపు చేసేస్తే వాళ్ళు ఎలా ఎక్కణ్ణుంచి తెచ్చి కట్టగలరు?ఈ విషయం గురించి వాళ్ళని ప్రశ్నించేందుకు, స్కూలు మూత పడకుండా నిరోధించే టందుకు మాకు, అంటే పిల్లల వైపు నుండి ఎలాటి హక్కు లేదా ?'

'లేదు రజనీ'

'ఎందుకు ఉండదు? బాధ్యత లేనట్లు వాళ్ళు అలా తెంపుకు పోగలరా? గవర్నమెంట్ కూడా ఏమీ చెయ్యలేదా ?'

సుబ్రహ్మణ్యం గారు నవ్వేరు ' రజనీ, మీరు చదువుకున్న వాళ్ళు. ఆలోచించండి. ఒక వ్యక్తీ ఒక వృత్తి లేదా ఒక వ్యాపారం మొదలు పెట్టేడు. అది కొనసాగించ దలచనప్పుడు మానివేసే నిర్ణయం అతను తీసుకుంటాడు. '

'కానీ, ఇది మామూలుగా వ్యాపార ఉద్దేశ్యంతో మొదలు పెట్టినది కాదు. ఒక ఆశయం తో మొదలు అయింది. వ్యక్తిగత ఆస్తిగా కాక సమాజానికి చెందిన ఆస్తి గా మాత్రమే నేను చూస్తున్నాను .'

'అయితే ముందు నాకు కొన్ని వివరాలు చెప్పండి. స్కూలుకి గవర్నమెంట్ ఎయిడ్ ఉందా ? ఉంటే ఎంతవరకు ఉంది ? పాక్షికంగానా లేక పూర్తిగానా ?'

'మరాఠి మీడియమ్ తో పాటు ఇంగ్లిష్ మీడియమ్ కూడా ఉంది. మరాఠి మీడియమ్ టీచర్ల శాలరీలవరకు గవర్నమెంట్ ఎయిడ్ ఉంది. మిగిలిన ఖర్చులన్నీ మ్యానేజ్ మెంట్ వే . అల్లాగే ఇంగ్లీష్ మీడియమ్ స్కూల్ కు ఎలాటి ఎయిడ్ లేదు. మేము చాలా వరకు వాలంటరీగా చేరినవాళ్ళమే. కానీ మాకూ మంచి జీతాలు ఇస్తున్నారు. అవి పూర్తిగా మ్యానేజ్ మెంట్ కు తోచినదే కాని ఇప్పటి మార్కెట్ ని బట్టి కాదు.

పాతిక సంవత్సరాల క్రితం మూడు, నాలుగు వందలకు జాయిన్ అయినవాళ్లం ఇపుడు దాదాపు పాతిక వేలు వరకు తీసుకుంటున్నాము. అయినా ఈ జీతాలు మేము ఎప్పుడూ ఊహించలేదు, ఆశించలేదు. సీనియర్ గయక్వాడ్ కొడుకులు ముగ్గురూ లాభసాటి ఉద్యోగాలలో ఉన్నారు. ఆ ముగ్గురిలో ఒకరు ఈ మధ్య కాలంలో కొన్ని సమస్యల్లో ఇరుక్కున్నారని తెలిసింది. అయినా వాళ్ళు స్కూలు నడపలేకపోవటం అంటే నమ్మలేం. ఇన్నేళ్ళుగా ఆశించని లాభాలు వాళ్ళు ఇప్పుడు ఆశిస్తున్నారు అనిపిస్తోంది .

మా స్కూల్లో కొందరి పేరెంట్స్ వాళ్ళ ఆదాయాల్లో సగం పైగా పిల్లల చదువులకి ఖర్చు పెడుతున్నారు. అయితే ఇలాటి వాళ్ళు ఒక ముప్పై శాతం ఉండొచ్చు. కొందరు పిల్లలు మధ్యతరగతి కుటుంబాల నుండి వచ్చేరు. వాళ్ళ తల్లిదండ్రులకి నెలకి ఖచ్చితమైన రాబడి వచ్చే ఉద్యోగాలున్నాయి. అయినా తక్కువ ఖర్చుతో మంచి చదువు దొరుకుతోంది కనుక వాళ్ళు ఇక్కడే చదివిస్తారు. వాళ్ళు కూడా అకస్మాత్తుగా జీతాలు పెంచమంటే పెంచరు'

'అయితే ఇంగ్లిష్ మీడియమ్ స్కూలు ఎప్పుడైనా మూసివేసే అధికారం స్కూలు స్థాపకులకి ఉంది. మీరు చెప్పినట్లు నైతిక దృష్టితో చూస్తే ఇన్నేళ్ళ చరిత్ర ఉన్న స్కూలు నడప లేము అనుకున్నప్పుడు వాళ్ళు గవర్నమెంట్ నుండి ఎయిడ్ తెచ్చుకునే ప్రయత్నం చెయ్యొచ్చు . లేదా స్వచ్ఛంద సంస్థలు ఏవైనా దీని బాధ్యతలు తీసుకునేటట్లైతే వాళ్ళకి అప్పగించవచ్చు.

లేదా పిల్లలకి ముందుగా వేరే స్కూళ్ళలో ప్రవేశాన్ని కల్పించి, వాళ్ళకి ఎలాటి నష్టం కలగకుండా చూడవచ్చు. లేదా మీరు అంతా కలిసి ఒక ఫండ్ కూడ గట్టి స్కూలు నిర్వహణకి సహాయ పడవచ్చు. '

ఆయన మాటలు పూర్తిగా వింది రజని.

' అలాటి ప్రయత్నం మొదలు పెట్టేం సుబ్రహ్మణ్యం గారు. మేము వ్యక్తిగతంగా మా శాలరీలు తీసుకోదలచు కోవటం లేదు. అయితే ఇలాటి సదుపాయం టీచర్లు అందరినుండి ఉండక పోవచ్చు. మేము కొంత వ్యక్తిగతంగా కూడా ఫండ్ ఇవ్వగలము. అంతే కాక ఇక్కడ చదువుకుని వెళ్లి మంచి ఉద్యోగాలలో స్థిరపడిన విద్యార్థుల్ని కూడా మొబిలైజ్ చేస్తున్నాము. వాళ్ల అందరి నుండి కూడా సానుకూల స్పందన వచ్చింది.

చదువుకునే అవకాశం ఉండదేమో అనుకున్న ఆ పిల్లలు కేవలం ఈ సంస్థ ఇచ్చిన చేయూతతో పైకి ఎదిగేరన్న విషయం వాళ్ళు మరిచి పోలేదు. ఈ స్కూలు నుండి ఇంకా ముందు ముందు మరెన్నో తరాలకి ఇలాటి సేవ అందుతూనే ఉండాలని వాళ్ళ ఆశ. కానీ స్కూలు నిర్వాహకులు ఇన్నేళ్ళు తాము స్వయంగా నడిపేరు కనుక ఇప్పుడు నడపలేమని అనుకున్నప్పుడు మూసివెయ్యాలని అనుకుంటున్నారు.

ప్రస్తుతానికి వేసవి సెలవుల తర్వాత ఇంకా క్లాసులు మొదలు కాలేదు. పదో క్లాసు పిల్లలకి సీనియర్ టీచర్లమ్ కొందరం ఇళ్ళ దగ్గర పాఠాలు చెబుతున్నాం. ఇలా కూడాఎంతో కాలం నడవదు. మీకు తెలియంది ఏముంది, సొసైటీ రూల్స్ ఒప్పవు. '

'మరి ఈ పరిస్థితి ఎప్పటివరకు? నిర్ణయం ఎప్పుడు తీసుకుంటారు ?'

' నిర్ణయం అయిపోయిందని వాళ్ళు అంటున్నారు. కాని పనులకు కూడా వెళ్ళకుండా స్కూలు ముందు బైఠాయించి పిల్లల తల్లిదండ్రులు గొడవకి దిగుతున్నారు. మీరేమో స్కూలు నడిపి తీరవల సిందే అని మ్యానేజ్ మెంట్ ని శాసించే అధికారం ఎవరికీ లేదని అంటున్నారు .' రజని ఆవేశం అర్థమైంది శ్రోతలిద్దరికీ.

' రజనీ, నేను ఒక ప్రశ్న అడుగుతాను,చెప్పండి, ఒక భక్తుడు నిత్యం గుడికి వెళ్లి దేవుణ్ణి దర్శించుకుని, హుండీలో ఒక రూపాయో, అర్ధో వేసేవాడు. ఒక రోజు హుండిలో ఏమీ వెయ్యకుండానే వెళ్లిపోయేడు. అతన్ని హుండీలో దక్షిణ ఎందుకు వెయ్యలేదని నిలదీసే హక్కు మీకు లేదు. చారిటీని డిమాండ్ చెయ్యలేరు కదా '

' నిజమే సుబ్రహ్మణ్యంగారు, ఛారిటీని డిమాండ్ చెయ్యలేము. అందుకే నాతో పాటు పనిచేసే వసుధ కూతురు పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ ఫైల్ చేసే ప్రయత్నం లో ఉంది.ఇది కాదని చెప్పేందుకు ఎవరికీ హక్కు లేదు కదా. మేము అంటే నేను, నా కలీగ్స్ ఈ విషయాన్ని పబ్లిక్ లోకి తీసుకెళ్లకుండా సాధ్యమైనంతగా స్కూలు నిర్వాహకులకి మాకూ మధ్య పరిష్కరించుకోవాలని అనుకుంటున్నాము.

ఇన్నేళ్లు ఒక కుటుంబంలా కలిసి ఉన్నవాళ్ళం ఈ సమస్యని అందరి ముందుకు తీసుకు వస్తే నిర్వాహకులకి కష్టంగా ఉంటుంది అని నా ఆలోచన. మరొక సారి, మరొక సారి మ్యానేజ్ మెంట్ తో మాట్లాడాలని అనుకుంటున్నాము '.

'గుడ్ ఐడియా, మీరు చేసే ప్రయత్నం సఫలం అవ్వాలని కోరుకుంటున్నాను. అలా కాని పక్షంలో ఆ అమ్మాయి చెబుతున్నట్లు మీరు 'పిల్' ఫైల్ చెయ్యచ్చు. ఇందులో నిర్వాహకులని కించపరిచే అంశం ఏమీ లేదు . వాళ్లు ఒక వేళ అనాలోచితంగా ఇలాటి నిర్ణయానికి వచ్చివుంటే ఒకసారి తాము చేస్తున్న పని వలన సమాజానికి ఎంత నష్టం కలుగుతుందో అవగాహన కి వస్తారు '.

సుబ్రహ్మణ్యం గారికి కృతజ్ఞతలు చెప్పి లేచింది మధుతో పాటుగా .

★★★★★★★★★★★★★★★★★★★★★★★★

గీతని, మిసెస్ శర్మని కలుసుకుని స్కూల్ గురించి, తాము తీసుకుంటున్న క్లాసులు గురించి, స్కూలు మ్యానేజ్ మెంట్ ను కలుసుకుని మాట్లాడవలసిన విషయాలని చర్చించి, రజని మెట్లు ఎక్కుతోంది .

ఈసారి వేసవి సెలవులకి వూరు వెళ్లి వచ్చేక తీరిగ్గా ఆ సంగతులు తలుచుకునే వ్యవధే దొరకలేదు అనుకుంది రజని. తిరిగి ముంబై చేరుతూనే స్కూలు గురించిన విషయాలు కాస్త అలజడిని కలిగించటంతో స్వంత విషయాలు అన్నీ మరుగున పడి ఉన్నాయి. అందుకే ప్రతిసారిలాగా మధు ని కూర్చోబెట్టి అవన్నీ ఏకధాటిగా చెప్పటము కుదరలేదు.

చటుక్కున ఆ ఆలోచనలు వచ్చినా చిన్న అమ్మమ్మ గురించిన విషయం ఆమెను కొంచెం కలవర పెడుతోంది. ఆవిడ ఎంతో ఆశతో, నమ్మకంతో తనకు అప్పగించిన బాధ్యత చిటికలో నెరవేర్చగలను అనుకుంది .'నెరవేర్చేను ', అని గర్వంగా చెప్పాలని తొందర పడుతుంటే అనుకోని అవాంతరం ఎదురైంది. స్కూలే ఇంకా తెరవలేదు.

ఆ రోజు అమ్మమ్మతో జరిగిన సంభాషణ పదే పదే ఆమె మనసులో కదులుతూనే ఉంది. ఆవిడని చూసేందుకు వెళ్లినప్పుడు కబుర్ల మధ్య పిలిచి, దగ్గర కూర్చోబెట్టుకుంది.

' రాజీ ఇలా వచ్చి కూర్చోవే , నువ్వు వస్తే నీకొక పని అప్పగించాలని చాలా రోజులుగా ఎదురుచూస్తున్నాను '

'చెప్పు అమ్మమ్మా . నాకోసం ఎదురుచూస్తున్నావన్నమాట. చెప్పెయ్యి ఆ పని ఏమిటో . '

'సుజాతా, ఆ పొట్లం ఇలా పట్రామ్మా'

విషయం తెలిసున్నదల్లే సుజాత ఆవిడ అడిగిన పొట్లం పట్టుకొచ్చి ఇచ్చింది. ఆ పొట్లం జాగ్రత్తగా విప్పుతూ ,

'రాజీ , నువ్వు స్కూల్లో కాదూ పనిచేస్తున్నది ?'

'అవును అమ్మమ్మా . .....' ఆవిడ ఏం చెప్పబోతోందో అర్థం కాక నిశ్శబ్దంగా చూస్తూ కూర్చుంది .

'రాజీ, నీకు తెలుసా, నేను బడికి వెళ్లి చదువుకోవాలని చిన్నప్పుడు తెగ ఆశ పడ్డానే. అక్షరాలైతే మా అమ్మ దగ్గర ఇంట్లోనే నేర్చుకున్నాను. కానీ బడికి వెళ్లే ఆశ తీరనేలేదే . ..'అంటూ ఆ విప్పిన పొట్లంలో ఉన్ననాలుగు బంగారు మురుగులు, రెండు చిన్న చిన్న గొలుసులు తీసి రాజి చేతిలో పెట్టింది.

'చదువుకుంటాను అని అమ్మకి చెబితే, ' చక్కగా పెళ్లి చేస్తాం. పెళ్లి అయ్యాక మీ ఆయనతో కలిసి చదువుకున్దువుగాని, సరేనా' అని చెప్పి పెళ్లి చేసేసేరు. తాతయ్య దగ్గరకు వెళ్లేక చదువుకుంటానని తాతయ్యని అడిగేను. 'ఇంట్లో పనులు చూసుకోవద్దూ, చదువుకుంటూ కూర్చుంటే ఎలా కుదురుతుంది ' అన్నారు .

అయినా చదువు మీద మమకారం చావలేదు. పిల్లలు చదువుకుంటుంటే వాళ్ళప్రక్కన కూర్చుని, వాళ్ల పుస్తకాలు చదివేదాన్ని. మా అత్తగారు చూస్తే పోట్లాడేది. బడికి వెళ్ళటం అనేది తీరక పోయినా ఇంట్లో చదువుకుందుకు వీలే కుదిరేదికాదు. ఎప్పుడూ పనే. ఇంటి నిండా వచ్చేపోయే జనం. ఇప్పుడు బోలెడు తీరిక ఉంది, మునిమనవలతో కూర్చుని చదువుకుందామని ఉన్నా కళ్లు కనిపించవు సరిగా. వచ్చే జన్మ అంటూ ఉంటే నేనే ఒక బడి పెట్టేస్తానే రాజీ '

ఆశ్చర్యంగా చూస్తున్న రాజిని మరింత దగ్గరగా పొదువుకుని ' రాజీ, ఈ బంగారం నా ఒంటిమీదదే. దీని అవసరం నాకు లేదు . నా మునిమనవడి కోసం ఉపయోగించ మని సుజాత ని అడిగేను. ఆ అమ్మాయి ఏం చెప్పిందో తెలుసా?

' అమ్మమ్మా ,ఇది నాకొడుకు కోసం ఉపయోగించవలసిన అవసరం లేదు. నీకు ఇంకా ఏదైనా ఇష్ట మైన పనికోసం ఉపయోగించు ' అంది .

దాని మనసు సముద్రమంత విశాలమే. ఆలోచించేను. .......... నువ్వు చెప్పిన నీ బడి గురించిన కబుర్లు నా గుండెలో భద్రంగా ఉన్నాయి. ఆ పిల్లలు అందరూ డబ్బుకి ఇబ్బందులు పడే కుటుంబాల నుండి వచ్చినవాళ్లు అని చెప్పేవు. వాళ్లకి అవసరమైనది ఏమిటో ఆలోచించి, ఆ పిల్లల కోసం ఉపయోగించు. ఈ బంగారానికి ఇంత కంటే ప్రయోజనం ఏమీ లేదు. ఏమంటావు? నా కోరిక తీరుస్తావా? ఇది ఎంతో పెద్ద మొత్తం కాక పోవచ్చు ,కానీ ,

చదువు కోవటం అంటే ఎంత బావుంటుందో నాకు తెలుసే రాజీ .................'

ఆ మాటలు అంటూనే ఆవిడ పరధ్యానంగా ఏదో ఆలోచనలో పడిపోయింది. రజనీ మనసు ఆర్ద్రమైంది .

ఆ వృధ్ధురాలి మనసు కళ్లకి తోచింది . ....

ఈ సాయం సంధ్య మనసు నెందుకో తడువుతోంది ,

శూన్యంలోకి సారించిన చూపులు అప్రయత్నంగా చిక్కుపడ్డాయి ,

అభావంగా ఉన్న మనసులో చలనం !............. సంచలనం !

దూరంగా, కనుచూపు మేరలో పెంకుల కప్పు కూలుతూ ఓ 'బడి ',

లేతవెన్నెల కాంతిలో ఆ శిధిలాల మధ్య పరుచుకున్న మిలమిలలు !

ఒకర్నొకరు తోసుకుంటూ,బడిగంటకు తూనీగల్లా పరుగులు తీసిన చిన్నారి పాదాల జాడలు !

ఎప్పటిదో పాత ఫోటో ఫ్రేమ్ లో స్పష్టంగా ................!

ఎందుకో చిత్రం ఇంత సజీవంగా ఉంది !?

ఆరారు ఋతువుల్నీ ఆవాహన చేసుకుని ,

పరిపూర్ణత్వంతో వెలుగుతున్న ఈ జీవితమ్

బ్రతుకు పుస్తకాన్ని ఆఖరిపుట వరకూ చదువుకుంటూ వస్తూ

నిశ్శబ్దం ఘనీభవించిన ఆ గతపు వాకిళ్ళను తట్టి చూస్తూ ఈ మైమరపు ఎందుకో !

బహుశా ఆ మనసునంటిన బాల్యపు మరకలు పోలేదు !

అవి చిరంజీవులు !

రజని అమ్మమ్మ పాదాల్ని తాకి ఆవిడని గుండెకు హత్తుకుంది. లేచి వెళ్లి సుజాతను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంది. ఆ అమ్మమ్మ కు దీటైన మనవరాలు! మనసారా దీవించింది. నిన్న మొన్న ఆవిడ దగ్గర కూర్చుని విన్న మాటలు, ఆ వెచ్చని స్పర్శ ఇంకా తాజాగా ఉన్నాయి.

తాళం తీసి చూస్తే ల్యాండ్ లైన్ లో మిస్డ్ కాల్. అమ్మ!.......... వెంటనే చెయ్యబోయి ఆగిపోయింది. సాయంకాలం ఆ సమయం లో అమ్మ సాంధ్య దీపం పెట్టుకుంటుంది. ఆమెని డిస్టర్బ్ చెయ్యదలచుకోలేదు .

కామేష్ మామయ్య 'ప్రదోష వేళ' గురించి చెబుతుండేవాడు ......... అది ఎంత పవిత్రమైన సమయమో! 'ఆ సమయంలో పెరటి తలుపులు మూసి, వాకిలి తలుపులు తెరిచి మరీ అప్పుడు ఇంట్లో దీపం వెలిగించాలి, అప్పుడు వాకిలి గుమ్మంలోంచి లక్ష్మీదేవి

ఆనందంగా ఇంట్లోకి నడిచి వస్తుందని'. రజని నవ్వేది ఆయన మాటలకి , 'నేను నమ్మను ' అన్నట్లుగా. మామయ్యకి కోపం తెప్పించడం ఆమెకి సరదా. సూర్యాస్తమయానికి ముందు, సూర్యాస్తమయం తరువాత 30–45 నిముషాలు వరకు ఉండే ఈ సమయం ప్రదోష వేళట.

వంట ముగించి తల్లికి ఫోన్ చేసింది. ఆవిడ గొంతులోనే దుఃఖం తాలూకు తడి అర్థమైంది. 'రాజీ , చిన్న అమ్మమ్మ ఇంక లేదు '. అమ్మకి ఎంతో ఆత్మీయురాలైన వ్యక్తి, అమ్మకే కాదు ,తామందరికి కూడా. అమ్మమ్మ తర్వాత అంత ప్రేమని, ఆప్యాయతని పంచింది. ఆవిడది హద్దులు లేని ప్రేమ. అందరూ సమానమే ఆమెకి.

క్రితం సారి కలిసినప్పుడు అమ్మమ్మ తాను ఎవరికీ బరువు కాకుండా బ్రతకాలని ఉందని అంటే ,' అమ్మమ్మా ! ఎవరినీ కష్ట పెట్టకుండా ఉంటానంటున్నావ్. అందరినీ శ్రమ పెడుతున్నావని నువ్వు అనుకుంటున్నావ్. శ్రమ కాదు, మాకు ఆనందమే అని సుజాత చెబుతోంది కదా.

ఐనా, నీ వయసు వాళ్ళందరూ ఉండే ఒక ఆశ్రమంలో చేరుస్తాను. నీకు బోలెడు మంది స్నేహితులు ఉంటారక్కడ. కొన్నాళ్ళు నువ్వు స్వతంత్రంగా ఉండొచ్చు. కానీ అక్కడే వుంటానంటే మాత్రం మేము ఎవ్వరం ఊర్కోము. కొన్ని రోజులు ఒక క్రొత్త ప్రపంచం చూసినట్లు ఉంటుంది, తీసుకెళ్తాను, వస్తావా?' అంటే నవ్వింది.

'నిజంగా చేరుస్తావుటే. సరే కాని, చిన్నతాతతో కలిసి బ్రతికిన ఈ ఇల్లు , ఈ మట్టి వాసన వదిలి కొన్ని రోజుల కోసమైనా నేను బయటకు రాగాలనంటావా ? ఏమో! వస్తే బానే ఉంటుంది. వదిలి రాలేక పోవటం ఏమిటిలే!? అన్నీ వదిలి బయలు దేరాల్సిన సమయం ఎప్పుడో వచ్చేసింది. ' అంటూ దీర్ఘాలోచనలో పడింది.

ఇదేనా ఆవిడ కోరుకున్న విముక్తి! ఆవిణ్ణి చూసి వచ్చి నెల రోజులైంది. అంతలోనే ...! పాత తరం ఒక్కక్కరూ వెళ్లి పోతున్నారు. అనివార్యమైన ఘట్టమే.

వెనుక పెద్ద వాళ్ళు ఉన్నారన్న ఆలోచన ఎంత బలాన్నిస్తుంది. ఇప్పటి తరానికి ఇలాటి సెంటిమెంట్లు లేనట్లే ఉంది. అనుబంధాలు ఏవీ అక్కరలేదు, వాటికి విలువ ఏమీ లేనే లేదు ఇప్పటి వాళ్లకి.

కొన్నాళ్ల క్రితం ఒకసారి తన కలీగ్ గీత ఆనందంగా చెప్పింది. తన ఆడపడుచు, భర్త ఏదో ఫంక్షన్ ఉందని ముంబై వస్తున్నారని, పిల్లలకి , తమకి రొటీన్ లోంచి కొంత ఆట విడుపు అని. ఆ సమయంలో క్రిస్మస్ సెలవుల్లో ఉన్న పిల్లలు స్నేహితులతో కలిసి మహాబలేశ్వర్ ట్రిప్ పెట్టుకుంటున్నారని గమనించిన గీత వాళ్లని ట్రిప్ కాస్త ముందుకో వెనక్కో మార్చుకొమ్మని, అతిథులు వచ్చి ఉన్న నాలుగు రోజులు సరదాగా గడపవచ్చని చెప్పింది .

' లేదమ్మా, అక్కడ గెస్ట్ హౌస్ బుక్ చెయ్యటం, టికెట్స్ బుక్ చెయ్యటం అయిపోయింది. ఇప్పుడు మేము వెళ్ళాల్సిందే. చాలా రోజులకి అందరం కలిసి వెళ్ళే అవకాశం కుదిరింది. అత్త మన అత్తే కదా. ఆంధ్రా వెళ్ళినప్పుడు ఈసారి ఎక్స్ క్లూజివ్ గా రెండు రోజులు అత్తతో గడిపేస్తాం ' అంటూ ప్రయాణమై వెళ్ళిపోయేరు.

దైనందిన జీవితాల్లో జరిగే ప్రతి సంఘటన, అనుభవం వెనక్కి తిరిగి పాత రోజులతో పోల్చుకు చూసుకోవాల్సివస్తోంది. తమ చిన్నప్పటి రోజులు, మేనత్తల రాకపోకలు, వాళ్ళతో తమకున్న అనుబంధం తలుచుకోకుండా ఉండలేక పోయింది రజని.

ప్రతి సంవత్సరం వేసవి సెలవులిచ్చేక పిల్లలతో వచ్చి,అత్తయ్యలు కనీసం రెండు వారాలు గడిపి వెళ్ళే వారు. పల్లెలో ఉన్న నానమ్మ, తాతయ్యలు తమ దగ్గరకి వచ్చేసేక అయితే ఆ పల్లెలో గడిపే రోజులు కూడా తమ ఇంట్లోనే గడిపేవారు .

జడకుప్పెలతో జడలల్లి , ఆ పొదవునా మల్లె పూలు కుట్టడం ,... ఎంత పెద్ద ప్రాజెక్ట్ అది ! నాకు ముందు అంటే నాకు ముందు అని అత్త దగ్గర జడలు వేయించుకునే వరకూ పేచీలు. తీరా కుట్టేక ఆ జడలు మొయ్యలేక బిక్కముఖాలేసుకుని ఆ బరువుని మొయ్యటం . ఒక విడత చుట్టుప్రక్కల అందరికి చూబించి వచ్చి 'ఇంక పూల జడ విప్పెయ్యమ్మా' అని అప్పుడు ఇంకొక పేచీ.

అదయ్యాక గోరింటాకు. అది మరొక ప్రాజెక్ట్ !

రాత్రుళ్ళు డాబా మీద పక్కలు పరుచుకుని అత్త పాడే పాటలు వింటూ, నేర్చుకుంటూ ఎంత సమయమూ సరిపోయేదే కాదు. ఎన్ని లలిత గీతాలు నేర్పేది అత్త, ముఖ్యంగా రామం అత్త. ఎన్నెన్ని కొత్త విషయాలు నేర్పేది. అసలు రేడియో వినటం కూడా రామం అత్తయ్య దగ్గరే అలవాటు అయ్యింది తనకి.

రేడియోలో నేర్పే ' ఈ మాసపు పాట ' శ్రద్ధగా రాసుకుని నేర్చుకోవటం అత్తే నేర్పింది. అత్తయ్య పాటలు నేర్పేటప్పుడు తను కూడా స్వంతంగా ఏవేవో మాటలు కూర్చి తన దైన రీతిలో పాడటం అత్తయ్య గమనించి ప్రోత్సహిస్తూ ఉండేది. ఒకటి రెండు లైన్లు రాసి అత్తయ్య మెప్పుదలకోసం చూసేది తను.

ఒక రోజు రాత్రి భోజనాలయ్యాక అందరూ డాబా మీద చేరి నప్పుడు కురుస్తున్న వెన్నెల్ని చూసి ,' అత్తా , వెన్నెల ఒలికి పోతోంది చూడు ' అన్న మేనకోడలి మాటలకి ఆనందంతో తబ్బిబ్బు అయింది రామం అత్తయ్య.

ఏ చిన్న సందర్భం వచ్చినా ఒక నాలుగు లైన్లు రాసి 'కవిత' రాసేనంటూ అత్తయ్యకి పోస్ట్ కార్డ్ పంపేది తను . అందుకే తన పట్ల అత్తయ్యకి ప్రత్యేకమైన ప్రేమ.

తమకోసం పూల జడలు కుట్టినా , గోరింటాకు పెట్టినా , కథలు, కబుర్లు చెప్పినా అప్పటిదాకా మీద వేసుకున్న పెద్దరికం అంతా వదిలి , పనులు సవరించుకుని వచ్చేఅమ్మని చూడంగానే మాత్రం రామం అత్తా చిన్న పిల్ల అయిపోయేది . 'వదినా,నాకూ గోరింటాకు పెట్టవూ? ' అంటూ.

ఇద్దరు సమవయస్కులే అయినా వదిన పాత్రలో తన తల్లి ఒక ఆరిందా తనాన్ని ఆపాదించుకుని ఆడపడుచు పట్ల చూబించే ఆత్మీయత తను ఎప్పుడూ మర్చిపోలేదు. వదినా మరదళ్ళు అక్క చెల్లెళ్ళను మించిన అభిమానాన్ని పంచుకునే వారు. తన తల్లి ఇంటికి వచ్చిన ఆడపడుచు కోసం క్రొత్త చీర కొనితెస్తే, అత్తయ్య ఆమె వదినగారి కోసం స్వయంగా ఎంబ్రాయిడరీ వర్క్ చేసిన చీర తెచ్చి ఇచ్చేది. ఈ ఇచ్చి పుచ్చు కోవటాలు ఒక బాధ్యతగా కాక ప్రేమను తెలియజేసుకునే ఒక అవకాశంగా భావించేవారు.

వేసవి వచ్చిందంటే మామిడి పళ్ళు, మల్లె పూలే కాదు, విజయవాడలో ప్రత్యేకం ఎగ్జిబిషన్ హడావుడి మొదలు అయ్యేది.

ఒకప్పటి బందరు రోడ్డు ఇప్పుడు ఎమ్. జి . రోడ్డుగా పిలవబడుతోంది. పైగా బట్టలు, నగలు , అన్ని రకాల ఎలక్ట్రానిక్ వస్తువులు, కార్లతోసహా షో రూముల నిండా అలంకరించి ఏ సిటీ కి తీసిపోని హంగులన్నీ అద్దుకుని జనాలని ఉక్కిరి బిక్కిరి చేస్తోంటే .......స్కూలు రోజుల్నించి అలవాటుగా దాటి వెళ్ళే ఆంధ్రజ్యోతి బిల్డింగ్ ఎక్కడ ఉండేదో ఆనవాలు పట్టలేని పరిస్థితి.

అప్పటి కుటుంబ వాతావరణం అందరికి ఒక భద్రతని , సమాజంలో భిన్న మనస్తత్వాల మధ్య హాయిగా బ్రతికేందుకు కావలసిన ఆరోగ్యకరమైన అవగాహనని అందించింది. తాము పెరిగిన కుటుంబ వాతావరణం ఇప్పటి పిల్లలకి అందించలేక పోతున్నమన్న దిగులు అందరిని ఇబ్బంది పెడుతూనే ఉంది.

జీవిత విధానాల్లోను ఎంత మార్పు! స్వంత వూళ్ళు వదిలి ఎంత దూరమైనా వెళ్ళ వలసిన పరిస్థితులు. పెద్దతరం వాళ్ల వ్యాపకాలు వాళ్ళు పెట్టుకుని ఉన్నవూళ్ళో కాలక్షేపం చేసుకున్దామన్నా కుదరటం లేదు.

పిల్లలకోసమో, పిల్లల పిల్లలకోసమో ఉన్న వూరు వదిలి వెళ్ళవలసి వస్తోంది. ఇంటికి ఒక్కరో ఇద్దరో పిల్లలు! అవసరాలు,చదువులు, ఉద్యోగాలు ఇంట్లో ఉన్న నలుగురిని నాలుగు ఊళ్ళల్లో ఉండేలా తరుముతున్నాయి. ఎప్పుడో వృద్ధాప్యంలో ఎదుర్కోవాల్సి వస్తుందేమో అనుకునే ఒంటరితనం అన్ని వయసుల వారినీ అల్లుకుంటోంది.

★★★★★★★★★★★★★★★★★★

ఆ రోజు మ్యానేజ్ మెంట్ ని కలిసి తమ అభిప్రాయలు చెప్పి, స్కూలు త్వరగా ప్రారంభించేలా చూడాలి అనుకుంటూ రజని బృందమంతా బయలుదేరేరు. కలిసి మాట్లాడాలని అనుకుంటున్నాం అని ముందుగా తెలియజేసి రావటం తో మ్యానేజ్ మెంట్ తరఫున అందరూ ఆ టైమ్ కి రెడీగా ఉన్నారు. ఎప్పటిలాగే రజని ముందుగా తాము అనుకున్నది చెప్పేందుకు సిద్ధపడింది.

'సర్, స్కూల్ ఆర్థిక వనరులు లేక మూత బడే స్థితి రాకుండా మా వైపు నుండి కొన్ని ఆలోచనలు ఉన్నాయి . ...............'

ఎవరూ మాట్లాడక పోవటంతో ఆమె కొనసాగించింది .............

'మేము మా శాలరీ లను తీసుకోదలచు కోవటం లేదు. మా వైపు నుండి కొంత డబ్బుని కూడా ఏర్పాటు చేద్దామని అనుకుంటున్నాము. అది కాకుండా మన దగ్గర చదువుకున్న పిల్లలని కూడా దీనికి ప్రోత్సహిస్తున్నాము. వాళ్ళూ ఇష్టపూర్వకంగా తమ వైపు నుండి కొంత ఏర్పాటు చేస్తామని అంటున్నారు. ఇది సరిపోదను కున్నపుడు ఏదైనా స్వచ్చంద సంస్థ సహాయం కూడా మనం తీసుకోవచ్చు ......... '

ఆమె మాటలు పూర్తి కాకుండానే గోవింద్ గైక్వాడ్ మొదలు పెట్టేరు .

'చూడండి రజని, మేము నడపలేక పోవటం నిజమే, కానీ ఇతరులు నుండి విరాళాలు తెచ్చుకుని కొనసాగించే ఉద్దేశ్యం కూడా లేదు. మా అంతట మేము మూసివెయ్యటం లేదు. అవసరమైనప్పుడు పిల్లలనుండి వాళ్ల భాగస్వామ్యం అడిగినా వాళ్ళు కుదరదని

చెబుతున్నారు. ఇప్పటివరకూ మీరెవ్వరూ వాళ్ళని మోటివేట్ చెయ్యలేక పోయేరు ......... మేము అడిగిన విషయం న్యాయంగానే ఉందని వాళ్ళ అభిప్రాయం మార్చుకుని వస్తారేమో మరి కొన్నాళ్ళు చూద్దామని అనుకుంటున్నాం.

అయినా మీరు మాత్రమే మాట్లాడుతున్నారు ,మిగిలిన వాళ్ళు ఒక్కరు కూడా ఏ అభిప్రాయం చెప్పలేదు. మిసెస్ శర్మా, మీరు ఎప్పుడూ అవసరమైన సలహాలు ఇస్తూ ఉండేవారు, ఈ సారి మీరు ఈ విషయం లో ఏమీ చెప్పనేలేదు.'

అందరూ ఆమె వైపు చూసేరు . ఆమె ఒక్కమాట చెప్పింది ....... 'రజని చెబుతున్న అభిప్రాయం మా అందరి ఉమ్మడి అభిప్రాయం' అని .

స్కూలు గురించిన ఎన్నో విషయాల్లో ఆవిడ ఎంతో ఉత్సాహంగా పనిచేసిన వ్యక్తిగా అందరూ చెబుతుంటారు. సీనియర్ గైక్వాడ్ తో ఉన్న అనుబంధం ఇప్పటి బోర్డ్ మెంబర్లు ఎవరితోటి కూడా సీనియర్ టీచర్లకి లేదు. ఆయన వున్నప్పుడు అందరూ ఒక కుటుంబం లాగే ఉండేవారు. వారి వారి కుటుంబ సమస్యలు కూడా గైక్వాడ్ తో పంచు కునేవారు.

మిసెస్ శర్మ ఉత్తరాది నుండి వచ్చి స్థిరపడిన వ్యాపార కుటుంబం నుండి వచ్చింది. స్కూలు వాతావరణానికి ఆవిడ పూర్తిగా అంకితమైపోయినట్లు ఉండేది. ఆర్థికంగా అవసరమున్న పిల్లలకి చదువుకునే ఏర్పాటు చేస్తూ ఉంటుంది.

భర్త అకస్మాత్తుగా పోవటంతో చాలా డిప్రెషన్ లో పడిపోయింది. అలాటి స్థితి లోంచి ఆమె మళ్లీ మామూలు అయేందుకు స్కూలు ,తోటి టీచర్లే ఆమెని ఆదుకున్నారు. అప్పటికి కాని తను ధైర్యంగా ఉండి అత్తమామల దుఃఖం దూరం చెయ్యాలన్న ఆలోచన రాలేదు. వాళ్ళను మరింత అక్కున చేర్చుకుంది. ఎప్పుడైనా ఒక నిరుత్సాహకరమైన సన్నివేశం, సంఘటన ఆమెని మళ్లీ మళ్లీ నిరాశలో మునిగేలా చేస్తుంటాయి. స్కూలు ఎదురుకుంటున్న సమస్య ఆవిడని స్తబ్ధ రాలిని చేసింది.

జతగా నడిచిన దారులన్నీ కనుమరుగైపోయిన వేళ !
గమ్యం తెలియని మలుపు దగ్గర నిలబడి పోయినప్పుడు ,

వెనుక చీకట్లో నిలబడిన నీ వాళ్ళకి

దారి చూపే వేగు చుక్కవు నువ్వే అయ్యావ్ !

రజని తో సహా అందరూ గోవింద్ బృందం మాటలకి విసిగిపోయారు. ఇంకా చెప్పేందుకు ఏముంది? అయినా ఎన్నాళ్ళు ఈ పరిస్థితి కొనసాగిస్తారు ?!

★★★★★★★★★★★★★★★★★

తెల్లవారి న్యూస్ పేపర్ చూస్తూనే ఉలిక్కిపడింది రజని . టైమ్స్ ఆఫ్ ఇండియా మూడో పేజీ లో ఒక చిన్న యాడ్ (అడ్వర్టైజ్మెంట్ ) వచ్చింది .

‘ ఒక స్కూల్ , వేల కొద్దీ చిన్నారులని వ్యక్తులుగా తీర్చిదిద్ది ,దశాబ్దాలుగా చరిత్ర సృష్టించింది.

ఒక స్కూల్ పిల్లలని విద్యావంతులని చెయ్యటం వింత కాదు, అసాధారణమూ కాదు.

కానీ అసాధారణమైన విషయం ఏమిటంటే , పిల్లలు కట్టే ఫీజులు కాకుండా కేవలం పిల్లల ఆసక్తిని, మేధ ని మాత్రమే పెట్టుబడిగా తీసుకున్న సంస్థ ఇది .

ఇది ఒక ప్రైవేట్ సంస్థ !. ఎలాటి ఆడంబరాలు లేని, ఉత్తమ ఆశయాలు ఉన్న సంస్థ !

ఇప్పుడు ఇదే స్కూలు 'నేను ఇక పైన పనిచెయ్యలేను ' అంటోంది .

అలా అనటం అన్యాయం అనిపించటం లేదూ ?

ఐతే ...........

దీనికోసం మనం అందరం ఏమీ చెయ్యలేమా?

ఈ స్కూల్ ని తిరిగి పని చేయించలేమా ?

చెయ్యగలిగితే ఏమిచెయ్యగలం?

మీ అభిప్రాయలు ఫలానా ఐడి కి మెయిల్ చెయ్యండి . మనం అందరం మన తమ్ముళ్లనీ చెల్లెళ్లనీ చదివిన్పుకుందుకు ఏదైనా చేద్దాం, రండి . మీరూ ఈ ప్రయత్నంలో భాగం కండి . '

యాడ్ చూస్తూనే రజని లాగే మిసెస్ శర్మ ఆలోచనలో పడింది. ఇది సమంజసం కాదు అనుకుంది . ఇప్పటికే నారాయణ్ గైక్వాడ్ ఆఫీస్ వ్యవహారం ,కోర్ట్, కేసు గురించి నిత్యం న్యూస్ పేపర్ లో వస్తున్న వార్తలు ఆ కుటుంబాన్నిమానసికంగా చాలా కృంగతీస్తూ ఉండి ఉంటాయి.

ఇంకా స్కూలు గురించి కూడా పబ్లిక్ లో అల్లరి అయిపోతే వాళ్లు తట్టుకోలేరు. శ్రీజ కి చెప్పాలి. ఇది సమస్య పరిష్కారం కోసం ఆమె చేస్తున్న ప్రయత్నమే కావచ్చు. మాట్లాడాలి .

మిసెస్ శర్మ రజని కి ఫోన్ చేసి 'తయారుగా ఉండు , వసుధ ఇంటికి వెళ్లొద్దాం ' అని చెప్పింది .

వసుధ ఇంటి దగ్గర ఒక చిన్న సభే జరుగుతోంది. శ్రీజ స్నేహితులు, ఆమె పనిచేస్తున్న ఎన్జివో ల సభ్యులు అన్ని రకాల వయసుల వాళ్లు కూడా అక్కడ ఉన్నారు. అందరు తమకు తోచిన ఆలోచనలు చెబుతున్నారు. వాళ్ల మధ్య మిసెస్ శర్మ, రజని వెళ్లి కూర్చున్నారు . పలకరింపులు, పరిచయాలు అయ్యాక శ్రీజ ముందుగా అడిగింది ,

'ఆంటీ , పేపర్ యాడ్ చూసేరా ?'

చూసేమన్నట్లు చెప్పటంతో , 'ఆంటీ, ఈ యాడ్స్ కి వాటికి కొంచెం ఖర్చు అవుతుంది. కానీ ఇది ప్రజల వరకూ వెళ్లాలి అంటే తప్పదు. ఎలాగూ ఫండ్స్ సమకూరుతాయి, కొంత వరకు మనం పెట్టుకుంటే సరిపోతుంది. ఇదిగో ఇతను నా క్లాస్ మేట్ రాజీవ్, ఇతనికి వాళ్ల ఏరియా మునిసిపల్ కౌన్సిలర్ తెలుసు. వాళ్ల ఇంటికి దగ్గరలోనే ఉంటారు. ఆయన ఈ విషయం అంతా శ్రద్ధగా విన్నారు. వాళ్ల కలీగ్స్ తో కలిసి దీని గురించి ఏమి చెయ్యాలన్నా సాయం చేస్తానని చెప్పేరు.

ముందు, ఈరోజు మన యాడ్ కి ఎలాటి రెస్పాన్స్ వస్తుందో చూద్దాం, చూడండి ఆంటీ, ఇప్పటికే ఎన్ని మెయిల్స్!, ఎంత మంది ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుంటున్నారో ! .............' ప్రక్కనే కుర్చీలో కూర్చుని ల్యాప్ టాప్ లో మెయిల్స్ చెక్ చేస్తున్నశ్రీజ స్నేహితురాలు ఉత్సాహంగా మెయిల్ బాక్స్ ని రజని ముందుకు తెచ్చింది.

రజని , మిసెస్ శర్మ ముఖాలు చూసుకున్నారు.

మరొకరు కుర్చీలోంచి లేచి, తను ఒక స్వచ్ఛంద సంస్థ తరఫున పని చేస్తున్నానని, తమ సంస్థ ఈ విషయంలో సాయం చెయ్యగలదనీ చెప్పేరు.

'మేడమ్ ,మేము ఇప్పటికి చాలా సమస్యలకోసం పోరాటం చేసేం. మాకు విదేశీ ఫండ్స్ కూడా ఉన్నాయి. పిల్ ఫైల్ చెయ్యటం మాకు పెద్ద కష్టం కాదు. మంచి అడ్వకేట్లు తెలిసున్న వాళ్లు ఉన్నారు. మా సంస్థ లో చాలా పెద్దపెద్ద వాళ్లు ఉన్నారు . ....'

శ్రీజ టీ పట్టుకురావటంతో ఆ వ్యక్తి ఒక్క క్షణం ఆగేడు.

టీ బ్రేక్ లో అందరూ ఎవరికీ వాళ్లు తమలో తాము మాట్లాడుకోవటం కనిపించింది.

రజని , వసుధ, మిసెస్ శర్మ వాళ్ల హడావుడి చూస్తూకూర్చున్నారు.

ఒక సమస్య ఎదురైనపుడు మనకి సంబంధం లేదు అని తప్పించుకు తిరగకుండా, దాని గురించి స్పందించటం నిజంగా ప్రశమ్సించదగ్గదే. ఇంత బిజీ జీవితాల్లో ఇలాటి ఒక అంశం గురించి విని, ఆలోచించి, తమ సమయం కొంత వెచ్చించేందుకు ముందుకు రావటం గొప్ప విషయం. కానీ దాన్ని సానుకూల ద్రక్పథం తో చూస్తున్నారా లేదా అన్నది కూడా అంతే ముఖ్యం.

రజని గమనిస్తోంది ఏమిటంటే ఇక్కడ సమావేశమైన వాళ్ళంతా కూడా వాళ్లు చేసే పనికి పబ్లిసిటీ కావాలనుకోవటం. నలుగురి దృష్టి లో పడితే త్వరగా, సులభంగా సమస్య పరిష్కారం చేసుకోవచ్చు అని ఆలోచిస్తున్నారు. ఏ విషయంలో అయినా వాళ్లకి కొంత ప్రచారం కావాలి. అది వాళ్లని మోటివేట్ చేసే అంశం. సమస్య పదుగురి ఎదుట పెట్టి చూసే ముందు అది మొదలైన చోటే చిక్కు ముడి విడేందుకు అవకాశం ఉందా అని చూడటం లేదు.

ఇంతలో ఒకతను లోపలికి వచ్చేడు ,'కౌన్సిలర్ సాబ్ ' అంటూ. ఎవరో అతనికి జవాబు చెబుతున్నారు ,'ఆయన ఇక్కడ లేరని'.

రజనికి అతన్ని ఎక్కడో చూసినట్లు అనిపించింది . ..............అవును ఇతన్ని ఒకసారి గణేష్ ఉత్సవాలు జరుగుతున్నప్పుడు చూసింది ! రెండు మూడేళ్ల క్రితం ,స్కూలు దగ్గర ఆ వీధి కార్నర్ లో గణేష్ పందాల్ దగ్గర ఎవరితోనో గొడవపడుతూండగా అటుగా వెళ్తున్న తానూ, మధు ఆగి వాళ్లని విడతీసి, సర్ది చెప్పటం జ్ఞాపకం వచ్చింది. అదే మొదటి సారి అతన్ని చూడటం. ఆ తర్వాత ఒకసారి అతను కొడుకుని స్కూల్ దగ్గర దింపేందుకు వచ్చి నప్పుడు చూసి గుర్తు పట్టింది.

మళ్లీ స్కూల్లో పేరెంట్స్ మీటింగ్ లో అతను తన కొడుకు ని తీసుకుని రావటం, 'మేడమ్, మా పిల్లవాడిని బాగా చదివించండి. నాలాగా చదువు లేకుండా రోడ్డుమీద అందరితో గొడవలు పెట్టుకుంటూ బ్రతికే బ్రతుకు వాడికి వద్దు ' అని దీనంగా చెప్పటం జ్ఞాపకం వచ్చింది.

ఎవరో చెప్పి వుంటారు ఇక్కడికి కౌన్సిలర్ వస్తున్నారని ......... అతను రజనిని చూసి గౌరవ పురస్సరంగా 'నమస్తే మేడమ్ ' అన్నాడు .

ఇంతలో మరొకరు మాట్లాడటం మొదలు పెట్టేరు,

' ఆ స్కూలు పెద్దాయన ఉన్నప్పుడు నడిచినట్లు ఇప్పుడు లేదు. ఇప్పుడు నడుపుతున్న ఆ పెద్దాయన కొడుకులు స్కూలు మూసివేసి అక్కడ మల్టిప్లెక్స్ తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. అప్పుడే ఆ పని కాంట్రాక్ట్ ఎవరికో అప్పగించేసేరు కూడా. వీళ్లు అందరూ డబ్బు మనుష్యులు.

మీకు ఇంకా అర్థం కావటం లేదా ?రోజూ న్యూస్ పేపర్ చూస్తున్నవాళ్లకి తెలుసు , నారాయణ గైక్వాడ్ కోర్ట్ చుట్టూ తిరుగుతున్నాడు ఏడాదిగా. కంపెనీ డబ్బు తినేసేడు అక్కడ. వాళ్ళకి మన పిల్లల చదువు ఎందుకు పడుతుంది ?................ '

అతని ధోరణి అలా సాగిపోతుంటే రజని , మిసెస్ శర్మ, వసుధ కూడా సహించలేనట్లు లేచేరు. వాళ్లకి ఏం జరుగుతోందో అర్థం కాలేదు. ఎప్పటెప్పటి విషయాలు, నిజమో కాదో తెలియని విషయాలు, ఇలా ఒక ధోరణిలో ప్రచారం అయిపోతున్నాయి స్కూలు గురించి. ఇక్కడ చేరిన ఈ జనం ఒక ఆవేశంలో ఉన్నారు.

శ్రీజ తో మాట్లాడాలి. ఆ అమ్మాయి అనుభవం, ఆలోచన తెలియని పిల్ల. మంచి జరగాలనే మొదలు పెట్టింది, కాని ఇది ఎటు వెళ్తుందో ఆమె కి అవగాహన లేదు. ఇప్పుడు కాదు, మళ్లీ వచ్చిఆమెతో మాట్లాడుతాం అని వసుధకి చెప్పి రజని, మిసెస్ శర్మ బయటకు వచ్చేసేరు.

దారి పొడవునా ఆలోచిస్తూనే ఉంది రజని, ఎంత బలంగా ఉన్నవ్యవస్థ లో అయినా ఎప్పుడో ఒక చోట ఒక చిన్న తేడా వస్తే, దాని పూర్వాపరాలు తెలియని వాళ్లు కూడా ఆ వ్యవహారం లోకి చొచ్చుకొచ్చి అక్కడ సమస్యని మరింత క్లిష్టతరం చేసే ప్రమాదం ఎంతైనా ఉంది అనిపిస్తోంది. అలాటి సమస్యల పరిష్కారం పేరుతో స్వంత లాభం చూసుకునే వాళ్లు ఎందఱో! రాజకీయపు ముసుగు వేసి జనాన్ని రెచ్చగొట్టే మనుష్యులు కూడా ఉన్నారు.

★★★★★★★★★★★★★★

'హలో మేడమ్, నమస్తే. రఫీ ని మాట్లాడు తున్నాను ' అనుకోకుండా అతని పలకరిపు.

'రఫీ, ఎక్కడనుండి మాట్లాడుతున్నావ్ ?' రజని ఉత్సాహంగా అడిగింది.

'ముంబై వచ్చేము మేడమ్. మిమ్మల్ని కలుసుకోవాలి మీకు ఎప్పుడు వీలుగా ఉంటుంది ?'

'కృతి కూడా వచ్చిందా? ఆమె ని కూడా తీసుకురా . సాయంకాలాలు ఎప్పుడు వచ్చినా ఇబ్బంది లేదు .'

చెప్పినట్లుగానే సాయంత్రం అతను వచ్చేడు. ఒక్కడూ వచ్చేడు. ఆమె చెల్లెలి పెళ్లి హడావుడిలో ఉండి, రాలేక పోయిందని చెప్పేడు. అతని ముఖంలో ఒక ఉదాశీనత గమనించింది రజని.

'రఫీ ! నువ్వు ఎప్పటిలాగా లేవు .........'

'అవును మేడమ్. నేను ఎప్పటిలాగా లేను. నాకూ తెలుస్తోంది ఆ వ్యత్యాసం. పాట పాడకపోతే బ్రతకలేను అనుకునే వాణ్ణి.

నా భార్య ముంబై లో ఉంటే సినిమాలో పాడే అవకాశాలు వస్తాయేమోనని ఇక్కడికి బదిలీ చేయించుకుందుకు ప్రయత్నం చేస్తోంది. చాలా రోజులుగా ఇక్కడే ఉంటోంది .

'ఇలా ఎన్నాళ్ళు అని అడిగితే', 'నువ్వు మరో పెళ్లి చేసుకో. నేను అభ్యంతరం పెట్టను' అంటోంది.

ఇంట్లో అమ్మ,నాన్న ఇద్దరం చెరొకచోట ఉన్నామని దిగులు పెట్టుకున్నారు.

ఆమె తల్లిదండ్రుల చేతనైనా చెప్పించాలని ప్రయత్నం చేసేను. వాళ్ళు ఒత్తిడి చేస్తే వేరే ఇల్లు తీసుకుని వెళ్లి పోతానని చెబుతోందిట. నేను ఈ పెళ్ళికి రాకపోతే నలుగురిలో ఆమె పెద్దవాళ్ళు చిన్నబోతారని వచ్చేను.'

వింటున్న రజని తెల్లబోయింది.

' తన ఆశయాన్ని గౌరవిస్తాను. కాని , ఏడాది క్రితం ప్రెగ్నెన్సీ ని నాకు తెలియకుండా టెర్మినేట్ చేయించుకుందని నాకు చాలా ఆలస్యంగా తెలిసింది. మా ఇద్దరి మధ్యా ఇంకా ఏదైనా అనుబంధం ఉందనుకోవాలా మేడమ్ ?

ఆమెతో పెళ్లి నిర్ణయం తీసుకున్నప్పుడు నా ఇష్టమే వాళ్ల ఇష్టం అని చెప్పిన నా వాళ్లకి నేను ఏమి చెప్పాలి మేడమ్ ?'

అతనికి జవాబు చెప్పటం చేతకాక మౌనంగా ఉండిపోయింది రజని. ఈ జనరేషన్ తమ ప్రయారిటీలు ఏమిటో నిర్వచించుకోలేని సందిగ్ధం లో ఉన్నారా? లేక అన్నీ చేసెయ్యాలని,చేసెయ్యగలమని అంతులేని ఆత్మవిశ్వాసంతో మొదలుపెట్టి మధ్యలో వదిలేస్తున్నారా?

ఒక బాధ్యత కి కట్టుబడే నిజాయితీ పోగొట్టుకుంటున్నారా?జీవితాన్ని తేలిగ్గా తీసుకుని ఆస్వాదించవలసిన ఆనందాన్ని వదులుకుంటున్నారా?వీళ్లకి ఎవరు చెబుతారు? ఎవరు చెబితే వింటారు? గడిచిపోయిన క్షణం తిరిగి రాదు అన్న వాస్తవం ఎలా తెలుసుకుంటారు ?

కమ్మని రాగాల చివుళ్ళు మేసే పాట
ఆత్మానందాన్నిచ్చే సోపానమైనప్పుడు ,
నీ గొంతు దాటి ప్రవహించినప్పుడల్లా
అది స్వర్గారోహణ చేయిస్తుంది !

రఫీ ని వింటూంటే రెండు సంవత్సరాల క్రితం తన ఆంధ్ర ట్రిప్ లో జరిగిన ఒక సన్నివేశం రజని మనసులో కదిలింది. తన తల్లి తులసి సమస్యని ఎంత సులువుగా పరిష్కరించింది! ఆమె సూచించిన పరిష్కారం ఆమోదించి సంసారం చక్కదిద్దుకున్న తులసి, భర్త కూడా సంతోషంగా ఉన్నారు .

అటువంటి ఆనందకరమైన సంసారాలు సమాజానికి కొత్త బలాన్నిస్తాయి మరి.

ఆరోజు రంగమ్మ వెనుకే తులసి వచ్చింది పనిలోకి.

'నువ్వెప్పుడొచ్చేవ్ తులసీ, పెళ్లి అయిన ఈ రెండు,మూడేళ్లల్లో నిన్ను చూడనే లేదు. ఎలా వుంది అత్తవారింట్లో ?' రజని ప్రశ్నకి .

'బావుంది ' అని క్లుప్తంగా అంటున్న ఆమెని చూసి ఆశ్చర్య పోయింది. ఇదివరకటి ఉత్సాహం లేదే !

తమ కళ్ల ముందు పెరిగిన పిల్ల. స్కూల్ నుండి వచ్చి తల్లికి పనిలో సాయం చేసి, శ్రద్ధగా కూర్చుని హోమ్ వర్క్ చేసుకునేది. పదో క్లాసు మంచి మార్కులతో ప్యాస్ అయి, కాలేజ్ లో జేరుతానన్న తులసి ఆశని ఆమె తల్లి సమర్ధించ లేదు .

'మాలో పది చదివిన వాళ్లు కూడా లేరమ్మా, ఇంకా చదివిస్తే మా ఆడపడుచు చేసుకోదు తన కొడుక్కి. ఆ పిల్లాడు పది ప్యాస్ అవలేదు. పని చేసుకుంటున్నాడు శుభ్రంగా. ఈ చదువు చాల్లే ' అంటూ చెప్పేది.

'ఏమిటోనే, తాహతుకి మించి ఖర్చు పెట్టి పిల్ల పెళ్లి చేసింది. పెళ్లై మూడేళ్లు కావొస్తోంది. పిల్లలు కలగలేదింకా. తన తోటివాళ్లలో నామోషీ గా ఉందిట. 'అసలు మీ పిల్ల ఆరోగ్యమైనదో కాదో డాక్టర్ చేత పరీక్షలు చేయించి తీసుకురండి', అని చెప్పి పిల్లని దింపి వెళ్లి పోయాడు.

ఇదీ అంతో ఇంతో చదువుకుంది. తెలివైన పిల్ల. మొగుడు చేసిన పనికి ఇంక మళ్లీ వాడి దగ్గరకెళ్లనని పంతం పడుతోంది. తల్లి నచ్చజెప్పబోతే వినదు. ఆరోగ్య రీత్యాఅంతా సవ్యంగా ఉందని డాక్టర్ చెప్పేరు. కానీ దీని మనస్సే మార్చలేక పోతున్నారు. ఆ పిల్లవాడు మళ్లీ ఈ ప్రక్కకి రాలేదు. రెండు నెలలు దాటి పోయింది అప్పుడే వచ్చి, కనీసం ఎలా ఉన్నదన్న కబురైనా కనుక్కోలేదని దీని కోపం .' తల్లి మాటలకి రజని విసుక్కుంది.

'ఏమిటమ్మా వాడికంత అహంకారం? కావాలంటే తను, తన భార్య చేయించుకోవాలి పరీక్షలు. ఏమిటీ సాధింపు? భార్య మీద కొంచెం అయినా ప్రేమ, గౌరవం లేవా? దానికెన్నేళ్లని? ఇరవై ఏళ్లైనా లేవు నిండా '.

'నిజమే. వాడేదో తెలివితక్కువ పని చేసేడని మనం కోపం తెచ్చుకోవటం కాదు. ఆ సంసారం ఎలా చక్కబెట్టాలో ఆలోచించాలి. అందుకే రంగమ్మకి చెప్పేను, కొడుకుని పంపి అల్లుణ్ణి ఇంటికి తీసుకురమ్మని. ఎలాగూ వాడు అడిగినట్లు పరీక్షలు చేయించింది. అంతా బావుందని చెప్పి పిల్లని, పిల్లవాణ్ణి సాగనంపమని.'

తల్లి మాటలకి ఆలోచిస్తుండిపోయింది. తులసి భర్త ప్రవర్తన తల్లి చెప్పినట్లు ఒక సంసారం విడిపోయేటంత పొరపాటు కాదేమో!

అత్తగారి ఇంటి నుండి ఆహ్వానం అందుకుని ఆనందంగా వచ్చి భార్యని తీసుకెళ్లిపోయేడు తులసి భర్త. అతని మాట చెల్లించుకున్నాడు మరి!

★★★★★★★★★★★★

అకస్మాత్తుగా గోవింద్ గైక్వాడ్ హార్ట్ ఎటాక్ వచ్చి హాస్పిటలైజ్ అయినట్లు తెలిసింది . రజని,మిసెస్ శర్మ కలవరపడ్డారు విషయం వింటూనే. స్కూలు గురించిన పేపర్ యాడ్ గైక్వాడ్ కుటుంబాన్ని కలవర పరిచి ఉంటుందేమో. అది గైక్వాడ్ ఇంటి పెద్ద కొడుకు ఆరోగ్యాన్ని దెబ్బతీసిందేమో !

ఒక సమస్య తీర్చేందుకు ప్రయత్నిస్తూ మరొక సమస్యని సృష్టిస్తున్నారా తామంతా? స్కూలు కోసమే పడుతున్న ఆరాటం అని చెబుతున్నా ఇది ఎందరి మనసుల్ని కృంగతీస్తోందో! ఆలోచిస్తే తాము అపరాధులమని తోచింది ఇద్దరికీ. ఇన్నేళ్ళ అనుభవం ఉండి తాము సరి అయిన మార్గ నిర్దేశం చెయ్యలేకపోతున్నారా మిగిలిన వాళ్లకి?

కుటుంబ పెద్ద అనారోగ్యం పాలైతే ఇంట్లో ఉండే అనిశ్చితి ఊహించ గలిగినదే. వైశాలి ని పలకరించింది రజని.

'పప్పా ఎలా ఉన్నారు ? చూసి వచ్చేవా ? ' అంటూ.

' కొంచెం స్లోగా కోలుకుంటున్నారు. ఇంకా కొన్ని రోజులవరకూ ఇంటికి పంపక పోవచ్చు . '

ఆమె గొంతులో ఒక అనీజీ నెస్! 'ఆమె ఇంకేదో మాట్లాడాలను కుంటోందా' అనిపించింది రజనికి.

'చెప్పు వైశాలి, ఇంట్లో అందరూ ఎలా వున్నారు? పప్పా మంచి ఆరోగ్యంగా ఉండేవారు కదా. అకస్మాతుగా ఇలా ఎలా అయింది?'

ఎవరితోనైనా చెప్పుకుని మనస్సులో భారమంతా తీర్చుకోవాలని చూస్తున్న వైశాలి ఒక్కసారిగా బరస్ట్ అయింది .

'దీదీ, పేపర్ యాడ్ చూసేం మేము కూడా. పప్పా ఇంటి వ్యవహారాల గురించి కొన్నాళ్ళుగా దిగులు పడుతున్నారు. ఇప్పుడు ఇలా పబ్లిక్ రకరకాలుగా వ్యాఖ్యానించటం ఆయన ఆరోగ్యాన్ని ఇంకా దెబ్బతీసింది.

నా తమ్ముళ్ళిద్దరూ కూడా సరిగా సెటిల్ కాలేదు, తెలుసుగా. కేశవ్ చాచా కొడుకులిద్దరూ ఆస్తిలో భాగం ఇవ్వమని కూర్చున్నారు.

నారాయణ్ చాచా గురించి తెలుసుకదా. పూర్తిగా డిప్రెషన్లోకి వెళ్ళిపోతున్నాడు. ఉద్యోగం పోవటమే కాదు,తాతయ్య ఇంటి ప్రతిష్టని కూడా పూర్తిగా పోగొట్టేసేనని ఒకటే గొడవ. ఆయన కేసు కోర్టులో నెమ్మదిగా కదులుతోంది . కోర్ట్ పనుల నిమిత్తం చాలా ఖర్చు పెట్టవలసి వస్తోంది .

నారాయణ చాచీ కాన్సర్ తో డెత్ బెడ్ మీద ఉంది. ఆవిడ వైద్యం కోసం ఆస్తి అంతా ఖర్చు పెట్టేస్తున్నారని మిగిలిన వాళ్ళ గొడవ. జబ్బు తో ఉన్న ఆవిడ పట్ల చూబించాల్సిన సానుభూతి, దయ ఎవరికీ లేవు.

నారాయణ చాచా కూతురు భర్తతో గొడవలు పడుతోంది. తాత ఆస్తిలో తనకూ భాగం వుంది కనుక స్కూల్ మూసేసి అక్కడ కమ్మర్షియల్ కాంప్లెక్స్ తీసుకు వస్తే లాభసాటిగా ఉంటుందని చెబుతోంది. కోర్ట్ కి వెళ్లేందుకు కూడాసిద్ధ పడుతోంది.

ఉమ్మడి కుటుంబంలో ఉన్నారు కనుక భౌతికంగా ఒకరి కొకరు తోడుగా అయితే ఉన్నారు. అంతే. పప్పాకి ఈ విషయాలు అన్నీ తెలుసు. స్కూలు గురించిన సమస్య ఆయనకీ కష్టం గా ఉంది. కాని ఇంట్లో అందరూ దానికి వ్యతిరేకంగా ఉన్నారు.

నాతో పాటు మహేంద్ర కూడా బాధ పడుతున్నాడు ఇదంతా చూస్తూ. మేము ఏదైనా చెయ్యాలనుకున్నా, చెప్పాలనుకున్నా మమ్మల్ని ఇంకా దూరంగానే పెడుతున్నారు దీదీ ...................... ' ఒక్క క్షణం ఆగింది .

'పప్పాని చూడాలని హాస్పిటల్ కి వెళ్లేం. చూసేందుకు ఎవరూ అభ్యంతర పెట్టలేదు. మమ్మీ దిగులుగా ఉంది. మహేంద్ర తో చదివిన డాక్టర్లు కూడా అక్కడ ఉన్నారు. తను వాళ్ళతో మాట్లాడేడు. ప్రమాదం తప్పిందని చెబుతున్నారు. కానీ ఇక పైన ఆయన ఒత్తిడి తట్టుకోలేక పోవచ్చు. '

వైశాలిని విన్నాక ఆ కుటుంబ పరిస్థితి పూర్తిగా కళ్ళ ముందుకొచ్చింది. ఉమ్మడి కుటుంబాలు ఆస్తులతో ముడి పడినందు వల్లే ఇంకా జరుగుతున్నాయా?

ఎవరికీ వారు ఆస్తులు పంచుకున్నాక,ఉమ్మడి ఆస్తులనేవి లేని నాడు ఇక ఉమ్మడి కుటుంబాలు కనుమరుగైపోతాయా?

కానీ వైశాలిని చూస్తే అది నిజం కాదనిపిస్తుంది. ఏ ఆస్తులూ లేకపోయినా కేవలం తన భర్త వెనుక కుటుంబం తనది ,వాళ్లంతా తన వాళ్లు అనుకుని ఆమె ఉమ్మడి కుటుంబం కావాలని వెళ్లింది.

అలాటి పరిణితి ఆమెలో రజని ఎప్పుడో పసిగట్టింది. తాతగారికి సరైన వారసురాలు ఈ అమ్మాయి అనుకుంటుంది .

అంతే కాదు, రజనిని, వైశాలిని కలిపే మరొక తీయని అనుబంధం కూడా వాళ్ళ మధ్య ఉంది.

అది సీనియర్ గైక్వాడ్ తో అనుబంధం. ఆయన వాళ్ళ ఇద్దరికీ ప్రియతముడు. ఆయనకీ ఇద్దరి పట్లా అంతులేని వాత్సల్యం ఉండేది. వాళ్ళ ఇద్దరికీ ఆయన ఒక ఆదర్శాన్ని, ఒక జీవన మార్గాన్ని చూబించిన వ్యక్తీ. వాళ్ళ ఇద్దరి జీవితాల్లో ఎదురైన ఎన్నోప్రశ్నలకి అదృశ్యంగానే పరిష్కారం చూబించిన వ్యక్తి . ఇప్పటికీ వాళ్ళని నడిపిస్తున్న శక్తి ఆయన.

జీవితాన్ని అందంగా జీవించ గలిగే కళ ఎందరికి తెలుస్తుంది? ఆ కళని ఎవరు, ఎక్కడ నేర్పుతారు? ఉహు , అది ఎవరూ,ఏ యూనివర్సిటీలు నేర్పలేవు.

పారిజాతాలు , బొగడలు పరిచిన దారుల్లో
నడిచొచ్చిన వాడివి!
నీకు ప్రేమించేందుకు కారణం ఎందుకు?
ఈ పూలూ ,ఈ వెన్నెలా, ఈ ప్రాపంచిక పరిమళాలు
నీవే నంటూ చెప్పుకున్నావు కదూ!
అప్పుడెప్పుడో కాలంతో జత కట్టి ప్రయాణమైపోయినా
మేము వేసే అడుగుల వెంట చైతన్యమై వస్తూనే ఉంటావు!
వెళ్ళు , ఆ క్రొత్త దారులన్నీ కూడా సువాసనల అరణ్యాల్ని అల్లుకుంటూ వెళ్ళిపో !

***

సాయంత్రం వాక్ లో పార్క్ దగ్గర క్రింద ఫ్లాట్ లో ఉండే పంజాబీ జంట కలిసింది .

' హలో రజనీ, మీ ఆంధ్రా గురించిన న్యూస్ చూస్తున్నాం. రాష్ట్రాన్ని రెండు చెయ్యాలంటున్నారు. ఇంకా ఎన్నాళ్ళు హైదరాబాద్ లో ఈ గొడవలు? నా హైదరాబాద్ ప్రయాణం వాయిదా పడుతోంది', పాపం ఆవిడ సమస్య ఆవిడది!

గత సంవత్సరం నుండి ఆమె చెబుతోంది 'హైదరాబాదు లో పనిచేస్తున్న మనవడు తెలుగు అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. ఒకసారి వెళ్లి చూసిరావాలి. అంతే కాదు నువ్వు చెప్పే హైదరాబాద్ చూడాలి. ప్రత్యేకం అక్కడ చార్మినార్ చూడాలి. మంచి ముత్యాలు కొనుక్కోవాలి. నా మనవడు మెచ్చిన బిర్యాని తినాలి .' దగ్గర దగ్గర ఎనభై ఏళ్ల వయసు ఉంటుంది ఆవిడకి. జీవితమ్ పట్ల ఎంత ఉత్సాహమో!

ఆవిడకి ఏమి చెప్పాలి? నిజమే, ఆవిడ అడిగిందని కాదు కానీ ఎన్నాళ్ళు ఈ అనిశ్చితి? ఆంధ్రకి దూరంగా బ్రతుకుతున్నారు కానీ ఇది తాత్కాలికమే, కేవలం ఉద్యోగ బాధ్యతలతో వచ్చిన దూరాలే, తమ వైన రూట్స్ మాత్రం పుట్టి పెరిగిన చోట పదిలంగా ఉన్నాయన్న ఆలోచన ఎంత భద్రతని, తృప్తినీ ఇస్తుంది!

ఇప్పుడు రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేస్తే........ చిన్నప్పటినుండీ స్కూలు పుస్తకాల్లో చూసిన భారత దేశపటంలో పరిచయమైన ప్రాంతం తమ నుంచీ దూరంగా ఎవరో లాక్కుపోతున్నారన్న బాధ. స్వంత ఇంట్లో మనుష్యుల మధ్య గోడలు కడుతున్నంత దుఖం.

విశాలమైన దేశాన్ని, ఇన్ని సంస్కృతులని ఒక్క తాటి క్రిందకి తెచ్చి స్వతంత్రం తెచ్చుకున్న మనం ఇంత సంకుచితంగా తయారవుతుంటే ముందు తరాలకి ఇచ్చే సందేశం ఏముంటుంది? ఏ విలువలని నేర్పగలం? ప్రజాస్వామ్యంలో ఉండి కూడా నిస్సహాయులుగా బ్రతుకుతున్నారు సాధారణ పౌరులు . నేను ఒక్కణ్ణి బాధ్యతగా ఉంటే మాత్రం ఒరిగేదేమి ఉంటుందనే నిర్లిప్తత!

ఇదీ చరిత్ర అని గర్వంగా చెప్పుకుందుకు రేపు ఏముంటుంది? ఇప్పటి తరం స్వార్ధ పరులైపోతున్నారని చెప్పేవాళ్ళు రేపటి తరానికి ఏమి అందిస్తున్నారు ? స్కూల్లో పిల్లలు చుట్టూ ప్రపంచం లో జరుగుతున్న అశాంతి , అలజడులు చూసి ఎందుకిలా జరుగుతోంది అని అడిగినప్పుడు మాట రానట్లు మౌనం వహించాల్సి వస్తోంది.

సమాజంలో కమ్ముకుంటున్న అశాంతి, అసౌకర్యాన్ని అలాగే ఉంచి, తమ పదవులు మాత్రం కాపాడుకునే రాజకీయ నాయకులు ఎవరికీ బాధ్యులు కారు.

'మనల్ని మనం బాగుచేసుకుందాము' అనే లోక్ సత్తా లాటి పార్టీకి ఒక్క ఎమ్.ఎల్.ఏ ని మాత్రం గెలిపించే వివేకం! రాష్ట్రం లో రోజువారి జీవితమ్ ఎంత చిందర వందరగా తయారైందో చూస్తే నిస్పృహ!

రెండేళ్ళక్రితం స్నేహితులతో కొల్హాపూర్ వెళ్ళినప్పుడు అక్కడ ఆటొ రిక్షా నడుపుతున్న వ్యక్తి ' మహారాష్ట్ర లో ఉండాలంటే మరాఠి మాట్లాడాలి మీరు, ఇక్కడ హిందీ కుదరదు ', అంటూ చేసిన హెచ్చరిక జ్ఞాపకం వచ్చింది రజనికి. ఇలా ఎక్కడికక్కడ అన్ని ముక్కలుగా మనుష్యులు విడిపోతే ఎలా?

కలిపి ఉంచే మంత్రం ఏమీ లేదా?

రాను రాను కొత్త ప్రపంచాన్ని కనుక్కుంటూ, కొత్త అవకాశాలు వెతుక్కుంటూ అందరూ దూరాల్ని లెక్క చెయ్యకుండా వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు. ఇలాటి వాతావరణంలో భౌతిక మైన పరిధులు గియ్యటం సాధ్యమేనా?

రకరకాల వృత్తులు! సమాజంలో ఏ స్థాయి నుంచి ఏ స్థాయికి ఎదిగేందు కైనా కష్ట పడటం ఒక్కటే మార్గం అని తెలుసు కుంటున్నారు. అభిలషించ దగ్గదే.

కాని గమ్యాన్ని చేరేక చుట్టూ ప్రపంచం వదిలి స్వంత లాభం మాత్రమే చూసుకునే జనం ఎక్కువ అవుతున్నారు. తాము కష్ట పడి చేరిన స్థానం కేవలం తమది . దాని తాలూకు ఫలాలు కేవలం తమవి అనే స్వార్ధం ఎక్కువైంది. తాము అధిరోహించిన మెట్లన్నిటికీ తల్లి దండ్రులు, గురువులు , తమ తోటి వారెందరో ఇచ్చిన చేయూతే ఆధారమనే ఇంగితం లోపిస్తోంది.

రాష్ట్రం ముక్కలు కాబోతోందన్న వార్తలు గురించి ఆలోచిస్తూ ఇల్లు చేరింది రజని. ఇల్లు చేరుతూనే కూతురు ఎలా ఉందో అన్న ఆలోచన. మాట్లాడి చాలాచాలా రోజులైనట్లుంది. ఆమె మనసు తెలిసినట్లే రాత్రి విరాజిత పలకరించింది.




'ఎలావున్నారు నువ్వూ , పప్పా ' అంటూ . 'అమ్మా ,థాంక్స్ అమ్మా, 'ఉప్పమ్మా' ఫోటో పంపినందుకు . ఉప్పబ్బాయి ఇంకా అలాగే ఉన్నాడు . ఇన్నేళ్ళైనా మారలేదు .'

'అవును విరీ, లబ్బీ పేటలో ఉంటున్నవాళ్ళకి గత ముప్పై,నలభై ఏళ్లుగా అతను ప్రతి రోజూ వచ్చి పలకరించే అతిథి. నా స్కూల్ డేస్ నుండీ అల్లాగే ఉన్నాడు. వయసు తెచ్చిన మార్పు ఎక్కడా కనపడదు. కానీ ఇంకా అతను ఎంత వ్యాపారం చెయ్యగలుగు తున్నాడో

మాత్రం నేను చెప్పలేను. నిన్ను గురించి అడిగేడు. తన ఫోటో తీసుకుంటానంటే తెగ మొహమాట పడ్డాడు.

అమ్మమ్మ ఇంటి చుట్టు ప్రక్కల బోలెడన్ని మాల్స్ వచ్చేసేయి తెలుసా? మనం ప్రతి వేసవి లోనూ ఫ్రెష్ గా మ్యాంగో జెల్లీ తెచ్చుకునే సత్యనారాయణ కొట్టు వీధి చివర నుండి మాయమై పోయింది. మన దేశంలో మొదటి వాల్ మార్ట్ నిడమానూరులో వచ్చేసింది కూడా. ఇక్కడికి వచ్చినా నువ్వు నీ వాల్ మార్ట్ మిస్ అవవులే. నువ్వు వచ్చేవంటే ఎమ్. జి. రోడ్ చూసి ఆశ్చర్య పోతావ్. సరే , నువ్వు ఎలా వున్నావ్? ఎప్పుడొస్తున్నావ్ ? '

'అమ్మా, వచ్చేస్తాను కానీ, ఇంకా మన ఊరు కబుర్లు చెప్పమ్మా. చూడాలని ఉంది .' గారంగా అంది .

'ఎన్ని మాటలు చెబితే ఈ నేల, గాలి పంచే సువాసనలు నీకు అందుతాయిరా విరీ ?'

కూతురితో మాట్లాడటం పూర్తి అయ్యేక రజని ఆలోచనలు మాత్రం విజయవాడ ఎమ్. జి. రోడ్ ఎక్కేసేయి. ఆ వూరు, ఆ రోడ్లు అన్నీ తనవి అనుకుంటుంది. అక్కడ వచ్చే మార్పులు, ఆ వేగం ఎందుకో సహించరానివిగా ఉంటాయి ఆమెకు.

పాత ఆనవాళ్ళు , చిరునామాలు లేకుండా మాయ మైపోతున్నాయి . మనిషి ఆయువు పెరుగుతూ పోతోంది. కాని, చుట్టూ ఉన్న ప్రపంచంతో అతను అల్లుకుంటూ వచ్చే అనుబంధం మాత్రం త్వరత్వరగా కనుమరుగై పోయి అతణ్ణి అపరిచితుడిగా నిలబెట్టే స్తోంది.

ఇవి ప్రతి తరానికి తప్పనిసరి అనుకుంటే, క్రితం తరం వాళ్ళు అంతరాల్ని ఇంతగా చూడలేదు అనిపిస్తుంది. వాళ్ళ ప్రపంచం ఇంత విశాలమైనది కాదు. భౌతికంగాను, మానసికంగాను వాళ్ళ కంటూ ఒక చిక్కని ఆత్మీయతా ప్రపంచం పరుచుకున్నారు నలువైపులా. ఆ పరుచుకున్న పరిధి దాటి తమ గూళ్ళు వదిలి వెళ్ళే అవసరం వాళ్ళకి తెలియనే లేదు.

శరీరాలు కష్ట పడేలా పని పాటలు చేసుకున్నారు. మనసుల్ని మాత్రం ఆరోగ్యంగాను, ఆనందంగాను ఉంచుకున్నారు.

ఇప్పటి వాళ్ళు శరీరాలు నొచ్చుకోకుండా సకల సౌకర్యాలు అమర్చు కుంటున్నారు. మేధే పెట్టుబడి. కాని మనసులని మాత్రం యాతన పెడుతున్నారు. కమ్మని పలకరింపుకు కూడా మొహం వాచిపోతున్నారు.

ఆ పాత ఫోటో లోని దృశ్యాలే మనసు కోరుకుంటుంది. అవన్నీ మనసుకు మచ్చికైనవి మరి.

స్కూల్ విషయం ఎటూ తేలకుండా ఉంది. ఎవరిని అడగాలో, ఏమిచెయ్యాలో తెలియకుండా ఉంది. గోవింద్ గైక్వాడ్ అనారోగ్యం పాలు అవటంతో మరింత గందరగోళం గా ఉంది. నెల రోజులు గడిచి పోయేయి స్కూళ్లు తెరిచి. క్లాసులు మాత్రం ఇంకా మొదలు కాలేదు గైక్వాడ్ స్కూల్లో .

రజని మరి కొన్నాళ్లు క్లాసులు ఇదే విధంగా నడపటానికి మరొక విన్నపం పెట్టుకుంది హౌసింగ్ సొసైటి దగ్గర. క్లాసులకి వస్తున్న పిల్లలు కూడా క్రమశిక్షణతో ఉండటంతో ఎవరినుండీ ఫిర్యాదులు లేవు.

వీణ మేడమ్ కాలు ఫ్రాక్చర్ అయిందని విని, ప్రక్క వీధిలో ఉన్న ఆమె ఇంటికి పరుగెత్తింది రజని. తెల్లవారి వాకింగ్ పూర్తి చేసుకుని వస్తూ మెట్ల మీద పడిపోయిందని, కాలి మడమ కి,నడుముకి కూడా బాగా దెబ్బ తగిలిందని, ఆరు వారాలు బెడ్ రెస్ట్ అని చెప్పింది ఆవిడని అటెండ్ అవుతున్న నర్స్.

రజనికి ఆవిడని అలా చూసేసరికి కష్టంగా అనిపించింది. ఈ వయసులో ఆవిడ భర్తకి దూరంగా, ఒంటరిగా, తోడు లేకుండా ఉండటం ఎందుకు అనిపించింది. భార్యా భర్తల్ని ఇద్దరినీ ఎక్కడో ఒక చోటే కలిసి ఉండమని చెప్పాలన్న భావాన్ని గట్టిగా కంట్రోల్ చేసుకుంది రజని.

'వీణాజీ , మీరు పుస్తకాలు చదువుతారు కదా , నేను పట్టుకొచ్చి ఇస్తాను. టైం పాస్ అవుతుంది. ఎంత ఒక్క ఆరు వారాలు , అంతే కదా.' అంది రజని ఆవిడ కి ధైర్యం చెప్పాలని.

'అన్నట్లు మీకు భోజనం నేను పంపిస్తాను, మీరు లేచి తిరిగే వరకూ' రజని మాటలకి,

'వద్దు రజని , ఇది ఒకరోజు, రెండు రోజులతో అయ్యే పని కాదు' ఆవిడ ఖంగారుగా చెప్పింది .

'లేదు మేడమ్. ఇందులో శ్రమ ఏమీ లేదు. ప్లీజ్, మీరు కాదని అనకండి.' వీణకి గట్టిగా చెప్పి, ఒప్పించింది. ఆవిడ ముఖంలో ఎప్పుడూ ఎరుగని దిగులు.!

మమత మాయ తెరలా అల్లుకున్న వేళ, నువ్వు బేల మనసువై పోతావు !
తెరలు తొలగి తెలివొచ్చే వేళ మాత్రం ,బావురుమనే గుండె గది వైపోతావ్ !
ఆనంద విషాదాలు రెండూ ఔపోసన పట్టినదానివి ,
పడిలేచే కెరటాల తాకిడిని ఆవాహన చేసుకున్నదానివి ,
గుండెలో మమతని పంచేందుకు విశ్వమే నీ హద్దు !
తామరాకు మీద నీటిబొట్టే నీ ఆదర్శం !

ఇంటికి వచ్చే దారిలో పదో క్లాసు పిల్లలు మున్ని, ఆమె స్నేహితులు కనిపించి ఇంటి దాకా వస్తామంటూ బయలు దేరేరు. అందరి ముఖాలూ వెలిగిపోతున్నాయి. పసితనపు ఛాయలు వదిలి వ్యక్తిత్వాలు ఏర్పడే వయసు!

జీవితం పట్ల ఎన్ని కలలుంటాయో! ప్రపంచమంతా రంగుల మయంగా,తాము ఎదిగేందుకు ఆకాశమే హద్దు అన్నట్లుగా...తమదైన లోకంలో ఉంటారు ఈ పిల్లలు అనిపిస్తుంది . తమ శక్తి మీద అంతులేని నమ్మకం వాళ్లని నడిపించే ఇంధనం అవుతుంది.

'టీచర్ , నాపుట్టిన రోజు ఇవాళ 'మున్ని మాటలకి అభినందించి, రజని లోపలికి నడిచింది పిల్లలకి ఏదైనా తినిపించాలని.

అడుగులో అడుగు వేసుకుంటూ ఆమె వెనుకే మున్నీ వంటింట్లోకి రావటమ గమనించి,

'ఏం మున్నీ ,క్రొత్త బట్టలు వేసుకున్నావా? అమ్మానాన్న వచ్చి వెళ్లేరా ?తమ్ముడు ఎలా చదువుతున్నాడు?' అంది.

' ఈ సారి క్రొత్త బట్టలు వద్దని చెప్పేను టీచర్. నాకు దాని బదులు డబ్బులు కావాలని చెప్పేను. అయినా ఆయీ వాళ్లు నన్ను తీసుకు వెళ్లేందుకు వచ్చేరు టీచర్ . ఇక్కడ స్కూల్ నడవదని, నా చదువు ఇక్కడుంటే సాగదనీ, తమతో కూడా రమ్మని చెప్పేరు.తమ్ముడు చదివే స్కూల్ లో జేరుస్తామని చెప్పేరు.

ఇక్కడ నానమ్మ ఒక్కతే ఉండలేదనీ ఆమెను కూడా తీసుకు వెళ్తామని అన్నారు. నానమ్మ తను ఇక్కడ నుండి రానని చెప్పేసింది. నేను కూడా రానని చెప్పేను. ఇక్కడ మా టీచర్లు చదివిస్తున్నారనీ, స్కూల్ కూడా తెరుస్తారనీ చెప్పేను టీచర్.'

రజని మనసు ఆనందంతో నిండిపోయింది ఆ పిల్లల నమ్మకానికి.

స్వీట్ ,కొంచెం కారప్పూస ప్లేట్లలో పెట్టి ముందు గదిలోకి వచ్చి పిల్లల మధ్య కూర్చుంది.

మున్ని స్నేహితురాలు ఇంక ఆగ లేనట్లు 'చెప్పెయ్యనా?' అంది మున్నీ వైపు చూస్తూ.

మున్ని లేచి దగ్గరగా వచ్చింది 'టీచర్, మన స్కూల్ నడపటానికి డబ్బు కావాలట కదా, నానమ్మ చెప్పింది. నా పుట్టినరోజు అని అమ్మ,నాన్న నాకు ఐదు వందలు ఇచ్చేరు . ఇది తీసుకుని స్కూల్ కోసం ఖర్చు పెట్టండి టీచర్.'

భక్తిగా తన చేతిలో ఉన్న కవరు రజని చేతుల్లో పెట్టింది . రజని కళ్లు చెమర్చేయి. ఈ పిల్లల ఆలోచన ఎంత గొప్పది !

'లేదు మున్నీ, మన స్కూల్ ఎప్పటికీ పనిచేస్తుంది . ఇది మూసివెయ్యరు. మన స్కూల్ కోసం మేమంతా లేమూ? ఈ డబ్బు జాగ్రత్తగా తీసుకు వెళ్లి నానమ్మ కి ఇవ్వు . అవసరానికి పనికొస్తుంది.'

మున్ని రెండు అడుగులు వెనక్కి వేసింది. 'వద్దు టీచర్ , ఇది స్కూల్ కోసమే ఖర్చు పెట్టాలి .'

'టీచర్, మున్నీ కి స్కూల్ యూనిఫాం ఒక్క జతే ఉందని ఈ సారి పుట్టినరోజుకి వాళ్ల నానమ్మ కుట్టిస్తానని చెప్పింది .అది కూడా కుట్టించుకోకుండా , ఆ డబ్బులు కూడా వాళ్ల అమ్మ,నాన్నలు ఇచ్చిన డబ్బులకి కలిపి ఇప్పుడు తీసుకు వచ్చింది.' మున్నీ స్నేహితురాలు చెబుతోంది.

రజని మున్నీ ని దగ్గరగా కూర్చోబెట్టుకుని ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంది.

'మున్నీ, నేను ఒక విషయం చెబుతాను , వింటావా? ' అంది. మున్నీ తల వూపింది టీచర్ చెప్పబోయేది శ్రద్ధగా వినేందుకు

'మున్నీ, నువ్వు బాగా చదువుకుని మంచి ఉద్యోగం చేసి మన స్కూల్ కి సాయం చేద్దువుగాని, ఇంకా బోలెడు మంది పిల్లల్ని చదివిద్దువుగాని . ఇప్పుడు నువ్వు చిన్న పిల్లవు. చదువుకోవటం ఒక్కటే నీ పని. తెలిసిందా ?'

'కానీ, టీచర్........ మన స్కూల్ ..............'

'మన స్కూల్ కి ఏమీ కాదు, చక్కగా జరుగుతుంది. మేము ఆ ఏర్పాట్లు చేస్తున్నాము. సరేనా ? ఇప్పుడు ఈ డబ్బులు తీసుకెళ్లి ఇంట్లో ఇవ్వు. '

మున్ని పూర్తిగా తృప్తి పడలేదు ఆ మాటలకి. తను చెయ్యాలనుకున్న సాయం చెయ్యనివ్వటంలేదే అనుకుంది దిగులుగా .

రజని లేచి వెళ్లి కొంత డబ్బు చిన్న కవర్ లో పెట్టి మున్ని చేతికి ఇచ్చింది , 'మున్నీ, ఇది నీకోసం , నీ పుట్టినరోజు కానుక ,నీ స్నేహితురాళ్లకి మిఠాయిలు కొని పెట్టవూ ' అంటూ ఆశీర్వదించి పంపింది పిల్లల్ని .

రజనికి ఇప్పుడు స్కూల్ గురించిన చిన్న దిగులు కూడా లేదు . ఇంత మంది , ఇన్నిరకాలుగా ప్రయత్నిస్తుంటే ఏ సమస్య మాత్రం ఉంటుంది?

ఈ కొద్ది కాలం జరిగిన అలజడి కేవలం స్కూల్ తో అనుబంధం ఉన్నవాళ్లు దానికి మరింత చేరువ అయ్యేటందుకే దోహద పడుతుంది. రజని హాయిగా నిట్టూర్చింది స్కూల్ విషయం తలుచుకుని .

ఈ సమస్య దూది పింజలా ఎగిరిపోయే సమయం వచ్చింది అనుకుంది .

.

★★★★★★★★★

ఆ రోజు మధు వస్తూనే ,

'రాజీ, మన సొసైటీ ప్రెసిడెంట్ గారింటికి వెళ్దాం పద ' అన్నాడు.

'ఏమైంది, ఎనీ ప్రోబ్లమ్?' ఆమె మనసు సంశయంతో ఊగిసలాడింది అరక్షణం పాటు. తన స్టూడెంట్స్ ఏదైనా సమస్య తెచ్చిపెట్ట లేదు కదా తనకు తెలియకుండా.

'ఏదో ముఖ్య విషయం. నిన్ను కూడా తీసుకు రమ్మని చెప్పేరు. సమస్య ఏమీ లేదు, నువ్వు అనవసరంగా ఖంగారు పడకు . '

అతని మాటలు విన్నాక మామూలు రజని అయింది. స్కూలు సంగతి తేలేవరకు తను ప్రారంభించిన ప్రాజెక్ట్ ' పార్కింగ్ లో పాఠాలు ' (మధు పెట్టిన పేరది )ఎక్కడా బ్రేక్ పడకుండా జరగాలని రోజూ మనసారా కోరుకుంటూ నడిపిస్తోంది. ఎటు నుండి ఎలాటి విఘ్నం వస్తుందో అని కూడా కాస్త బెరుకు పుడుతుంటుంది ఒక్కోసారి.

'రజని జీ , మనీషా మీ దగ్గర చాలా ఏళ్లుగా పని చేస్తోంది అనుకుంటాను . '

ఆయన మొదలు పెట్టడమే ఊహించని టాపిక్ !

' అవును, దాదాపు దశాబ్దం పైగా నా దగ్గర ఉంది. ' విషయమేమిటో అర్థం కాకపోయినా ప్రెసిడెంట్ గారు అడిగిన ప్రశ్నకి జవాబు చెప్పింది.

'మా డ్రైవర్ పండరిని మీరు చూసే ఉంటారు, దాదాపు పది పన్నెండు ఏళ్లుగా నాదగ్గర పని చేస్తున్నాడు. అతనికి ఒక అన్నయ్య, తల్లి ఉన్నారు. ఇప్పుడు ఆ అన్నగారికి సౌదీ లో ఉద్యోగం వచ్చి, వెళ్లి పోతున్నాడు . తమ్ముడి పెళ్లి చేస్తే తల్లిని ,ఇంటిని చూసుకునే తోడు దొరుకుతుందని అతని ఆలోచన. ఇన్నాళ్లు పండరి పెళ్లి పట్ల సుముఖత చూబించక పోవటంతో అలా ఉండిపోయేడు. అతని అన్నగారు నా దగ్గరకి వచ్చి తమ్ముడిని పెళ్లికి ఒప్పించమని అడిగేడు.

నాకు, నా భార్యకు మనీషా జ్ఞాపకం వచ్చింది. ఆ అమ్మాయి కూడా కుటుంబం కోసం చాలా కష్ట పడుతుందని విన్నాను. పెళ్లి అయ్యేక కూడా ఆమె తన తల్లి, కుటుంబం కోసం పని చెయ్యదలచు కుంటే అభ్యంతరం ఉండదు. ఇద్దరూ కళ్ల ముందు ఉంటారు. ఏదైనా సమస్య వచ్చినా మనం చూసుకోవచ్చు . '

ఆయన మాటలకి రజని ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయింది. మనీషా ని ఒప్పించగలనన్న నమ్మకం ఆమెకి ఉంది ..

'వాళ్లకి ఎలాటి సమస్యా రాదు సర్, నాకు తెలుసు. ఇలాటి అవకాశం కోసం నేను కూడా చూస్తున్నాను. మనీషా కష్టపడే తత్త్వం , నిజాయితీ లకి మారుపేరు. చాలా హ్యాపీగా ఉంది సర్ .'

'అయితే మేము ఊహించిన అమ్మాయి సరి అయిన ఛాయిస్ అన్నమాట. ప్రొద్దున్న ఈ ఆలోచన రాంగానే మిస్టర్ మధు కి ఫోన్ చేసేను కలుసుకుందామని . '

ఆయన కూడా తను అనుకున్నట్లుగానే పని సానుకూలపడేలా ఉండేసరికి ఆనందించేడు.

నిస్వార్థంగా తన వాళ్ళ కోసం శ్రమించే మనీషాకి సరి అయిన బహుమతి దొరికింది. తప్పక ఆమెని ఒప్పించాలి అనుకుని, ఆలోచనలతో ఆ రాత్రి నిద్ర మాట మరిచి పోయింది రజని .

★★★★★★★

శైలు అత్తగారికి బావులేదంటూ శైలు, ఆమె భర్త అకస్మాత్తుగా ఇండియా వచ్చేరు. ఆవిడ కొంత కోలుకున్నాక వెనక్కి ప్రయాణమై వెళ్తూ ముంబై లో కొన్ని గంటలు వ్యవధి ఉండటంతో రజని,మధుల్ని కలిసేరు. చెల్లెల్ని చూసి ఎన్నాళ్లో అయిపోయినట్లు అనిపించింది రజనికి . ఉన్న కొద్ది గంటల సమయమూ ఎలా గడిచిందో కూడా తెలియకుండానే గడిచిపోయింది.

'అక్కా, స్కూలు విషయం ఇంకా ఏమీ పరిష్కారం కాలేదా? కేవలం ఆర్థికమైన ఇబ్బందులు అయితే మీరు చెయ్యదలచుకున్న పనిలో నేనూ భాగస్వామ్యం తీసుకుంటాను. ' అంటున్న చెల్లెలి మాటలకి,

'లేదు శైలూ, పరిష్కారమైతే ఇంకా కాలేదు . కానీ ఇది కేవలం ఆర్థిక పరమైనది మాత్రమే కాదు . మధ్యలో చాలా మంది స్కూలుతో ప్రత్యక్షంగా సంబంధం లేకపోయినా జోక్యం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అసలు సమస్య ప్రక్కన పెట్టి ఎవరికి తోచిన రీతిలో వాళ్లు మాట్లాడుతున్నారు. ముందు దీనిని ఆపాలి.

నా కలీగ్ వసుధ కూతురు కొంచెం చొరవ తీసుకుని తనవైపు ప్రయత్నం ప్రారంభించింది . కానీ ఆమె ప్రయత్నం క్రొత్త సమస్యల్ని సృష్టిస్తోంది అని గమనించి తనకి అర్థమయ్యేలా చెప్పేము.చిన్న తనం కదూ, ఆవేశం ఉన్నమాట నిజమే అయినా అర్థం చేసుకుంది మేము చెప్పిన విషయం. తను మంచి జరుగుతుందని నమ్మి, చేద్దామనుకున్నది ఎలాటి ప్రక్క దారులు పడుతోందో చూసేక ఆ అమ్మాయి కూడా వెనక్కి తగ్గింది.

ఏడాది క్రితం భర్త అకస్మాత్తుగా పోవటంతో వసుధ ఖాళీ తనాన్ని ఫీల్ అవుతోంది. కూతురు శ్రీజ స్వతంత్రంగా ఉంటానంటూ ఫ్రెండ్స్ తో కాలేజ్ దగ్గరగా ఫ్లాట్ తీసుకుంది. తండ్రి పోయేక తల్లికి, ఇంటికి దూరంగా ఉంది . ఇప్పుడు వచ్చి కొన్నాళ్లు ఉండటంతో తల్లి ఒంటరితనం అర్థం చేసుకుంది. ఇంకా పైన ఇక్కడే తల్లితోనే ఉంటానని చెప్పిందట. ఇలా స్కూలు సమస్య వలన కొన్ని అనుకోని మంచి విషయాలు కూడా జరుగుతున్నాయి . '

చెల్లెలి రాక, కొన్ని గంటల పాటే అయినా రజని కి కాస్త ఉరటగా అనిపించింది. ఐదారు వారాలుగా తనని ఆవరించిన నిరాశ, నిస్పృహలు మాయమైనట్లు ,ఏదో తెలియని ఒక ధైర్యం, క్రొత్త బలం తనలోకి వచ్చి చేరినట్లు తోచింది.

వెళ్లవలసిన సమయం రానే వచ్చింది . మధు హడావుడి మొదలు పెట్టేడు .

ఎయిర్ పోర్ట్ లో చెల్లెల్ని వదిలి వస్తూంటే రజని మనసుకు ఎంత సర్ది చెప్పుకున్నా దుఃఖం పడింది . చెల్లెలికి చెప్పిన ధైర్యం తనవరకూ వచ్చేసరికి నీరు కారిపోయింది. మనసారా మాట్లాడుకునే వ్యవధే లేదు. ప్రతి చిన్న అనుభవాన్ని కలిసి పంచుకున్న ఆ చిన్ననాటి రోజులన్నీ ఏమైపోయేయో! దూరాలన్నీ అధిగమించి ఇదిగో వస్తున్నా నంటూ చెల్లెలి నుండి కబురొస్తే నెలలు, వారాలు, రోజులు ఎదురుచూపులతో గడిపేస్తుంది. తీరా వచ్చేక ................... రోజులు క్షణాలైపోతాయి !

నీ రాక నంటే ఎన్నాళ్లు ఉంటావులే అన్న నిర్లిప్తత!

నువ్వు వస్తున్నావన్న కబురుతో పాటు వెళ్లిపోతావన్న దిగులు!
ఎప్పుడో , బహుశా ఏ జన్మలోదో అనిపించే జ్ఞాపకం..............
ధనుర్మాసపు చిరుచలిలో ..........
వరండా అంచునో , డాబా మీద నీలాకాశం క్రిందో కూర్చుని
వాకిలి ముందు క్రితం రాత్రి వేసిన ముగ్గుల్ని , గొబ్బెమ్మల సిగలో తురిమిన బంతిపూల్ని
చూస్తూ కబురు లాడే తీరికే లేదంటావ్ !
ఎందుకో అలలు అలలు గా నవ్వులు పూచే ఆ పసితనాలు ఏమయ్యాయో
ఒక ఇంటి కప్పు క్రింద కలిసి గడిపిన నిన్నమొన్నలన్నీ ఏమయ్యాయో !
జ్ఞాపకాల మూటలై ,చెలిమి ఊటలై
మది నిండా నిక్షేపాలై మాత్రం ఉన్నాయిలే !
అవి నేను మొయ్యలేని బరువులై వేధిస్తుంటే ,
నీ మరో ఆగమనానికై ఇప్పటి నుంచీ
దిగంతాల్లోకి నా చూపులు సారించనా ?

రజనికి ఒక్కసారిగా స్వంత ఊరు మీద గుబులు పుట్టింది . జనవరి వరకు ఆగాలి! వేసవి లో వెళ్లేది అయినవాళ్ళందరినీ కలిసేందు కైతే ,జనవరిలో వెళ్లేది మాత్రం ఆత్మబంధువుల్ని కలిసేందుకే. ఒక్క నాలుగు రోజుల ట్రిప్ కోసం ఇన్ని నెలలు ఆగాల్సిందే. బుక్ ఎక్జిబిషన్ కోసం ప్రతి జనవరి నెలలో ఆత్రంగా విజయవాడ పరుగెడుతుంది. గత పాతికేళ్లుగా అక్కడ క్రమం తప్పకుండా జరిగే పెద్ద పండుగ అది. స్కూల్లో లాస్ట్ టర్మ్ తాలూకు హడావుడి, పిల్లల్ని పరీక్షలకి సన్నద్ధం చేసే పనిలో ఎంత ఒత్తిడిగా ఉన్నా తప్పనిసరిగా వెళ్లాలి.

అక్కడికి ఊళ్లో ఉన్న రచయితలూ, రచయిత్రులు మాత్రమే కాకుండా దూరదూరాలనుంచీ వచ్చే ఎందరో రచయితలూ, కవులు ని కళ్లారా చూసి, అక్కడ జరిగే సాహిత్య సభలని విని, పుస్తక ప్రపంచంలో మునిగి, తేలి, పుస్తకాల బరువుతో మళ్లీ రైలెక్కేయ్యాలి. విజయవాడ వాసులందరూ సంవత్సరం తర్వాత సంవత్సరం అందుకునే అద్భుత కానుక అది.

స్కూలు పిల్లలకోసం బోలెడు పుస్తకాలు మోసుకొస్తూ ఉంటుంది రజని. ప్రతి జనవరిలోనూ స్కూలు లైబ్రరీ క్రొత్త పుస్తకాలతో ముస్తాబు చేసుకుంటుంటే పిల్లలతో పాటు రజని సరదాపడి పోతుంది. పిల్లలకి , కథలకి విడతీయరాని సంబంధం ఉంది కాదూ ! ఈ పిల్లలే కదూ రేపటి పెద్దలు ! పెద్దల కబుర్లు మొదలైతే అవి మాత్రం కథలు కావూ ?

స్కూల్లో ప్రతి ప్రత్యేక సందర్భంలోనూ పుస్తకాలే బహుమతులు. రఫీలా స్కూలుతో అనుబంధం ఉన్నవాళ్లు స్కూలు చూసేందుకు వచ్చినప్పుడల్లా పుస్తకాలతో లైబ్రరీని పెంచుతూ ఉంటారు.

.

వైశాలి ఫోన్ కాల్ ! 'దీదీ', అంటూ. ఆమె గొంతులో దాగని సంతోషం. రజని కంటి ముందు ఆమె కనిపిస్తోంది.

'వైశాలీ! పప్పా బాగా రికవర్ అవుతున్నారు కదూ? ' ఆతృతగా అడిగింది రజని.

' దీదీ! అనుకున్నదాని కంటే త్వరగా రికవర్ అవుతున్నారు. అది సరే, ఇంకా మంచి వార్తలు చెబుతాను, విను. ఇన్నేళ్ళ తర్వాత నన్నూ, నా భర్తని ఆ ఇంట్లో సభ్యులుగా ఆదరిస్తున్నారు. పప్పా కోసం మహేన్ రోజూ వెళ్ళి వస్తున్నాడు. పప్పా శారీరకంగా తేరుకుంటున్నా ఆయన తమ్ముళ్ళ గురించి, ఇంకా సరిగా నిలదొక్కుకోని పిల్లల గురించి దిగులు పడుతున్నారు. నేను కూడా సమయం దొరికినప్పుడల్లా వెళ్తూనే వున్నాను.

తమ్ముళ్లని కూర్చోబెట్టుకుని మాట్లాడేను. వాళ్ళు కూడా సరిగా చెప్పేవాళ్ళు లేక అలా తయారయ్యారని అనిపించింది. ఎలా అయితేనేం, ఇప్పుడు మళ్లీ అందరం దగ్గర అవుతున్నాం.

నారాయణ చాచా కేసు లో ఒక మలుపు వచ్చింది . ఆయన కంపెనీలో తెచ్చుకుంటున్న పేరుని, ప్రమోషన్ల విషయంలో ఆయన ముందు ఉండటాన్ని సహించలేక కొంత మంది లేనిపోని గొడవలు సృష్టించేరు. అవన్నీ ఇప్పుడు ఒకటి ఒకటిగా బయటకు వస్తున్నాయి. చాచా కూడా మెత్తని మనిషి అవటం, తన సమస్యని ఇంట్లో ఎవరితోనూ చర్చించక తనలో తానే నలిగిపోయేరు.

నారాయణ చాచీని ఇంకా ఎవరం కాపాడలేని పరిస్థితిలో ఉంది. కానీ తను బ్రతికి ఉన్న కాసిని రోజులు ఆమెకి సంతోషాన్ని, ఊరటని ఇచ్చే పనులు చెయ్యాలి మేమంతా. చాచీ వాళ్ల పప్పా కూడా తాతయ్యతో స్కూలు విషయాలు ఇష్టంగా చూసేవారట. అందుకే స్కూల్ ఎప్పటికీ నడిచేలా చూడాలని చాచీ అడుగుతోంది. ఇంకా, చాచా కూతురుతో మాట్లాడేము. తనకి కావలసిన డబ్బు సర్దుబాటు చేస్తామని, కానీ ఆమె సంసారం పట్ల బాధ్యత తెలుసుకోవాలని చాచా కండిషన్ కూడా పెట్టేరు. ఇంటినిండా కమ్ముకున్న సమస్యలు మెల్లిగా తొలగిపోతున్నాయి. పప్పాకూడా స్కూల్ ని అలాగే నడపాలని అంటున్నారు. పప్పా ఏమిచెప్పేరో తెలుసా దీదీ.........

'వైశాలీ, నా మనసులో ఏ మూలో స్కూల్ గురించి తప్పు చేస్తున్నామని అపరాధ భావం ఉంది. కానీ, పిల్లలంతా ఆస్తుల పంపకం గురించి, వాళ్ల హక్కుల గురించి మాట్లాడుతుంటే నాకు అయోమయంగా ఉండేది. తాతయ్య లాగా మనం ఎందుకు నడపలేక పోతున్నామని బాధ. సరి అయిన నిశ్చయం లేదు మా మనసుల్లో అని అనిపిస్తోంది. ఇప్పుడు నువ్వు, మహేంద్ర ఉన్నారు మీ కంటే చిన్న వాళ్లని గైడ్ చేసేందుకు. నాకు బలం వచ్చిందమ్మా. చాచా వాళ్లు కూడా నాతోనే ఉన్నారు.

రెండు ,మూడు నెలలుగా ఏదో చెడు కాలం అందరినీ కమ్మింది అనిపిస్తోంది. దాన్ని ఇంకా మొయ్యలేము మనం. తాతయ్య ప్రారంభించిన పరంపర ఇలా కొనసాగుతూనే ఉండాలి. పక్క వాళ్లకి ఏదైనా అవసరముందా అని ఆలోచించే వాళ్లు ఎందరు ఉంటారు ? ఉన్నా చెయ్యాలన్న సంకల్పం ఎందరికుంటుంది?సహాయం చేసే అవకాశం మాత్రం ఎందరికుంటుంది ?' అన్నారు పప్పా!

ఇవన్నీ మాట్లాడేక పప్పా చాలా ఉత్సాహంగా కనిపించేరు .

పప్పాకి మేమిద్దరం ధైర్యం కలిగించేమని సంతోషంగా ఉంది. ముందుగా నీకు చెబుతున్నాను. రేపు స్కూలు గురించిన వార్త అధికారికంగా వింటావులే ' అంటూ ముగించింది.

రజని కి గుర్తు వస్తున్నాయి, ఆమె మొదటిసారి గైక్వాడ్ సీనియర్ ని కలుసుకున్నప్పుడు ఆయన అన్న మాటలు ..........

'ఈ పిల్లలకి చదువు కావాలి. వ్యక్తులుగా సమాజానికి అవసర పడాలన్నా, తమను తాము తీర్చి దిద్దుకోవాలన్నా చదువుకోవలసిన అవసరం ఉంది. వాళ్ల అవసరంలో సహాయం చేసే అవకాశం మన అందరికీ ఉంది.' ఎంత చక్కగా చెప్పేరు !

నిజమే , అవకాశం! ఏమో ఇలాటి సందర్భం ఒకటి తనకు తటస్థ పడక పోతే ఇలాటి విషయాన్ని ఆలోచించేది కూడా కాదు. మరేదో ఉద్యోగంలో ప్రవేశించి ఉండేది. ఒక సాధారణ రొటీన్ ని స్వంతం చేసుకునేది.

రజని ఆనందానికి హద్దు లేదు. ఇంకా ఎప్పటిలాగే స్కూలు జరుగుతుందన్న ఆలోచన ఆమెని నిలవనీయటం లేదు. 'ఆజ్ మై ఊపర్, ఆస్మాన్ నీచే ' అనుకుంటూ గొంతు విప్పి పాడుకుంది.

★★★★★★★★★★

తెల్లవారి స్కూలు కెళ్తే ............. వార్త ఎలా పాకిందో!

స్కూలు ఎప్పటిలాగే పిల్లలు, వాళ్ల వెనుక పెద్దలతో సందడిగా ఉంది .

స్కూలు గేట్లోంచి గోవింద్ గైక్వాడ్తో పాటుగా ఆయన తమ్ముళ్ళు, వైశాలి, ఆమె భర్త అందరూ లోపలికి రావటం చూసి స్కూలు ఆవరణలో పిల్లలంతా ఒక్కసారిగా కేరింతలు కొట్టేరు. చెట్ల క్రింద నుండి, ఆటస్థలం లోంచి పరుగులు తీస్తూ వచ్చి గైక్వాడ్ ల కందరికీ ఎదురొచ్చేరు. అది ఇన్నాళ్లుగా తాము మిస్ అయ్యామన్న భావమే లేదు, అలవాటైన ఒక దైనందిన చర్యగానే తోచింది వాళ్ళందరికీ. గోవింద్ గైక్వాడ్ కళ్ళు చెమర్చేయి. ఆ పిల్లల హృదయాలకి క్షమ అనే ఒక భావమే తెలియదేమో, ఒక్క ప్రేమించటం తప్ప.

ఆయనకి మాత్రం ఎన్నాళ్లుగానో స్కూలుకి దూరమై బ్రతికినట్లు తోచింది. ఏమైంది తమకి ఇన్నాళ్ళుగా?ఈ ఆవరణ, ఈ పిల్లలు, ఇక్కడ ప్రతి అంగుళం, ప్రతి ఇసుక రేణువు, గాలికి తలలు ఊపుతూ ఆనందంగా ఆహ్వానిస్తున్న ప్రతి చెట్టు ...... వీటినన్నింటినీ వదిలి ఎలా గడిపేరు తామంతా ?

వరండా మెట్లు ఎక్కుతున్న ఆయన చేతికి ఆసరాగా తన చేతిని అందించిన రజనికి మాత్రం తాను ఆ స్కూలుకి రావటం అదే మొదటి రోజేమో అని అనిపించింది. దశాబ్దాలుగా పరిచయమున్న ఆ పరిసరాలు క్రొత్తగా, తనకి ఏమీ కానివిగా కనిపించేయి ఒక్కక్షణం.

'రజనీ, మీరంతా మొదటి నుండీ చెబుతూనే ఉన్నారు స్కూలుకి దూరమైతే నేను, నాకుటుంబం ఏమి పోగొట్టుకుంటామో ........... ఏమో ............ ఏమైందో నాకూ తెలియదు .

మృత్యువుకి అతి సమీపంగా వెళ్లి వచ్చేను. ఆ క్షణాల్లో కూడా స్కూలు నా మనః ఫలకం మీద స్పష్టంగా ఉంది. ఒక్కసారి అవకాశం ఉంటే ఏదైనా చేస్తాను అనుకున్నాను. అందుకే మళ్లీ హాస్పిటల్ నుండి ఇంటికి వచ్చేను. ఈ నిర్ణయం తీసుకునేవరకూ ఊపిరి మాత్రమే ఉన్న జీవచ్ఛవంలా ఉన్నాను . ' ఆయన మరి మాట్లాడలేక మౌనంగా ఉండిపోయేరు. రజని, ఆమె వెనుక మిసెస్ శర్మ మిగిలిన అందరూ అర్థమైంది అన్నట్లు తలలు వూపేరు.

మ్యానేజ్ మెంట్ కోరుకున్నట్లు పిల్లలు ఫీజులు పెంచేరు, కాని అతి స్వల్పంగా. ఇలాగే భవిష్యత్తులోనూ కొద్ది కొద్దిగా స్కూలు నిర్వహణకి పిల్లల వైపు నుండి కూడా సాయం అందించేందుకు అందరూ మనస్ఫూర్తిగా ఒప్పుకున్నారు.

ఆరోజు జరిగిన స్టాఫ్ మీటింగ్ లో ఇంక పైన కొన్నేళ్ల పాటు ప్రతి సంవత్సరం ఇంక్రిమెంట్లు, డి .ఏ . లు ఉండవని, టీచర్లు కూడా అర్థం చేసుకుని తమ సహకారం ఇవ్వాలని మ్యానేజ్ మెంట్ అన్నప్పుడు సీనియర్లు ఎవరి దగ్గరనుండి గట్టిగా ప్రతిఘటన రాలేదు, కానీ జూనియర్ టీచర్లు కొందరు మాత్రం అభ్యంతర పెట్టేరు. వాళ్లకి మరొక దారి ఎప్పుడూ ఉంది. తాము కోరుకునే ఆఫర్ వచ్చినప్పుడు ఎటూ బయటకు వెళ్లే అవకాశం వాళ్లకు ఉంది.

అప్పుడే వారం రోజులు గడిచిపోయేయి స్కూలు తెరిచి, పాఠాలు మొదలై. నెలరోజులకు పైగా ఒక ప్రతిష్టంబన. ఒక తోచనీయని ఇబ్బందిని కలిగించిన రోజులన్నీ ఇట్టే మాయమైపోయేయి.

ఆరోజు ఆదివారం! అయినా స్కూలు ఆవరణ కోలాహలంగా ఉంది. పిల్లలు ఆనందంగా పరుగులెడుతూ స్కూల్ నలువైపులా చూడ ముచ్చటగా అలంకరిస్తున్నారు. ఒక పండుగ వాతావరణం అక్కడుంది.

రజని లాటి సీనియర్ టీచర్లు అందరూ కలిసి స్కూలుకి సంబంధించిన సభ్యులందరికీ, ముఖ్యంగా పిల్లలకీ, పిల్లలతో పాటు పిల్లల తల్లిదండ్రులకి లంచ్ ఏర్పాటు చేసేరు స్కూలు తిరిగి ప్రారంభం కావటానికి వాళ్ళు చూపించిన చొరవ మరిచి పోలేనిది. పెంచిన ఫీజులు కట్టం అని పంతం పట్టి కూర్చోకుండా తమకు చేతనైనంత బరువు తామూ మోసేందుకు సిద్ధపడ్డారు.

స్కూల్ నడపం అని గైక్వాడ్స్ మొండికేసినా వాళ్లకి ఆర్థికంగా జరిగే నష్టం ఏమీ ఉండదు. పైగా ఈ అవకాశాన్ని పురస్కరించుకుని స్కూలు తొలగించి ఏ ఆర్థిక పరమైన లావాదేవీలకో ఆ స్థలాన్ని వినియోగించుకునేవారేమో!

కానీ, వాళ్లూ అలా అనుకోలేదు.

పిల్లల నుంచి వచ్చిన సందేశం అందుకుని తమవంతు పని తాము చేసేరు.

అయితే ఏ వ్యవస్థ అయినా ఎప్పటికీ ఏ సమస్యా లేకుండా జరిగి పోదు కదా.

లంచ్ అయ్యాక వీణ మాట్లాడుతూ రిజైన్ చేస్తున్నానని చెప్పేసరికి ఎవ్వరికీ అర్థం కాలేదు విషయం. ఆమె నవ్వుతూ చెప్పింది తాను భర్తతో పాటు హైదరాబాదు వెళ్లి పోయేందుకు నిర్ణయించుకున్నానని, త్వరలో వెళ్లిపోతానని.

రజని తనలోతాను అనుకుంది బహుశా ఇలాటి మార్పు కోసమేనా ఆమె దెబ్బ తగుల్చుకుంది!? ఇన్నాళ్ళకి మంచి నిర్ణయం తీసుకున్న వీణని అభినందించింది.

మనసు , మాయ పర్యాయ పదాలని తెలుసు!
మళ్లీ మళ్లీ రంగురంగుల ఆశ నిరాశల్ని అద్దుతుంటాయనీ తెలుసు!
నారింజరంగు సూర్యోదయాలు చైతన్య రహదారుల్ని పరుస్తుంటే,
ఊదారంగు సాయంత్రాలు మాత్రం గుండె నిండా గుబులు మబ్బుల్ని నింపుతూ ఉంటాయి!
అయినా ..........
ఆరారు ఋతువులు సహవాసం చేసే పెరటి పచ్చదనం ఎర్రెర్రని ఆశల్ని పూస్తూనే ఉంటుంది!
ప్రకృతి పంచే సందేశాల విందు వెన్నంటి ఉండే ఆర్ద్రతవుతుంది!
తూర్పున బయలు దేరిన ఉత్సాహం పడమటి దిక్కుగా నిస్త్రాణ అవుతుంది!
నిశీధి నిశ్శబ్దం అలుపు తీర్చే లాలిపాటవుతుంది!
నిద్దట్లో పాపాయి అమ్మని పెనవేసుకునే అనురాగ మవుతుంది!
ఆర్చుకుపోయిన మనశ్శరీరాలకు ఇల్లు ఆత్మీయ బంధువవుతుంది!

గైక్వాడ్స్ మాత్రం క్రొత్త ప్రిన్సిపాల్ కోసం మళ్లీ వెతుకులాట మొదలు పెట్టేరు.

రజని ఇల్లు చేరేసరికి మనీషా తల్లి ఆమె కోసం ఎదురుచూస్తోంది. ఆమెని కూర్చోబెట్టి చాయ్ కలిపి తెచ్చింది రజ .ఈ వారంలో ఆమె ఇది రెండోసారి వచ్చి కలవటం. నిశ్శబ్దంగా చాయ్ త్రాగి అలా రజనిని చూస్తూ కూర్చుంది. ఆమె మనసు కృతజ్ఞతా భావంతో తడిసి ముద్ద అయింది.

ఆరోజు పందరి గురించి, ప్రెసిడెంట్ గారి మాటల గురించి మనీషాతో చెప్పంగానే ఆమె ఒక్క క్షణం కూడా ఆలోచించకుండానే ' నాకు పెళ్లి వద్దు దీదీ. నా కుటుంబానికి నా అవసరం ఉంది. వాళ్లకి చెప్పేయండి ' అనేసింది .

కానీ రజని ఆమెని వదల లేదు.

' ఎప్పటికీ కుటుంబంకోసం నువ్వే చెయ్యాలని, చెయ్యగలవనీ ఇంట్లో వాళ్లు అనుకోరు. అది సాధ్యం కాదు కనుక. రేపు నువ్వు పని చెయ్యలేని స్థితి వస్తే కుటుంబంలో సభ్యులకి నువ్వు పరాయి దానివే అవుతావు. అదీకాక నీ కుటుంబం కోసం నువ్వు కష్టపడటం పందరి కి అభ్యంతరం కాదు. మీ ఇద్దరిదీ ఒకటే కుటుంబం అయినప్పుడు నీతో పాటు అతనూ నీ వెంట ఉంటాడు. మీ ఆయీ ని ఒక్కసారి తీసుకురా. నేను మాట్లాడాలి. నువ్వు తీసుకు రాకపోతే నేను నీ వెంట వచ్చి ఆమెని కలుస్తాను.'

రజని గట్టిగా చెప్పటంతో తల్లిని తీసుకు రాక తప్పలేదు మనీషాకి. మొదటి సారిగా కూతురి పెళ్లి ప్రస్తావన రజని నోటి వెంట విన్న మనీషా తల్లి వెంటనే అవునని అనలేకపోయింది. ఇంటికి పెద్ద దిక్కులా ఇన్నేళ్లుగా ఇంటిని మోస్తున్న కూతురు పెళ్లి చేసుకు వెళ్లిపోతే సంసారం ఏమైపోతుంది ? రజని చెప్పిన మాటలు విని మౌనంగా వెళ్లి పోయింది ఆమె.

ఇంటికెళ్ళి పదే పదే ఆలోచించింది. ఆమె తన కంటికి తానే అపరాధి లాగా కనిపించింది. ఇంట్లో పిల్లలకి బాధ్యత తలకి ఎత్తుకోవాలన్న విషయం అర్థం అయ్యేలా చెప్పవలసిన పని తనదే అనుకుంది. ఆ తర్వాత ఆమె ఇంకా ఆలస్యం చెయ్యలేదు. మనీష కి చెప్పింది, ఇంక తనదైన జీవితాన్ని ఆలస్యంగా నైనా మొదలు పెట్టమని.

తల్లి మాటలు వింది మనీషా. పెళ్లి అయినా తన సంపాదన మీద తనకే హక్కుంటుంది. కుటుంబానికి చెయ్యదలచిన సాయం చెయ్యవచ్చు అనుకుని గుండెల నిండా ఊపిరి పీల్చుకుని క్రొత్త జీవితానికి సన్నద్ధం అయింది.

మనీషా తల్లి కృతజ్ఞతా భావంతో కన్నీరు పెట్టుకుంది,

'తల్లిని అయి ఉండీ సంసారం బాగోగులు చూస్తున్న మనీషా పెళ్లి గురించి ఆలోచించలేదు. ఆ పిల్ల వెళ్లి పోతే బాధ్యత లేని పిల్లలతో సంసారం నడిపించే ధైర్యం లేదు. నేను స్వార్థంగా ఆలోచించేను. అయినా ఆ పిల్ల మంచితనం దానికి శ్రీరామ రక్ష అయింది. మీ ఋణం తీర్చుకోలేనిది', అంటూ రజని చేతులు పుచ్చుకుని ఆమె వలవలా ఏడ్చేసింది. మనసులో భారం తీరేవరకూ అలా కూర్చుండి పోయింది.

మనీషా వచ్చింది తల్లిని తీసుకు వెళ్లేందుకు. ఆమె చేతిలో గులాబీలతో ఉన్న అందమైన బొకే. జాగ్రత్తగా తీసుకొచ్చి రజని రోజూ శ్రద్ధగా అలంకరించే ఫ్లవర్ వేజ్ లో అమర్చింది. ఆ ముఖంలో పెళ్లి కళ కాబోలు, దాని తాలూకు ఒక మెరుపు ఉంది.

'దీదీ , నిన్ను చూడాలని ,మాట్లాడాలని రోజూ ఒకటే గొడవ పెడుతోంది ఆయీ ' అంటూ నవ్వింది.

నవ్వు ముఖాలతో వెళ్లిపోయేరు తల్లీకూతుళ్లు .

విరాజిత ఫోన్ ........! ఎన్ని విషయాల మధ్య, ఎన్ని పనుల మధ్య బిజీబిజీగా గడిపేస్తున్నా సముద్రాల ఆవల ఉన్న కూతురి పిలుపుకి రజని అలా ఎదురుచూస్తూనే ఉంటుంది. తనంతట తాను పిలిస్తే బిజీ అంటూ దొరకనే దొరకదు.

'అమ్మా, నీకు ఒక గుడ్ న్యూస్ , నేను వచ్చేస్తున్నాను. నా కెరీర్ ని పక్కన పెట్టి కొన్నాళ్ల పాటు మళ్లీ చిన్న పాపాయిని అయిపోయి నీ దగ్గర ఉండాలని వస్తున్నాను. అమ్మా, ఇంతకీ నన్ను ఇలా వెళ్ళమని ఆదేశించింది ఎవరో తెలుసా?........ శైలు పిన్ని దగ్గరకు వెళ్లేను కదా ఈ మధ్య. పిన్ని కూతురు దీపూ చెబుతోంది నీ స్కూలు గురించి, దాని భవిష్య ప్రణాళిక గురించి .

అంతా చెప్పేక నన్ను నిలదీసింది.

'అక్కా, నువ్వు ఎందుకు ఈ పని చెయ్యాలనుకోవటం లేదు?. నీ చదువు అయిపోయింది. మళ్లీ ఉద్యోగంలో బిజీ అయిపోవటం ఎందుకు? హాయిగా ముంబై వెళ్లి , మీ మమ్మీతో కలిసి పనిచేయ్యచ్చు కదా అని. నాకూ నిజమే అనిపించింది.'

కూతురి మాటలకి రజని ఆనందంతో తబ్బిబ్బు అయింది. ఎందుకో రజనికి ఒక్క వారం క్రితం స్కూలు ఉన్న పరిస్థితి జ్ఞాపకం వచ్చింది. ఒక శూన్యాన్ని నింపుకున్న ఆకాశంలా ఎంత వైరాగ్యాన్ని, ఎంత నిర్లిప్తతని పోగు చేసింది అందరి గుండెల్లో! సూర్యుడూ లేడు,వెచ్చని కిరణాలూ లేవు ! చందమామా లేడు, చల్లని వెన్నెలా లేదు! నక్షత్రాలు లేవు,వెలుగు పూలూ లేవు!

ఇంతలో .......... భయపెట్టిన నల్ల మబ్బు జాడ లేకుండా పోయినట్లు ........

ఏ స్వర్గపు దారులు వెంటో బయలుదేరి, ఏ అచ్చరల వేలికొసల సాయంతోనో అమ్మ ఒడి లాంటి బడిలోకి గలగలమనే సెలయేటి ప్రవాహమై ఒక్క పెట్టున ఉరికిన చైతన్యం!

చిరునవ్వులూ ,చిట్టి పాదాల సవ్వడులుతో స్కూలు స్కూలంతా సూర్యోదయాల్ని పూయిస్తూ, ఇంద్రధనుస్సులకి మరిన్ని రంగులద్దుతూ, రేపటి ప్రపంచానికి క్రొత్త ఆశలు, క్రొత్త నమ్మకాలు అందించేందుకు వచ్చేసిన చిన్నారులని మనసారా ఆశీర్వదించింది రజని .

ఇంటి నాలుగు వైపులా అల్లుకుంటున్న గులాబీల సుతి మెత్తని పరిమళాలని ఆస్వాదిస్తూ రజని అలా వాటిని చూస్తూ ఉండిపోయింది. ఈ గులాబుల్లో మనీషా, ఆమె తల్లి , స్కూలు, పిల్లలు, ఇంకా తన ప్రపంచంలోని అందరూ పేరు పేరునా ఉన్నారని తలుచు కుంది . అవును, ఇది ఒట్టి గులాబీల గుత్తి కాదు , తన చుట్టూ పరుచుకున్న గులాబీల తోట.

గులాబీలకి వాటి సహజ సిద్ధమైన సౌకుమార్యం, అందం ఉండనే ఉంటాయి. వాటిని అంటి ముళ్లూ ఉంటాయి. అవికూడా అవసరమే కదూ వాటి అస్తిత్వం కాపాడుకుందుకు!

"The destiny of the world is determined less by the battles that are lost and won than by the stories it loves and believes in." – Harold Goddard , English professor.